
# సాయి మాస్టర్ దర్శనం



రచన

పూజ్యశ్రీ జూటూరి వెంకట సుబ్బయ్య గారు

[JVS MATER గారు]

# ముందు మాట

మాష్టర్ దర్శనం అనే ఈ వ్యాసాలు అన్నిటి లో శ్రీ JVS master గారు తన గురువైన శ్రీ భరద్వాజ మాష్టరు గారితో తన ఆధ్యాత్మిక ప్రయాణం, అనుభవాలు, యాత్రలు, సాధనల గురించి వివరంగా, హృదయానికి హత్తుకునే విధంగా వివరించారు. వారి గురువైన శ్రీ భరద్వాజ మాష్టరు గారిని తొలిసారి షిరిడీలో ఎలా కలుసుకున్నారు, ఎందరో మహానుభావులను వారితో కలిసి దర్శించిన విధానం, వారి ఆధ్యాత్మిక సాధన, భరద్వాజ మాష్టరు గారితో సంభాషణలు చక్కగా పొందుపరిచారు. ఇంకా ఒంగోలులో ప్రప్రథమంగా భరద్వాజ మాష్టరు గారితో JVS master గారింట్లో సత్సంగాలు ప్రారంభం కావటం, తరువాత కాలంలో వారు ఒంగోలులో స్థిరపడటం, లాయరు పేట సాయి బాబా మందిర నిర్మాణానికి స్థల సేకరణ నుంచి వారు చేసిన అపారమైన సేవ ఈ వ్యాసాలలో ప్రతిబింబిస్తుంది.



పూజ్యశ్రీ & శ్రీమతి జూటూరి వెంకట సుబ్బయ్య గారు

# మాస్టర్ దర్శనం - 1

"కూజింతం రామరామేతి, మధురం మధురాక్షరం
అరుహ్యాకవితాశాఖ, వందేవాల్మీకికోకిలం"

## శ్రీ రాముని కల్యాణ గుణ సంపన్నుడే మన మాస్టర్

తపస్వి అయిన శ్రీ వాల్మీకి తపస్స్వాధ్యాయ నిరతుడైన నారదమునిని ఈ క్రింది విధంగా ప్రశ్నించడంతో శ్రీమద్రామాయణ మహాకావ్యం అరంభ మవుతుంది. ఈ లోకంలో ఇప్పుడు సకల కల్యాణగుణ సంపన్నుడైన మానవుడున్నాడా? అనేది వాల్మీకి ప్రశ్న. శ్రీ వాల్మీకి దృష్టిలో అ కల్యాణ గుణవంతుడు ఈ క్రింది గుణాలు కలవాడు.

1. సౌశీల్యవంతుడు
2. సద్గుణశీలి
3. మహావీరుడు
4. ధర్మజ్ఞుడు
5. కృతజ్ఞుడు
6. సత్యసంధుడు
7. దృఢవ్రతుడు
8. ప్రతిజ్ఞా పాలకుడు
9. సర్వభూత హితుడు
10. సర్వజ్ఞుడు
11. సర్వసమర్థుడు
12. ఆత్మజ్ఞుడు
13. జితక్రోధుడు
14. ప్రజ్ఞాశాలి
15. అసూయరహితుడు

నారద మహర్షి క్షణకాలం ఆలోచించి ఇక్ష్వాకు కులంలో పుట్టిన శ్రీరాముడు సకల కల్యాణ గుణశోభితుడని లోకము కొనియాడుతున్నదని అన్నాడు. వాల్మీకి దృష్టిలో ఈ కల్యాణ గుణాలతో శోభిల్లే మానవుడు శ్రీరామునితో ధీటైన దైవసముడే. కావుననే కల్యాణ గుణశోభితుడైన శ్రీరాముని జీవితాన్ని మహా మహిమాన్వితమయిన కావ్యంగా మలచి, శ్రీరామాయణాన్ని శ్రీ వాల్మీకి లోకానికి

అందించి ఎనలేని మేలు చేశాడు. కబీరు, తుకారాం, త్యాగయ్య, రామదాసు మొదలయిన మహాత్ములు శ్రీ రామాయణ గ్రంధాన్ని, శ్రీరాముడ్ని సేవించి తరించడం మనం ఎరిగిందే.

శ్రీరామచంద్రునిలో, పూజనీయ భరద్వాజ మాస్టర్‌గారిలో ఈ కల్యాణ గుణాలు వ్యక్తమయ్యే సన్నివేశాలు నిశతంగా పరిశీలిస్తాము.

## 1. సౌశీల్యము :

మహాత్ములు తమకంటే తక్కువ స్థాయిలో వున్నవారిలో తరతమబేధం పాటించకుండా వాత్సల్యంతో కలిసి మెలసి మసలడాన్ని వారి సౌశీల్యము అనవచ్చు. దశరధ మహారాజు పుత్రుడు, జనక మహారాజు అల్లుడు, పట్టాభిషేకంతో యువరాజు కాగల శ్రీరామచంద్రుడు తనను అరణ్యవాసం చేయమన్న కైకయందు, అరణ్య వాసములో సరయూనదిని దాటించిన బోయవాడు గుహుని యందు, తనచేత ఎంగిలి ఫలాలను ఆరగింపచేసిన బోయ స్త్రీ శబరియందు చూపిన ప్రేమ, వాత్సల్యం అనన్య సామాన్యమయినవి. సీత కొరకు రావణునితో పోరాడిన జటాయువు గురించి, అపహరింపబడిన భార్య కొరకు సామాన్య భర్తవలె హృదయ విదారకంగా శోకించి, తండ్రివలె ఉత్తర క్రియలు జరిపించి, సద్గతిని ప్రసాదించిన శ్రీరాముని సౌశీల్యము వర్ణించుటకు మాటలు చాలవు. అలాగే శ్రీ పూజనీయ మాస్టర్‌గారు ఐ.ఎ.ఎస్. అధికారి కాగల ఉన్నత విద్యను అభ్యసించి, విద్యావేత్తయేగాక, మహాత్ములచే తమవంతటి వారిగా శ్లాఘించబడిన మహనీయుడు. విదేశాల్లో గొప్పసాయి భక్తులుగా, ఆధ్యాత్మక వేత్తగా గుర్తింపు లభించిన బహు గ్రంధకర్త. ఇప్పుడు శ్రీ మాస్టర్‌గారి సౌశీల్యాన్ని ప్రతిబింబించే కొన్ని ఘట్టాలు చూద్దాము.

వారు మా ఆహ్వానంపై ఒంగోలు వచ్చిన తొలిరోజుల్లో కొంతకాలం సంతపేటలోని మా యింటిప్రక్కనే అద్దె ఇంట్లో వున్నారు. ఇందుకు కొద్ది రోజుల పూర్వమే శ్రీ మాస్టర్‌గారు తమ చిరంజీవి ద్వారకనాధ్ జ్ఞానేశ్వర్ బారసాల

నామకరణాలను మా యింట్లోనే జరిపించి, తమస్వంత ఖర్చుతో అన్న సంతర్పణ కూడా చేశారు. శ్రీ మాస్టర్‌గారిని శ్రీరాముని ప్రతిరూపముగా భావించి సేవించుకుంటున్న 92 ఏండ్ల రామభక్తురాలు, ఆమె కుమారునితో సహా పేదరికము కారణంగా మా యింటి ప్రాంగణములోనే చిన్న రేకులషెడ్ వేసుకుని వుంటూ ఈ కార్యక్రమాలకు సేవలందించడం విశేషం. గతంలో అవ్వగారి దంపతులు కోటికిపైగా శ్రీరామనామం వ్రాసిన (కుడి చేయి సహకరించినపుడు ఎడమచేత్తో, ఆ తర్వాత కుడిచేత్తో దీక్షగా వ్రాశారట) రామకోటి పుస్తకాలను నెత్తిన పెట్టుకొని గ్రామస్తులు వెంటరాగా భద్రాచలం వెళ్ళి శ్రీరామునికి సమర్పించి భక్తిపారవశ్యంలో తన్మయులై ఇంటికి వచ్చాక శ్రీ సీతారామ కల్యాణం, అన్నసంతర్పణ జరిపిన ధన్యజీవులు. ఒకనాడు సీతారాములు సాక్షాత్కరించి ఆమెతో “నేటికి 10వ రోజున మధ్యాహ్నం నీ రాముడ్ని తీసుకుపోతాను. ఆ తర్వాత నీవూ వస్తావు” అన్నారట. ఈ హఠాత్ పరిణామానికి దుఃఖించి వారుపోతే నాకు దిక్కెవరు? వారితో నన్నూ తీసుకుపోండి అన్నదామె. వారికి, నీకు, మేమేదిక్కు నీకు పూర్తికావలసిన కర్మశేషముంది. ఆ తర్వాత నీవు మా దగ్గరకు వస్తావు అంటూ వారు అదృశ్యమయినారు. నాటి 10వ రోజున ప్రొద్దునే ఆమె భర్త పక్షవాతం సోకి లేవలేని స్థితిలో మంచానపడి స్పృహ కోల్పోయారు. మృత్యువు ఆసన్నమయినదని గ్రామస్తులు వారి దగ్గర రామనామం చేయించారు. మధ్యాహ్నానికి ఆమె భర్త అంతటి దీనస్థితిలో కూడా లేచి నిలబడి రామయ్య, సీతమ్మ వచ్చారు. హారతి తీసుకురా అని అవ్వగారితో అన్నారు. చూడు రామయ్య పాటలు పాడమంటున్నారు అని అంటూ పాటలు పాడారు. సీతమ్మ మరొక పాట పాడమనగా అమ్మా నీరసంగా వుంది నిలబడలేనంటూనే దేహత్యాగం చేశారు. ఇలా పూర్తి ప్రజ్ఞతో దేహత్యాగం చేసిన ధన్యజీవి ఈ అవ్వగారి భర్త. ఆ తర్వాత ఆవిడ అంగలకుదురు శ్రీ వాసుదాసుగారి ఆశ్రమంలో సీతారామలక్ష్మణులను కొంతకాలం సేవించుకుంది. అక్కడి గురువులు దాటిపోయాక మా స్థలంలోనే రేకుల పంచకు చేరుకుంది. అవ్వగారి ఈ ప్రస్థానం వెనుక శ్రీరాముని అదృశ్య హస్తముందని తోస్తోంది.

కారణం ఆమె మాస్టర్‌గారిలో శ్రీరాముని చూసుకునేది. ఆయన పాదసేవచేస్తూ మంచంలో పడకుండా ఎవ్వరిని ఇబ్బంది పెట్టకుండా దబ్బున దాటిపోవాల్సి వుంది నాయన అనేది. అందుకు మాస్టర్‌గారు పోయేం చేస్తారు. మరలా రావడానికి తాపత్రయ పడటమే కదా! ఉన్నంతకాలం భగవంతుని సేవచేసుకో సమయం వచ్చినప్పుడు ఎవ్వరిని ఇబ్బంది పెట్టకుండా పోతావు. నేను హామీ అనేవారు. ఆనాడు శ్రీరాముడు శబరిపై చూపించిన ప్రేమ వాత్సల్యాలను శ్రీ మాస్టర్‌గారు అవ్వగారిపై చూపించేవారు. వారికి అవసరమయిన నిత్యావసర వస్తువులు, అగరుబత్తి సాంబ్రాణి కడ్డీలవంటి పూజా ద్రవ్యాలతో సహా పొట్లాలు కట్టించి పంపేవారు. ఆమెకు ఏ లోటూ రాకుండా చూసుకునే బాధ్యత నాపై వుంచారు. శ్రీమాస్టర్‌గారు ఆమెకు వరం ఇచ్చినట్లుగానే వైకుంఠ ఏకాదశినాడు ఉదయం 9 గంటలకు పూర్తి ప్రజ్ఞతో వున్న అవ్వగారు హఠాత్తుగా దేహత్యాగం చేశారు. శ్రీమాస్టర్‌గారు ఆమెపై విబూధిచల్లి ఆమె దేహంవద్ద కొంతసమయం గడిపి ఉత్తర క్రియలకు ఏర్పాటు చేశారు. ఇంత నిరుపేద స్థితిలో వున్న అవ్వగారిపై శ్రీమాస్టర్‌గారి సౌశీల్యానికి మాటలు చాలవు.

విద్యానగర్ కళాశాలలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తునప్పుడు పేద విద్యార్థులందరికి ఆర్థిక సహాయము అందించి, వారిని ఉత్తమ సాధకులుగా తీర్చిదిద్దిన పుణ్యజీవి మన మాస్టర్. కొన్ని నెలల్లో జీతం మిగలక టిఫెన్ తినడం మానివేసి ఇలా సహాయం అందించడం మానలేదు. ఇలా వారందించిన సహాయముతో ఉన్నత విద్యలు అభ్యసించి నెలకు వేలాది రూపాయలు ఆర్జిస్తున్న వారు శ్రీ మాస్టర్‌గారి ద్వారా ఎంతమంది పేదవారిని ఆదుకుంటున్నారన్నది ప్రశ్నార్థకమే కదా? మరెందరో పేదవిద్యార్థులకు తనపలుకుబడితో చేతి వృత్తులలో శిక్షణ యిప్పించి, స్వావలంబన మందించి అండగా నిలచిన శ్రీ మాస్టర్‌గారి సౌశీల్యము అనన్య సామాన్యము. ఒంగోలు లాయరుపేటలో శ్రీ మాస్టర్ గారుండుటన్న వీధిలోనే ముగ్గు అమ్ముకొని జీవించే కొన్ని నిరుపేద కుటుంబాలు వుండేవి. ఎందరో గొప్పవాళ్ళు కార్లలలో, రిక్షాలలో, ఆటోలలో

మాస్టర్‌గారి దర్శనానికి వస్తుండటం చూసిన వారికి మాస్టర్‌గారు ఏదో గొప్పవారన్న భావం ఏర్పడింది. వారిలో కొందరు అప్పుడప్పుడు శ్రీమాస్టర్‌గారి దగ్గరకు వచ్చేవారు. అంతగొప్పవారైన మాస్టర్‌గారు తమపట్ల బేధభావం చూపకుండా తనవారిలాగానే ప్రేమ ఆదరాభిమానాలను చూపుతూ, ప్రియంగా పలకరించి, ప్రసాదమివ్వడము వారిని ఆశ్చర్యపరచింది. వారి సన్నిధిలో వారికి తామేదో తక్కువ వారన్న బేదభావం తొలగిపోయింది. దీని ప్రభావం వారి కుటుంబసభ్యులపై పడింది. శ్రీ మాస్టర్‌గారికి ఒక చొక్కా కుట్టించి ప్రేమతో సమర్పించారు.

చిన్నారుల త్యాగం, ప్రేమ బహుశ మాస్టర్‌గారి హృదయాన్ని తాకాయేమో వారానాడు ఆ చొక్కానే మొదట ధరించారు. తమ గురువైన శ్రీ సాయినాధుడే ఆ చిన్నారుల రూపంలో తనకు చొక్కా కుట్టించనంత తృప్తి వారిలో ఆనాడు తొంగి చూసింది. ఇలా తనకన్న తక్కువ స్థాయివారి పట్ల కూడా శ్రీ మాస్టర్‌గారు వ్యక్తం చేసిన సౌశీల్యానికి శ్రీరాముడే సాటి.

బహూనాంజన్మనామంతే జ్ఞానవాన్మాం ప్రపద్యతే
వాసుదేవః సర్వమితి సమహాత్మా సుదుర్లభః

మనఃప్రసాదః సౌమ్యత్వం, మౌనమాత్మావినిగ్రహః
భావసంశుద్ధిరిత్యేత తపోమానసముచ్యతే (భ)

దేవద్విజగురుప్రాజ్ఞ పూజనం శౌచమార్జవమ్
బ్రహ్మచర్యమహింసా చశారీరం తపముచ్యతే (భ)

# మాస్టర్ దర్శనం - ౨

## శ్రీసాయి దివ్యత్వం మేల్కొన్న శ్రీ మాస్టర్‌గారు

1978 దసరా సెలవల్లో, శిరిడీలో, సద్గురు శ్రీసాయి సన్నిధిన, మాస్టర్‌గారిని ప్రథమంగా కలిశాక, తరచువారు ఒంగోలులోని మా యింటికి రావడం, వారి దర్శన ఆశీస్సులకై నేను విద్యానగర్ వెళ్ళడం జరుగుతుండేది. ఎన్నో జన్మల పుణ్యఫలంగా, నాకు, దశాబ్దకాలంపాటు పూజ్య గురుదేవులైన శ్రీ మాస్టర్‌గారితో సన్నిహితంగా మెలిగే అదృష్టం దక్కింది. జీవన్మరణ సమస్యలతో సతమతమవుతున్న జీవులెందరో వారి సన్నిధిన శాంతిని పొందడం చూచి వారి దివ్యశక్తికి, ఆ శక్తికి మూలకారణమైన సాయి మహిమకు ముగ్ధుడినయ్యాను.

నేనొక ఉదయం విద్యానగర్ వెళ్ళి, మాస్టర్‌గారి రూములో కూర్చుని వున్నాను. వారికి మొదటి పీరియడ్ క్లాసున్న మూలాన, నా యోగక్షేమాలడిగాక ఇంట్లోకి వెళ్ళిపోయారు. ఆ గదిలో కొలువైయున్న మహాత్ములను చూస్తూ, అక్కడ తాండవిస్తున్న శాంతిని అనుభవిస్తూ, మాస్టర్‌గారి రాకకై ఎదురుచూస్తూ కూర్చున్నాను. ఇంతలో నోట నురగలు కక్కుతూ, మాట, పలుకు లేకుండా అచేతనంగా పడివున్న ఒకవ్యక్తిని తీసుకువచ్చారు. జీవచ్ఛవంలాగా వున్న ఆ మనిషి ప్రాణంతో వుండే అవకాశం లేదనుకున్నాను. తాటి చెట్టుపైన గుడ్లతేలు కుట్టగా అతడు క్రిందపడి స్పృహ కోల్పోయాడని చెప్పారు. వెంటనే అతనికి ఏదైనా సహాయం అందించాలని మనసు తొందర చేసింది. నేను లోపలికి వెళ్ళి మాస్టర్‌గారికి ఈ విషయం చెప్పాను. వారు డ్రస్ వేసుకొని పుస్తకం చేతపట్టుకొని, ఆ గదిలోకి వచ్చి బాబా వీబూధి పెట్టుకుంటూ అతడి కష్టాన్ని అడిగి, తెలుసుకున్నారు. అతనికి విబూధి పెట్టి, తేలుకుట్టిన చోట విబూధిని అదిమిపెట్టి, కొద్ది క్షణాలు సాయి స్మరణలో నిలిచారు. రెండు మూడు నిమిషాల తర్వాత అతడిలో చలనమొచ్చింది.. మరికొద్ది సేపటికి స్పృహ వచ్చి కండ్లు తెరిచాడు. ఆ తర్వాత లేచికూర్చున్నాడు. ఇప్పుడు నొప్పి ఎక్కడ వున్నదన్న

మాస్టర్ గారితో, విషం క్రిందకి దిగుతున్నదని చూపాడు. మరికొన్ని క్షణాలు గడిచాయి. తేలుకుట్టిన చోట మంటపుడుతున్నదని చెప్పాడు. మాస్టర్‌గారు లోపలికి వెళ్ళి, హోమియోమందు కలిపిన నీళ్ళగ్లాసును నా చేతికి ఇచ్చి 10 ని. ఒకసారి స్పూను నీళ్ళు అతని గొంతులో పోయండి. మంట తగ్గిన తర్వాత వాండ్లు వెళ్ళిపోతారు అంటూ చెప్పులేసుకొని కాలేజీకి వెళ్ళిపోయారు. గుడ్డతేలు కుట్టినవాడు బ్రతకటమే కష్టమంటారు బ్రతికినా బాధనివారణకు రెండుమూడు రోజులు పడ్తుందని విన్నాను. ఇక్కడ విషం దిగడం, బాధతగ్గడం, అంతా క్షణాల్లో ముగిసింది. అతని బాధను కేవలం సాయివిభూది ఎలా తగ్గించిందో నాకర్థం కాలేదు. నేను ఇంతకుముందెన్నడు ఇలాంటి అలౌకిక మహిమలను చూచివుండకపోవడమే నా ఆశ్చర్యానికి కారణం. ఇది ఒకదివ్య మహిమలా తోచింది. గంట తర్వాత కాలేజి నుండి వచ్చిన మాస్టర్‌గారిని ఈ విషయమే అడిగాను. ఇది కేవలం విభూది మహిమే. సాయి కూడా భక్తులను అలాగే ఊదీతోనే తగ్గించడం చరిత్రలో చూచాం కదా. ఇందులో నా ప్రమేయం ఏమీలేదు. ఇతనికి త్వరగా బాధా నివృత్తి జరగాలన్న నా ప్రార్థనను సాయి మన్నించారు అన్నారు. నేను ఇంకా ఆశ్చర్యంలో నుండి తేరుకోకముందే "మీరు బాబా విభూది పెట్టినా బాధలు తగ్గుతాయి చేసి చూడండి" అన్నారు. నాకు నోట మాటరాలేదు. తేలుకుట్టిన చోట విభూది పెట్టగలను కాని నా మొర ఆలకించేలా సాయిని ఎలా ప్రార్థించగలను? కానీ మాస్టర్‌గారు సంకల్పసిద్ధులు కదా! వారి మాట సత్యమయి నిలుస్తుంది. సాటిజీవుల రూపంలో సాయిని సేవించుకునే వరం ప్రసాదించారా అనిపించింది. మనస్సు పులకించి ఆనంద బాష్పాలు రాలాయి. శ్రీ మాస్టర్‌గారి మార్గదర్శకత్వంలో సాధనచేసి, ఆ శక్తికి కూడా పొందాలని నిర్ణయించుకున్నాను.

పవిత్ర షిరిడీలోవున్న రోజుల్లో శ్రీ మాస్టర్‌గారు అనిర్వచనీయమయిన తృప్తి, శాంతి, ఆనందాలతో తన్మయులై వుండేవారు. వారికి శిరిడీయే పుట్టిల్లు. సాయినాధుడే తల్లి, తండ్రి, గురువు, దైవం. అనన్య సామాన్యమయిన వారి

గురుభక్తికి శ్రీ సాయినాధుడే సాటి. సమర్ధసద్గురుడైన సాయి సన్నిధిన జీవుల సకల బాధలు శమించేవి. ఇలాగే మాస్టర్‌గారి సన్నిధి కూడా జరుగుతూ వుండేది. మా బజారులోనే వుంటున్న వృద్ధవండితుడు శ్రీ సత్యనారాయణగారెంతో కాలంగా ఆయాసంతో బాధపడుతూ ఇంగ్లీషు మాత్రలతో ఉపశమనం పొందుతుండేవారు. మాస్టర్‌గారు మా యింటికి వచ్చినప్పుడల్లా వారు దర్శనానికి వచ్చి, తనకన్నా వయస్సులో చిన్నవాడైనా మాస్టర్‌గారిపై గురుభావం వుంచి పాద నమస్కారం చేసి ఆశీస్సులు అందుకునేవారు. సత్సంగాలప్పుడు వ్యక్తమయ్యే వారి దివ్యత్వానికి, నిరాడంబరత, ధర్మనిరతి, గురుభక్తికి ముగ్ధులయ్యేవారు. ఒకనాటి రాత్రి 9 గంటలప్పుడు వారికి ఆయాసం ఎక్కువై మాత్రలకు లొంగ, శ్వాస బంధించబడి, ప్రాణాపాయ స్థితి వచ్చింది అనిపించింది. ఆ సమయంలో మాస్టర్‌గారు సత్సంగం చేస్తున్నారు. ఆయన తన బాధను సంజ్ఞలతో వ్యక్తం చేశారు. వారికి గాలి తగిలేట్లు సుఖంగా కూర్చోబెట్టించి నొసట విభూది పెట్టి, కొన్ని క్షణాలు వారిపై దృష్టినిలిపి సత్సంగాన్ని కొనసాగించారు. ఆ గదిలో తాండవిస్తున్న ప్రశాంతతలో మునకలు వేస్తూ, మాస్టర్‌గారి సత్సంగం వింటూ అంతా కూర్చున్నాము. క్రమేపి, శ్రీ సత్యనారాయణగారి మనస్సు ప్రశాంతమై, బాధ తగ్గుముఖం పట్టింది. మరికొద్ది సేపటికి, తనకు ఆయాసమన్న విషయం కూడా మరచిపోయి, మాస్టర్‌గారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వసాగారు. చివరకు శ్రీ మాస్టర్‌గారికి నమస్కరించుకొని ఊది ప్రసాదాలు తీసుకొని, ఇంటికి నడుచుకుంటూ వెళ్ళిపోయారు. తమ సన్నిధిలో, భక్తుల బాధలు, కొద్ది సమయంలోనే శమించడం మాస్టర్‌గారికి సాయినాధునితో గల తాదాత్మ్యాన్ని నిరూపిస్తున్నది. ఆ కారణంగా శ్రీ సాయిమాస్టర్‌లు, తమనాశ్రయించిన వారందరికీ కల్పవృక్షము, కామధేనువు, చింతామణి అయినారు.

మాస్టర్‌గారి సంకల్పం దైవ సంకల్పమే కారణం ఎంతటి జటిల సమస్యనైె వారి సన్నిధిన సూర్యుని ముందు మంచులా కరిగిపోయేది. మొదట్లో

మాస్టర్‌గారు భక్తుల బాధలు సాయికి నివేదించి పరిష్కరించేవారు. ఇలా పరిష్కారం పొందిన వారిలో నిజమయిన పరివర్తన కాని, ధర్మాచరణకాని, నైతిక విలువలు కన్పించక తిరిగి పూర్వపు సమస్యలలోనే కూరుకుపోయేవారు. ఈ లోపాన్ని సరిదిద్దుతూ సమస్యల పరిష్కారానికి వచ్చిన వారిచేత సాయి లీలామృత పారాయణ చేయించి సాయివెలుగుతో వారి జీవితాలను నింపారు. అంతటితో సమస్యలను పరిష్కరించుకోగల సామర్థ్యం వారిలో మేల్కొనేది.

నేనొకసారి ఎలక్షన్ డ్యూటీపై చంద్రపాడు వెళ్ళాను. నాకు వైష్ణవపూజారింట్లో భోజనం ఏర్పాటు చేశారు. ఈ ఉపకారానికి ప్రతిగా, భరద్వాజ మాస్టర్‌గారు లోకానికి అందించిన గురుసాంప్రదాయ విశిష్టతను, సద్గురు సాయినాథుని దివ్యత్వాన్ని, వారిని నమ్ముకుంటే జీవితంలో లోటే వుండదని, అందుకు మాస్టర్‌గారు వ్రాసిన సాయి లీలామృతము పారాయణ ఎలా శరణ్యమో, నాకు అర్థమయిన మేరకు వివరంగా చెప్పాను. అందుకు ఆయన స్పందిస్తూ, తనకు ఒక్కడే కొడుకని, అతను చదువుకునేటప్పుడే వివాహం చేశానని, ఆడపిల్ల పుట్టిందని, నాటినుండి సంపాదన లేకుండా సంసారం భారమవుతుందని బాధపడేవాడని, ఆ కారణంగానేమో ఐదేళ్ళనాడు ఎవరికి చెప్పకుండా ఇల్లువిడచి వెళ్ళిపోయాడని, అతనికోసం వెతకని ప్రదేశం లేదని, నాటినుండి తాము జీవశ్చవాల్లా బ్రతుకుతున్నామని, కన్నీళ్ళు కారుస్తు చెప్పాడు. వారి దీనస్థితికి నా హృదయం ద్రవించింది. వారికి సాయపడేందుకు సాయిమాస్టర్ నన్ను ఆవూరు పంపారని తోచింది. మాస్టర్‌గారిని పరిచయం చేసి, వారి ఆశీస్సులిప్పిస్తే ఆ కుటుంబానికి మేలు జరుగుతుందని తలచాను. నాలుగు రోజుల తర్వాత వారిని ఒంగోలు రప్పించి, మా యింటి ప్రక్కనే వుంటున్న మాస్టర్‌గారిని పరిచయం చేశాను. ఎంతో గారాబంగా పెంచిన తమను గాని, భార్యాబిడ్డలను గాని గత ఐదు సంవత్సరాలుగా చూడలేదు కాబట్టి, తమబిడ్డకు ఏమైనా అయివుంటుందేమోనని దుఃఖిస్తూ వాడిని కాపాడమని మాస్టర్‌గారికి చెప్పాడు. మాస్టర్‌గారు ఆ కుర్రవాడి పేరు, వయసు, చదువు వగైరా వివరాలు అడుగుతూ,

సకల దేవతా స్వరూపుడైన సాయికృపతో తప్పిపోయిన బిడ్డలు, విడిపోయిన దంపతులు, ప్రమాదకరమయిన జబ్బుల వంటి సమస్యలు ఎలా పరిష్కారమయినాయో సోదాహరణ పూర్వకంగా వివరిస్తూ పూజారిగారి దుఃఖం మర్చిపోయేలా చేశారు. మీ విష్ణాలయ అర్చకత్వంతో పాటు సాయి చరిత్ర పారాయణ చేయండి. ఇష్టమైన వంటకాన్ని వదలండి. తినేముందు పిడికెడు అన్నం సాయి ప్రీత్యర్థం బయట విడిచి పెట్టండి ఆయన దయతో మీ బిడ్డ తప్పక తిరిగి వస్తాడు అంటూ సాయి లీలామృతాన్ని వారికందించారు. కొన్ని రోజుల తర్వాత ఆ గ్రామంలోని రామభక్తులు స్వామి దర్శనార్థం తిరుపతి వెళ్ళారు. తిరుమలలోని వెయ్యికాళ్ళ మండపం ముందుగా పోతున్న వారికి ఆ మండపం నుండి వస్తున్న గడ్డపుస్వామిపై దృష్టి పడింది. మనవూరి పూజారిగారి అబ్బాయిలా వున్నాడనుకుంటుండగానే అతడు వీరిని గుర్తుపట్టి పారిపోయే యత్నం చేశారు. రూపం గుర్తుపట్టలేనట్లున్నా, తమ కండ్ల ఎదురే పుట్టి పెరిగాడు కావున సులభంగా అతడిని గుర్తించి, పట్టుకొని చంద్రపాడు తీసుకువచ్చారు. తల్లిదండ్రులను దుఃఖంలో ముంచి, ఎందుకిలా పారిపోయి వచ్చావని అడుగగా, ఆదాయంలేని గుడి అర్చకత్వంతో కుటుంబాన్ని ఎలా పోషించాలో తెలియక, భయంవేసి, సంసార భారం మరింత పెరక్కముందే, ఇల్లు వదిలి వచ్చేశానని, ఆ మండపంలో వైఖానస మతంవారికి సహాయపడుతూ జీవితం నెట్టుకొస్తున్నానని చెప్పాడు. ఆ తండ్రి బిడ్డను చూసి, కౌగిలించుకొని, ధైర్యం చెప్పి అన్ని వసతులతో వున్న పెద్దదేవాలయంలో ఇద్దరూ కలసి అర్చకత్వం చేపట్టి, శ్రీ సాయిమాస్టర్‌ల కృపలో చీకు చింతా లేకుండా జీవిస్తున్నారు. ఇన్ని సంవత్సరాలుగా పరిష్కారం లేక పీడిస్తున్న సమస్య, మబ్బుతెరలా విడిపోవడం మమ్మల్ని ఆశ్చర్య పరచింది. శ్రీసాయి మాస్టర్ కృపకు మరోమారు ముగ్ధుల మయ్యాము.

ఈ సమస్య పరిష్కారానికి మార్గం చూపిన మాస్టర్‌గారిని సాయి అవతారంగా కొందరు భావించారు. కాని ఇది నిజంకాదు. కారణం శ్రీరమణులను ఒక భక్తుడు మిమ్మల్ని అంతా భగవంతుని అవతారం అంటున్నారే

నిజమేనా అన్నాడు. భగవాన్ దేనికి జవాబివ్వరు కదా కాని ఆ భక్తుడు వదల్లేదు జవాబివ్వక తప్పదనుకొన్న భగవాన్ "అవతారం భగవంతుని సాక్షీ విలాసమే. కాని జ్ఞాని సాక్షాత్ భగవంతుడే అన్నారు". అంటే నది సముద్రంలో కలిశాక తన ఉనికిని కోల్పోయి, సముద్రమే అవుతుంది. అంటే తత్వతః మాస్టర్‌గారు సాక్షాత్ సాయినాథుడే. ఫిబ్రవరి 9, 1963 నాడు షిరిడీలో సాయిసమాధివద్ద సాయితో భావాద్వైత సమాధి స్థితిలో 5 గంటల పాటు నిలచిన శ్రీమాస్టర్‌గారిలో శ్రీసాయి దివ్యత్వమే మేల్కొంది.

అనుద్వేగకరం వాక్యం సత్యం, ప్రియహితం చయత్
స్వాధ్యాయాభ్యసనం చైవవాఙ్మయమ్ తపముచ్యతే (భ)

నైతే సృతీపార్థ జానన్ యోగీ ముహ్యతికశ్చన
తస్మాతు సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున (భ)

గ్రహణం, ధారణం, పటుత్వం, ప్రకాశం,
ఈ నాలుగు సాధకుడికి ఉండి తీరవలసిన గుణాలు

విషయ వాసనలు మనసులోకి రాకూడదు.
రాగద్వేషములను విడవాలి. మమత, అహంకారము, కోరికలను
త్యజింపుము.

# మాస్టర్ దర్శనం - 3

## నాస్తికులు, హేతువాదుల భేటీ

తాను యోచనతో అన్వేషించి, స్వానుభవ పూర్వకంగా తెలుసుకున్న అంశాలను సత్యాన్వేషకులైనవారు ఇతరులతో నిగ్గు తేల్చుకోవడానికి ఉత్సాహంతో వుండేవారు. ఆ రోజుల్లో ఇక్కడ (ఒంగోలులో) నాస్తికులు, హేతువాదుల ప్రభంజనం తీవ్రంగా వుంది. ప్రయోగశాలలో పరీక్షించనిదే దేనిని నమ్మని యువకులెక్కువ మంది దేవుడు కండ్లకు కనబడలేదన్న కారణంగానో, సమాజంలో మతంపేరిట చలామణి అవుతున్న అవినీతి, అంధవిశ్వాసాలవల్లో దుర్భర దరిద్రంతో అలమటిస్తున్న సాటిజీవులను భగవంతుడు ఆదుకోలేదన్న ఆక్రోశంతోనో (ఇందుకు కర్మ సిద్ధాంతం కారణం) నాస్తిక హేతువాద ప్రభావానికి లొంగిపోతున్నారు. వీరికి నిజమైన ఆధ్యాత్మికత అందించాలని, వారిలోని వ్యక్తిగత సామర్థ్యాలను వెలికితీసి, తద్వారా వారి కుటుంబానికి, సమాజానికి ఇతోధికంగా ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని మాస్టర్‌గారు భావించారు. అందరి జీవితాలను తృప్తి, శాంతి ఆనందాలతో నింపనున్న లక్ష్యంతో వారు, మనం పనిచేస్తున్నాము, అంటే ఇద్దరి లక్ష్యమొకటే. అయినప్పుడు మనలో వైషమ్యాలెందుకుండాలి. కాని వ్రాయడానికి వీలులేని పదజాలంతో నాస్తికులు దేముడిని తిట్టడం, అవహేళన చేయడం చూస్తున్నాము. అందుచేత వారికి ఆస్తి, నాస్తి చర్చావేదికను ఏర్పాటు చేసి ఇద్దరి అభిప్రాయాలను పరస్పరం తెలియచేసుకొని ఏది సత్యమైనదో చర్చల ద్వారా నిగ్గు తేల్చుకుందాము నిరూపణ అవుతుంది. ఆ మార్గంలో కృషిచేసి, సమాజపురోభివృద్ధికి తోడ్పడాలని, అందరూ కలసి మరింత కృషి చేయాలని మాస్టర్‌గారు అభిప్రాయపడి హేతువాదులతో చర్చావేదికను ఏర్పాటు చేయమన్నారు.

అభిప్రాయం బాగానేవుంది కానీ, అమలు పరచడములో చాలా చిక్కులు వున్నాయి. వాండ్లలో ఎక్కువ మంది ఉద్రేక స్వభావులు, ఎక్కువగా చదువుకున్న వారు కాదు. మీదు మిక్కిలి ఓడిపోతున్నామన్న బాధ కల్గినప్పుడు వారిస్పందన





ఊహించలేనిది కాదు. కాబట్టి ఉన్నంతలో అంగబలాన్ని సిద్ధం చేసుకొని మొదట చర్చావేదికను ఏర్పాటు చేశాము. నాటి సభ అధ్యక్షుడు చర్చను ప్రారంభిస్తూ "దేముడనేవాడు లేడనుకోండి, ఎవరికీ నష్టంలేదు. ఉన్నాడనుకోండి, లేడు అనుకొని నోటికి ఇష్టం వచ్చినట్లు తిట్టేవానికి ఆయన నుండి ఇబ్బందులు వుంటాయి. కావున సంయమనంతో మాట్లాడటం మంచిది" అన్నారు.

విజ్ఞాన శాస్త్రాల ఆధారంగా భగవంతుడు వున్నాడని నిరూపిస్తున్న మాస్టర్‌గారి వాగ్ధాటికి, తార్కికశక్తికి నాస్తికుల కాళ్ళక్రింద మట్టి కదలసాగింది. మాస్టర్‌గారి విశ్లేషణాశక్తి, జ్ఞానసంపద, సమయస్ఫూర్తి, ఆ వర్గానికి చెందిన మేధావుల మస్తిష్కాలకు అమృత సేవనంలా వుంది. మాస్టర్‌గారు ఇచ్చిన శాస్త్రీయ ప్రమాణాలతో కూడిన సమాధానాలు, వారి సందేహాలకు సంతృప్తికరంగా వున్నాయి. కాని అవర్గానికి చెందిన రాజకీయులు అక్కసు పట్టలేక "సైన్సు మాది. మాకు కావలసినది మీ పురాణాల్లోని దేముళ్ళు ఏమి చేశారు? ఏమి తిన్నారు? చెప్పండి". వారి బాధను అర్థంచేసుకున్న మాస్టర్‌గారు అతని స్థాయికి దిగివచ్చి "నీవేది తింటే ఆయన అదే తింటాడు" అన్నారు. కొందరు సందేహ నివృత్తికై మా యింటికి వచ్చి మాస్టర్‌గారిని కలుసుకోసాగారు. అందులో ఒకరు "ఆత్మనిప్పులో కాలదు, నీటిలో తడవదు అని భగవద్గీత చెబుతుందికదా? మీరు ఆత్మజ్ఞులని (మమ్మల్ని చూపుతూ) అంటున్నారు. మరి మీకు ఎలక్ట్రిక్ షాక్ ఇస్తే దాని ప్రభావం మీపై వుండకూడదు కదా?" అన్నాడు. నీవు చెప్పినది అంతా నిజమే. కాకుంటే నీవు దేహధర్మాలను, ఆత్మధర్మాలను కలగాపులగం చేసుకొని కన్‌ఫ్యూస్ అవుతున్నావు. ఉదాహరణకు నీవు స్కేలు తెచ్చి నా బరువు చూస్తానంటే ఎలా? అలాగే వుంది. నీ ప్రశ్న కూడా! బరువుతూచే యంత్రంతో పొడవు కొలుస్తానంటే ఎలా? దేహమే ఆత్మ అన్న భావంతో మాట్లాడుతున్నావు. కానీ వేదాలు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత ఆ రెండువేరని, ఆ రెండు ఒకటని తలచడం అజ్ఞానం, అని స్పష్టం చేస్తున్నాయంటూ దాదాపు 5,6 గంటల సేపు అతని అపోహను ప్రమాణాలతో తొలగించారు. ఇలా మాస్టర్‌గారిని కలిసిన వారంతా సాయిలీలామృతాన్ని చేతబట్టి హేతువాద, నాస్తికుల గుండెల్లో గుబులు పుట్టించారు.

రాష్ట్రవ్యాప్తంగా వున్న నాస్తిక, హేతువాదులు అప్రమత్తం అయి, మాస్టర్‌గా నుంచి పొంచివున్న ప్రమాదాన్ని గుర్తించి హెచ్చరికలు జారీచేసుకున్నారు. ఈసా హేతువాద సంఘ రాష్ట్ర అధ్యక్షునితో చర్చలకు సిద్ధపడమన్నారు. ఈ సవాల్‌ను హృదయపూర్వకముగా అంగీకరించారు. మాస్టర్‌గారి రక్షణకై మేము పటిష్టమై చర్యలు తీసుకున్నాము. వారిద్దరి మధ్య సుదీర్ఘమయిన చర్చలు జరిగాయి. వారికి మతం అంటే పురాణాలు, అందులోని పాత్రలు, నేటికాలానికి విద్దూరంగా తోచే మనుధర్మ శాస్త్రంలోని ఆచారాలు, నేడు ప్రచారంలో వున్న అంధవిశ్వాసాలు కులమత వైషమ్యాలు. మాష్టర్‌గారు ఆధునిక విజ్ఞాన శాస్త్రాలలో హిందు మతానికి, మూల గ్రంధాలయిన ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీతలలో భగవంతుని గూర్చి చెప్పబడ్డ అంశాలను సమన్వయ పరిచారు. ఫిజిక్స్‌లో నోబుల్ ప్రైజ్ విన్నర్ అయిన కాప్రా, ఐన్‌స్టీన్ వంటి శాస్త్రజ్ఞుల పరిశోధనా వ్యాసాలను ఉదహరించారు. మతం మానవుని వ్యక్తిగత, సామాజిక అభివృద్ధికి, సమాజంలో నైతిక విలువల స్థాపనకు ఏర్పడిందని చెప్పారు. కాని వారు అంధభావాలను, కొందరు స్వార్థపరులు సృష్టిస్తున్న మతకలహాలను మతం ముసుగులో పాతుకుపోయిన అంధవిశ్వాసాలను, మూఢాచారాలను ఉదహరించి బలపరుచుకో చూశారు. కాని మాస్టర్‌గారు దానికి అవకాశం ఇవ్వలేదు. వీరిలో మాస్టర్‌గారు లాంటి అన్వేషకులు లేకపోవడం విచారకరం. నాటి నుండి వారు మాస్టర్‌గారిని ప్రధమ శత్రువుగా భావించారు. ఎలాగైనా సరే వారి ఆత్మస్థైర్యాన్ని బలహీనపరచాలన్న ధృఢ నిశ్చయానికి నాస్తికులు వచ్చారు. అభూత కల్పనలతో కొన్ని కరపత్రాలను ముద్రించి, ఒంగోలు విద్యానగర్‌లలో పంచారు. కాని వజ్రసంకల్పులైన మాస్టర్‌గారు జంకక, న్యాయపరంగా వారి విమర్శలను ఎదుర్కొనే యత్నం చేశారు. ఈ రోజుల్లోనే మేమంతా కలసి పక్ష పత్రిక ప్రారంభించాలని ఒక నిర్ణయానికి వచ్చాము. కాలాంతరంలో మాస్టర్ ఒంగోలు వచ్చి స్థిరపడటానికి మా హృదయ పూర్వకమయిన ఆహ్వానమే ప్రధమ కారణమైన ఇతరత్రా కొన్ని పరిస్థితులు కూడా కొంత వరకు సహకరించాయని చెప్పకతప్పదు.

# మాస్టర్ దర్శనం - 4

## మహనీయుడు శ్రీ మాస్టర్

ఆత్మనిష్ఠులైన మహనీయుల వైభవాన్ని దర్శించిన పూజ్య గురుదేవులు సాయికృపతో అనుభవ పూర్వకముగా భగవంతుని ఉనికిని తెలుసుకొని 1963, ఫిబ్రవరి 9నాడు షిరిడీలో పూర్ణసిద్ధిని పొందారు. తాను పొందవలసిన స్థితి ఎంతటి మహోన్నతమయినదో, మహాత్ముల సేవతో తెలుసుకొని, శాస్త్ర ప్రమాణాలతో సరిచూసి, సునిశితబుద్ధితో నిగ్గుతేల్చి, సద్గురు సేవతో స్వంతం చేసుకున్నారు. దేనిని పొందలేక మనస్సు వాక్కు తిరిగి వస్తాయో, దేనిని పొందాక ఇక పొందవలసినదంటూ వుండదో అటువంటి స్థితిని అందుకునే సాధనలో అవరోధాలన్నింటిని వివేక వైరాగ్యాలతో అధికమించారు. ఈ సాధనలో వారిని ఏ లౌకిక ప్రలోభము లొంగదీసుకోలేక పోయింది.

జిల్లెళ్ళమూడి ఆశ్రమంలో తీవ్ర తపోనిష్ఠలో నిలచిన మాస్టర్‌గారికి, తాను కట్టుకున్న లుంగీ మార్చాలని, నెలల తరబడి తోచకపోవడం ఇందుకు తార్కాణం. ఆశ్రమవాసుల్లో గుసగుసలుగా చెప్పుకుంటున్న ఈ విషయం అమ్మను చేరింది. బిడ్డ దైన్యానికి అమ్మహృదయం ద్రవించింది. విదేశీయులకు చేదోడువాదోడుగా వుంటూ ఆశ్రమ, పత్రిక నిర్వహణలో శ్రీసాయి లీలామృత రచనలో నిమగ్నులైన మాస్టర్‌గారిని, అమ్మ ఈ విషయం అడిగారు. ఇదేదో అంత ప్రాముఖ్యత లేని విషయంగా కొట్టిపారవేస్తూ "రెండోది వుంటే కట్టుకోనా" అన్నారు. మాస్టర్‌గారి నిర్లిప్తత అమ్మను ఆశ్చర్యపరిచిందేమో "నాచీర ఇస్తా కట్టుకోమన్నారు". శరీరాన్ని కప్పుకోవడానికి చీరైనా నారపట్టాఅయినా సరే ఫర్వాలేదు అనే అవధూత మనస్తత్వం మన మాస్టర్‌గారిది. అమ్మగారిచ్చిన చీరను ముక్కలుగా చేసి చినిగేదాకా వాడారు. అన్నగారితో వచ్చిన పంతం నెగ్గి, ఐ.ఎ.ఎస్. పాసై ఆధ్యాత్మికానికి అది తగదని వరించి వచ్చిన కలెక్టర్‌గిరిని గడ్డిపోచలా తృణీకరించడం ఇందుకు మరొక ఉదాహరణ. బాహ్య సౌందర్యానికి లక్షలు కుమ్మరిస్తామన్నా గొప్పవారి ప్రలోభాలకు లొంగక, శ్రీసాయి సందేశానుసారమే గృహస్థాశ్రమాన్ని స్వీకరించారు.





క్షణక్షణము ఆత్మనిష్ఠలో నిలచి, శ్రీసాయి సేవలో లభించిన ధర్మభిక్షతో జీవించారు. అసలుసిసలైన సాయి సాంప్రదాయాన్ని వేదధర్మాలతో రంగరించి, ఏ ఏ ధర్మసూక్ష్మాలకు కట్టుబడితే దైవం దయచూపుతాడో తదనుగుణంగా సాయి చరిత్రను మలచారు. సత్సంగాలను ఏర్పరచి, సాయిచరిత్ర పారాయణతో సాత్వికతను వృద్ధిచేసి సాటిజీవుల తరింపుకు అంకితమయ్యారు. మాస్టర్‌గారి ధర్మాచరణ, ధర్మరక్షణ, నిడారంబరత, నిరహంకారం, గురుభక్తి అనన్య సామాన్యం. ఒక సత్సంగంలో వారు అంటారు. "నేను ఎన్నడూ ధర్మాన్ని ఉల్లంఘించను, అలా జరిగిననాడు సూర్యుడు పడమర ఉదయిస్తాడు". అలాగే వారు ఉద్యోగ ధర్మాన్ని ఎన్నడూ ఉల్లంఘించలేదు. కాలేజి సెలవరోజుల్లోనే ఇక్కడకు వచ్చి సాయి సత్సంగాలలో పాల్గొన్నారు. ఎప్పుడైనా అనివార్యంగా వారికి అక్కడ వుండిపోవలసివస్తే సాయి అదృశ్య హస్తం కాలేజికి సెలవు ఇప్పించేది.

సాయితత్వ ప్రచారానికి, కాలేజీకి సెలవుపెట్టాల్సిన అవసరమేనాడు వారికి రాలేదు. ఇందుకు ఉదాహరణ 1980లో ఇక్కడ అక్కలకోటస్వామి చరిత్ర ఇంగ్లీషులో ప్రింటు అవుతున్నది. కొద్దిరోజుల్లో ఇక్కడి నుండి శ్రీమాస్టర్‌గారితో మేము అక్కలకోట మీదుగా షిరిడి యాత్రనేర్పాటు చేసుకున్నాము. స్వామి చరిత్రలను బస్సులో అక్కలకోట చేర్చాలన్న తపనతో గ్రంథ ముద్రణ నిర్విరామంగా కొనసాగిస్తున్నాము. కాని సమర్థులైన ప్రూఫ్ రీడర్స్ కొరత కారణంగా ప్రింటింగ్ మందగించి, పుస్తకాలు సకాలంలో చేతికి అందవన్న భయం పట్టుకుంది. విద్యానగర్‌లో వున్న మాస్టర్‌గారికి ఈ విషయం తెలియ చేశాము. వారు శని, ఆదివారాల్లో ఇక్కడే వుండి ప్రూఫ్ రీడింగ్ చేయసాగారు. చివరకు ఇంతమాత్రము సరిపోలేదు. వారు అనివార్యంగా వారంరోజులు అక్కడే వుండి ప్రూఫ్ ప్రింటింగులు కూడా చూసుకోవాల్సి వచ్చింది. ఈ రోజులకు సెలవు కోరుతూ ప్రిన్సిపాల్‌కు తంతి పంపాము. కాని అనూహ్యంగా విద్యార్థులు అంతా ఆందోళనకు దిగడంతో కాలేజీ మూతబడింది. మాస్టర్‌గారి దివ్య సంకల్పానికి శ్రీసాయి దివ్య ఆశీస్సులు తోడైనాయి. ఈ వారం రోజులు మా యింట్లోనే బసచేసిన పూజ్యగురుదేవులు శ్రీమాస్టర్‌గారికి, వారిని చూడవచ్చిన సాయిభక్తులకు సేవచేసే భాగ్యం మాకు లభించింది.

శ్రీ పూర్ణానందస్వామిగారి మాటల్లో శ్రీ మాస్టర్‌గారు ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసలలో సాయిని నిలపుకున్న భాగ్యశాలి. ఆకారణంగా, శ్రీసాయినిగాని, సాయిరూపులైన మహాత్ములునిగాని సాయిభక్తులనుగాని, షిరిడినికాని అల్పంచేసి మాట్లాడితే సహించేవారు కాదు. వాస్తవానికి శాస్త్రం ఇలా చెబుతుంది. "గురువుని గూర్చి విమర్శిస్తే వినకు, గురువు తల్లిదండ్రుల కన్నా మిన్న. నీ తల్లిదండ్రులను ఎవరైనా నిందిస్తే సహిస్తావా? నీ గురువు కీర్తి నిలపడానికి, ప్రాణాలు అర్పించడానికి అయినా సిద్ధంగా వుండు". సాయి ముస్లిమనీ, ఆయన భక్తిని అంటించుకొని భ్రష్టులమయ్యామని తలచే సాంప్రదాయభక్తుడోసారి మాస్టర్‌గారి సన్నిధిలో "వెనుక షిరిడి చాలా పవిత్రంగా వుండేది. దొంగతనాలు, దౌర్జన్యాలతో ఇప్పుడు భ్రష్టుపట్టింది అన్నారు. మా విశ్వాసాలను దెబ్బతీయగలిగామన్న తృప్తి అతని ముఖంలో తొంగి చూసింది. అతనికి ఎలా జవాబివ్వాలో మాకు తోచలేదు. అయినా మహనీయుడైన మాస్టర్ సన్నిధిన షిరిడీ గురించి అలా మాట్లాడటం దుస్సాహసమే. ఇంతలో మాస్టర్‌గారు అవునవును మనలాంటి వారు అక్కడ చేరాక మరొకలాగ ఎలా అవుతుంది చెప్పండి" అంటూ ముసిముసిగా నవ్వారు. ఆ భక్తుని ముఖంలో నెత్తురు చుక్కలేదు. తేలుకుట్టిన దొంగలాగా మెల్లగా జారుకున్నాడు. మాస్టర్‌గారి గురుభక్తికి, సమయస్ఫూర్తికి ముగ్ధులయ్యాము.

శ్రీలక్ష్మీసాక్షాత్కారం పొందిన మహాయోగి, శ్రీవేణుగోపాల్‌గారు, మాస్టర్‌గారి ఆదేశంపై షిరిడీవెళ్ళి సాయిని సేవించి, మహనీయుడైన మాస్టర్‌గారి ఆశీస్సులకై ఒంగోలు వచ్చారు. షిరిడీలో తన అనుభవాన్ని చెపూ "సాయి సమాధిని ముట్టుకొని నమస్కరించు కొన్నప్పుడు, ఏదో దివ్యశక్తి తనలోకి ప్రవేశించి షాక్ కొట్టినట్లు అయిందన్నాడు. శ్రీసాయి వారికి ఏదో దివ్యానుభూతిని ప్రసాదించారని మాస్టర్‌గారు మురిసిపోయారు. కాని అక్కడేవున్న వృద్ధభక్తునికి వేణుగోపాల్‌గారి దివ్యత్వంపై విశ్వాసం లేకనో, ఈర్ష్యతోనో వ్యంగ్యంగా" మీరు చెప్పినది నమ్మశక్యముగా లేదు. నేను ఎన్నో పర్యాయములు సమాధిని ముట్టుకున్నాను నాకెప్పుడలా షాక్ కొట్టలేదే అని ధీమాగా అన్నాడు. ఈ హఠాత్ పరిణామానికి శ్రీ మాస్టర్‌గారితో సహా అందరు దిగ్భ్రాంతి చెందారు. శ్రీ వేణుగోపాల్‌గారికి, శ్రీసాయి ప్రత్యక్ష దర్శనమిచ్చి, విభూతిని ప్రసాదించిన వైనం ఈయనకు తెలియదా లేక తనకన్నా చిన్నవాడైన ఇతనికి అంత అనుభవము





ఎలా ప్రాప్తించిందన్న సందేహమా? ఈర్ష్యా? మాస్టర్‌గారికి మాకు ఎంతో ప్రీతిపాత్రమయిన శ్రీ వేణుగోపాల్‌గారికి అంత అవమానం జరిగిందేమోయని మా మనస్సులు కృంగాయి. బహుశా ఆ వృద్ధుని ప్రవర్తన మాస్టర్‌గారికి కూడా జుగుప్స కలిగించిదేమో. "మీరు సమాధిని ముట్టుకోగానే ఆయనకు షాక్ కొట్టి వుంటుంది" అని చురకనంటించారు. ఆ వృద్ధ భక్తునికి అప్పుడు నిజంగా షాక్ కొట్టింది. పూజ్య గురుదేవుల సమయస్ఫూర్తికి, భక్త రక్షణకు నమోవాకాలు అర్పించాము.

మాతృప్రేమను చూపిస్తూ తల్లిలేని లోటును తీర్చే జిల్లెళ్ళమూడి అమ్మగారంటే మాస్టర్‌గారికి ఎనలేని భక్తి ప్రేమలు వుండేవి. అలాగే ఆధ్యాత్మిక శిఖరాగ్రాలను అందుకున్న మాస్టర్‌గారిపై అమ్మకు పుత్రవాత్సల్యం. ఈ కారణంగా వారు ఆశ్రమ సేవలో కొంతకాలం వున్నారు. శ్రీసాయి తత్వాన్ని శోధిస్తూ, శ్రీసాయి లీలను గ్రంథస్తం చేస్తున్న రోజులవి. వారు అమ్మనుగాక, సాయిని అధికం చేసి మాట్లాడుతారన్న అపోహతో మాస్టర్‌గారిపట్ల అసూయతో కాలిపోతుండే వారు. ఆశ్రమవాసులంతా అంతఃశుద్ధిగల పవిత్రులని చెప్పలేము కదా! ఒక భక్తుడొకడు మాస్టర్‌గారితో "అమ్మ తన వారెవరో, ఎవరుకాదో తెలుసుకోని పిచ్చిది" అన్నాడు. వ్యంగ్యంగా అమ్మలాంటి మహనీయులు సకలజీవ, సాధు, దేవతారూపులు కనుక వారి సేవలో దొర్లే పుణ్యపాపాలకు అనంతమైన ఫలముంటుందని అతనికి తెలియదు. ఈ కారణముగా అతని ప్రవర్తన ఎంత ప్రమాదకరమయినదో ఊహించవచ్చు. అనంత చైతన్య స్వరూపురాలైన అమ్మను అల్పజ్ఞులమయిన మనము అంచనా వేయడమా! ఇలాంటి మూర్ఖులగూర్చి శ్రీ పాకలపాటి గురువుగారు "ఈనాడు నంది అన్నవారే రేపు పంది అంటారు. ఇలాంటి శిష్యులకన్న నమ్మకంగా కనిపెట్టుకొని వున్న (నా) వ్యాధులే మేలు" అన్నారు. పై భక్తుని అజ్ఞానానికి మాస్టర్‌గారు బాధపడి "అవునవును అందుకే అమ్మ మన పూజలందుకుంటూ ఎత్తుగా మంచంపై కూర్చొని వుంటే, ఆమె కృపకై మనం నేలపై కాళ్ళవద్ద కూర్చొని వుంటాము" అన్నారు. ఈ చురక నంటించుకున్న మేధావి దిక్కుతోచక, మీరు ఎప్పుడు వెళ్ళిపోదామను కుంటున్నారు? అన్నాడు. మనము ఎక్కడ వున్నా చేసేపని ఇదే కదా! అన్నారు.

అంటే మాస్టర్‌గారు ఎక్కడ వున్నా మహాత్ముల సేవలో పై భక్తుడు ఎక్కడవున్నా కుళ్ళు రాజకీయాల సేవలో వుంటారని అర్థం. మహాత్ముడైన మాస్టర్‌గారి సమయస్ఫూర్తికి, మేధాసంపత్తికి, మీదు మిక్కిలి లోకజనని అమ్మపై భక్తికి మంత్ర ముగ్ధులమయ్యాము.

అయితే మనవలెనే మానవ మాత్రుడైన శ్రీ మాస్టర్‌గారిని పదేపదే మహనీయుడు మహాత్ముడు అనడానికి కారణమేమంటారు? ఈ క్రింది లీల చూడండి. మాస్టర్‌గారి మాతృసమానురాలైన వదినగారికి ఒకసారి మెడవాచి, నెప్పిచేసి, ఏ వైద్యానికి లొంగలేదు. దాదాపు నెలరోజులు ఆ నొప్పితో వారు బాధపడ్డారు. ఇది తెలిసిన శ్రీమాస్టర్‌గారు ఆమెను చూడటానికి వెళ్ళారు. వదినగారిని చూసిన క్షణంలో మాస్టర్‌గారి మనోనేత్రం ముందు రోకలి మెదిలింది. రోకలి తెప్పించి, మెడపై నెమ్మదిగా రుద్దారు. ఆశ్చర్యం! ఆమె బాధ తీసేసినట్లు పోయింది. ఆమెబాధకు రోకలికి సంబంధం ఏమంటారా? మహాత్ములు త్రికాలజ్ఞులు మనజన్మ పరంపరలు వారికే ఎరుక. ఏ ప్రారబ్ధం ఎలా వచ్చిందో, ఎలా పోతుందో వారికే తెలుస్తుంది. ఇలాంటి లీలను సాయిచరిత్రలో చూచాముకదా! మలేరియాతో బాధపడుతున్న బాలాజీ గణపతి షింపేతో సాయి, లక్ష్మీ దేవాలయం వెనుకవున్న నల్లకుక్కకు పెరుగన్నం పెట్టు నీ వ్యాధి పోతుందన్నారు. అలా చేయగానే అతని వ్యాధి పోయింది. అయితే మలేరియా వ్యాధికి, నల్ల కుక్కకు పెరుగన్నం పెట్టడానికి సంబంధం ఏమంటారా? కారణం శ్రీసాయి మనపాలిటి ప్రత్యక్ష దైవం. కాకుంటే పై లీల కారణంగా శ్రీసాయి దివ్యత్వం మాస్టర్‌గారిలో పూర్ణంగా ప్రతిబింబించిందని తెలుసుకుంటే లాభపడ్తాము. వారు చూపిన మార్గంలో సాయిని సేవించి, ఇహ పరసుఖాలను సొమ్ము చేసుకుంటాము. ఇదిగదా మన జీవిత లక్ష్యం. జీవన గమ్యం.

# మాస్టర్ దర్శనం - 5

## రాజకీయాలపై మాస్టర్ దృష్టి

ఒకనాటి ఉదయం మాస్టర్‌గారు సత్సంగ సభ్యులతో ముచ్చటిస్తూ విశ్రాంతిగా మా ఇంటి వరండాలో కూర్చుని వున్నారు. ఇంతలో ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు తన పరివారంతో అక్కడకు చేరుకుని, తాను ఎలక్షన్‌లలో పోటీ చేస్తున్నానని అందుకు మీ సహాయ సహకారాలు, ఆశీస్సులు కావాలని కోరాడు. సాయి భక్తులందరూ తనకు ఓటు వేసేలా చూడాలని మాస్టర్‌గారిని అర్థించాడు. మాస్టర్‌గారిని అతను అలా అడగటానికి అతనికి వున్న అర్హత ఏమిటా అని మనం ఆశ్చర్యపడవచ్చు. ఊళ్ళోకి వచ్చిన పీఠాధిపతులను పాద పూజలకు ఇళ్ళకు ఆహ్వానించి, వెండి వస్తువులతో, పట్టు పీతాంబరాలతో ఘనంగా పూజ చేసి, బాగా డబ్బు ప్రాపకమువున్న భక్తాగ్రేసుడుగా ప్రచారంలోకి వచ్చాడు. ఇదే బహుశా మాస్టర్‌గారిని పై విధంగా అడగటానికి గల ముఖ్య అర్హత. కాని జవాబుగా మాస్టర్‌గారు "నాకు రాజకీయాలపైన, రాజకీయ నాయకులపైనా నమ్మకం లేదు. ప్రజల ఓట్లతో ఈ రోజు గెలచి, అదే ప్రజలకు మొండిచేయి చూపించడమేగాక, తాము వ్యక్తిగతంగా బలపడేందుకు మాత్రమే పదవిని పెట్టుబడిగా ఉపయోగించుకుంటున్నారు. మా ఓటు, ప్రచారం సాయిబాబాకే. వారికి తప్ప మరెవ్వరిని గూర్చి ప్రచారం చెయ్యను" ఓటెయ్యమని చెప్పను. మేమంటు ఓటు వేయవల్సివస్తే పక్షపాతం లేకుండా అందరి గుర్తులపై ముద్ర వేస్తాము" అన్నారు. ఎందరో తనను మంచి చేసుకోవడానికి సకల విధాలా యత్నిస్తుండగా, ఈయన ఇతనిర్లక్ష్యముగా మాట్లాడుతున్నాడేమా అని మేము ఆశ్చర్యపోయాము. మాస్టర్‌గారి గురుభక్తికి, ధైర్యవిశ్వాసాలకు సంభ్రమాశ్చర్యాలు కలిగాయి.

ఏదో ఒక సందర్భంలో తన దగ్గర విరాళానికి రాకపోతాడా ఇంతకు పదిరెట్లు ప్రతీకారం తీర్చుకోపోతానా అన్నట్లు మాస్టర్‌గారివైపు చూస్తూ, అతడు

నిష్క్రమించాడు. అతడు కొన్ని నెలలపాటు తిరిగి మాస్టర్‌గారిని చూడలేక పోయాడు. ఈ నాయకుడే మరోసారి మందిర నిర్మాణానికి సహకార మందిస్తానంటూ, ముందుకు వచ్చి మాస్టర్‌గారితో ఇలా అన్నాడు. "నేను సినీస్టార్స్‌తో నృత్యసంగీత కార్యక్రమాన్ని నిర్వహించి లక్షల రూపాయలను ప్రోగు చేస్తాను. కాని మాస్టర్‌గారు ఈ సూచనని కూడా నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. సత్సంగాల నిర్వహణలో లక్షలాది సాయిభక్తులను ఏర్పరచి, వారి ద్వారా లభ్యమయిన దక్షిణతో మందిర నిర్మాణం జరగాలి. మందిరాన్ని వినియోగించు కొనే సామర్థ్యం గల భక్తులను రూపొందించి అట్టివారి హృదయాల నుండి పొర్లి వచ్చే సాయి భక్తికి ప్రతిరూపంగా మాత్రమే సాయిమందిరము నిర్మించ బడాలి. అప్పుడు మందిరం నిత్యకళ్యాణం, పచ్చతోరణంలా భక్తులతో శోభాయ మానంగా వుంటుంది అలాగాక ఒకరిద్దరు ఇచ్చిన విరాళంతో నిర్మిస్తే సమర్థవంతంగా మందిరాన్ని వినియోగించుకోగల భక్తులు లేక మందిరం వెలవెలబోతుంది. కొన్నికోట్ల రూపాయలు విలువ చేసే మందిరాలు ఈనాడు దేశంలో నిరుపయోగంగా పడివున్నాయి. ఇలాంటి మందిరాలను నిర్మించడం మన లక్ష్యం కాదు అన్నారు.

మాస్టర్‌గారు ఒకసారి ఒక ప్రముఖ రాజకీయ నాయకునితో కారులో ప్రయాణిస్తున్నారు. ఆయన ఆస్తికుడేకానీ, ఏ పనిచేసినా ఆర్థికముగా ప్రయోజనం ఉండాలనే తత్వం ఆయన మాస్టర్‌గారితో "నాకు ఇప్పుడు కోటిరూపాయలు కావాలి. భజన చేస్తె మీ సాయినాథుడు నాకింత డబ్బు ఇస్తాడా? ఈ భజనలతో ఏమి ప్రయోజనం? తిండి పెడతాయా? గుడ్డలు ఇస్తాయా" అన్నాడు. జవాబుగా మాస్టర్‌గారు "మీరు 108 సార్లు సాయిచరిత్ర పారాయణ చేయండి, బాబా తప్పకుండా మీ కోరిక తీరుస్తారు. మీకు అలారాకుంటే నేను ఈ ధర్మం ప్రచారం మానివేసి, ఈ పటాలను బయట పారేస్తాను అన్నారు. ఈ విషయం మాస్టర్‌గారు నాతో అన్నప్పుడు నాకు భయంతో ముచ్చెమటలు పోసాయి. కారణం ఆ నాయకుడు పారాయణచేసి ఏమండీ కోటిరూపాయలు రాలేదంటే ఎంత

ప్రమాదం. అందుకు జవాబుగా మాస్టర్‌గారు "అతడు ఎన్నుకున్న రాజకీయ జీవన విధానం ఒక్క పారాయణకే సమయమివ్వదు. 108 సార్లు పారాయణ అతనికి ఎలా సాధ్యం" అవదు. పట్టుదలతో సాయిచరిత్రను 108 సార్లు పారాయణ చేసాక, ఆయనను డబ్బు అడిగే సంస్కారం కోల్పోయి, కేవలం మీ కృపనే నాపై వర్షింపచేయండి అని సాయిని అడిగేస్తాడు, మారిపోతాడు" అని దృఢంగా పలికారు. ఇందుకు కాకాదీక్షిత్ ప్రత్యక్ష సాక్ష్యం. వారు కాలు కుంటిని సరిచేసుకొనేందుకు షిరిడీ వచ్చినా శ్రీ సాయిని దర్శించాక, తన మనసునవున్న కుంటిని సరిచేయమని ప్రార్థించారు. జ్ఞానుల సన్నిధి ప్రభావం మనలో అంతటి వివేకాన్ని మేల్కొల్పుతుంది.

శ్రీ సాయిపై మాస్టర్‌గారికి గల భక్తి విశ్వాసాలకు అచంచలమైన గురుభక్తికి నాకు ఆశ్చర్యమయింది.

ఫలాపేక్ష లేకుండా సాటిజీవుల శ్రేయస్సుకై చేసే కర్మ నిష్కామకర్మ.
అన్నదానం, బావులను త్రవ్వించటం బాటకు
రెండు పక్కలా చెట్లునాటటం వంటివి చేయుటం
నిష్కామమయిగా చేయు కర్మ యోగిని చేయును.

సర్వకాల, సర్వావస్థలయందు భగవంతుని స్మరించాలి.

అనన్యమైన భక్తి ద్వారా మాత్రమే భగవంతుని పొందగలము.

సర్వజీవుల యందు భగవంతుడే వున్నాడు. దానిని గుర్తించుకో.

# మాస్టర్ దర్శనం - 6

## యోగసిద్ధులు - మాస్టర్ దృష్టి

"బహుస్యాం ప్రజాయాయేతి" నేను అనేకమగుదును గాక అన్న భగవంతుని సంకల్పమే ఈ జగత్తుగా అందులోని జీవులుగా ప్రకటమయిందని వేదవాక్యం. ఈ సంకల్పమే జీవులను అనేకత్వ భావనకు గురిచేస్తున్నది. ఈ అనేకత్వ భావననే "మాయాశక్తి" అని, "మమ మాయా దురత్యయా" అని గీతలో శ్రీకృష్ణుడు అంటారు. శ్రీ సాయికూడా నన్ను మరచిన వారిని "మాయ భాదిస్తుందని" అన్నారు. జీవులు తరంగాల్లాంటి వారైతే దేవుడు సముద్రము లాంటి వాడని, అలలకు సముద్రము ఆధారమని, జీవులు, దేముడు తత్వతహ అభిన్నులని, ఈ చరాచర జగత్తుకు దేముడే మూలకారణమని, శాస్త్రాలు చెబుతున్నాయి. "జీవోబ్రహ్మైవనాపరః" అంటూ శ్రీ ఆదిశంకరులు ఈ భావాన్ని బలపరిచారు.

ఈ అనేకత్వ భావనకు గురియై జీవులు రాగ, ద్వేషాలపాలై,సుఖదుఃఖాలను కొనితెచ్చుకుంటున్నారు. దుఃఖానికి అనేకత్వ భావనే కారణము. ఆ భావం నశిస్తే దుఃఖముండదు ఇది నశించాలంటే ఏకత్వ భావనను పాటించాలి. అందుకు శోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు, నిరతాగ్నిహోత్రుడైన సద్గురువును సేవించడం ఒక్కటే మార్గము. ఈ సాధనలో కొంత పరిణితి చెందిన భక్తులను, యోగసిద్ధులు తమ బంధాలలో చిక్కించుకో చూస్తాయి. వీటికి లొంగితే, వాటి ద్వారా సామాన్యులను అబ్బురపరచే మహిమలు వ్యక్తమవుతాయి. ఈ మహిమలకు ఆకర్షితులైన జనం, అసాధకుల చుట్టూ చేరి కీర్తి ప్రతిష్ఠలతో ముంచెత్తి వారి ఆధ్యాత్మిక పురోభివృద్ధికి ఆటంకం అవుతారు. అంతటితో బలహీన పడవలసిన గర్వ అహంకారాలు బలపడి ప్రమాదంలో చిక్కుతారు. "ప్రమాదోమృత్యుః" కదా శాస్త్రం.

శ్రీ సాయినాథుడు ఈ కీర్తిప్రతిష్ఠలను వేశ్యల ముద్దులాటతో పోలుస్తూ,

సాధకుడు ఈ రెండింటికి దూరంగా వుండాలన్నారు. శ్రీ సాయినాధుడంతటి మహనీయుడే "మాయ నన్ను బాధిస్తున్నదంటే" అల్పజ్ఞులమయిన మనమెంత? కాని సాయిని మాయ బాధిస్తున్నదన్నమాట సత్యంకాదు కాని సాయి వాక్కు అసత్యమనగలమా? నానా దాహంతో వున్నాడు, బ్రతికించాలి, పురందరే ఇల్లు కట్టుకోవాలి, శ్యామా సద్గ్రంథ పఠన చెయ్యాలి, వంటిసాయి సంకల్పాలు జగత్తు సత్యము అన్న గుర్తింపుకు ఊతమిచ్చేవి. ఇట్టి భావనలన్నీ మాయలో భాగాలేమో? భగవంతుడు తనకప్పగించిన భక్తులను, ప్రకృతి బంధాలనుండి విడిపించి, ఏకమైన పరమాత్మ భావన యందు నిలిచి భగవంతుని అజ్ఞకు లోబడి, ప్రకటమైన తనకు, ఈ స్వమాయ అనివార్యమేకదా! అందుకేనేమో శ్రీసాయి తరచు "అల్లామాలిక్" "అల్లా అచ్చాకరేగా" అని స్మరించేవారు. ఠాకూర్‌తో శ్రీ సాయి "ఆధ్యాత్మిక మార్గంలో శక్తినంతా వినియోగించి కృషి చేస్తేగాని ఫలితముండదు" అన్నారు. అది అసలు సిసలైన భక్తులు, ఎంతధృడంగా ఆత్మనిష్టలో నిలవాలో తెలియచెప్తూ శ్రీసాయి చేసిన హెచ్చరిక.

శ్రీసాయి వంటి సమర్థ సద్గురువులకు శరణాగతి చెందినవారు మాత్రమే భగవంతుని చేరుకుంటారు. శ్రీసాయి లీలామృతంలో కుశాభవు, యోగసిద్ధులు బురదలో కూరుకుపోయినా, శ్రీసాయిని సేవించాడు కావున రక్షింపబడ్డాడు. ఇతడు దత్తమహరాజ్ అను యోగిని సేవించి, వశీకరణాది మంత్ర, క్షుద్రవిద్యలతో, దూరాన వున్న ఇతరుల వస్తువులు తెప్పించి, అందరికి పంచేవాడు. ఇతరుల సొమ్ము దొంగిలించిన దోషం గురువుకు, దొంగసొమ్ము స్వాహా చేసిన దోషము శిష్యునకు సంక్రమించినవి. తన క్షుద్ర విద్యాపాసనలు, శక్తి ప్రదర్శనల గర్హించేవారిని, మారణ వశీకరణాది మంత్రాలతో శిక్షించేందుకై కుశాభావు దత్తమహరాజ్‌ని ఆశ్రయించాడు. ఈ పాపపు పనితో తాను చెడి, తనను చెడగొడతానని దత్తమహరాజ్ తెలుసుకొని మిగిలిన విద్యలకై షిరిడి వెళ్ళి సాయిని ఆశ్రయించమంటూ తపస్సు చేసుకుంటానని హిమాలయాలకు వెళ్లాడు. కానీ శ్రీసాయి కుశాభవుని మసీదులోనికి రానీయలేదు. మొదట

అతడి చేతి కడియాన్ని, క్షుద్రశక్తులను గోదావరికి అర్పణ చేయించారు. 6 నెలలు షిరిడీలో భిక్షాటన 108 సార్లు గురుచరిత్ర పారాయణ చేయించి, పాపప్రక్షాళన జరిగాక మసీదులో కాలుపెట్టనిచ్చారు. ఆ తర్వాత శ్రీసాయి కుశాభవుకు ఆధ్యాత్మికంగా ఉన్నతస్థితిని ప్రసాదించి, పూర్ణ యోగిని చేశారు. శ్రీసాయి ఆజ్ఞపై పూనాలో స్థిరపడి, శ్రీ దత్త మహరాజ్‌గా ప్రసిద్ధి చెందారు. పూనాలో శివాజీ గిరిపాదం వద్ద వీరి సమాధి వేలాది భక్తుల పూజలందు కుంటున్నది. ఇలా శ్రీసాయి వంటి సద్గురు కృపకు నోచుకోని యోగులు, సిద్ధులకు బలియై పతనం చెందుతారు. కావుననే శ్రీసాయి మాస్టర్‌లు సిద్ధుల ప్రదర్శనను నిర్ధాక్షిణ్యంగా ఖండించారు.

తుంబా సమీపంలో యున్న యోగసిద్ధునితో మాస్టర్‌గారికి పరిచయ మయింది. శ్రీ మాస్టర్‌గారి జీవితంలో ఒక ముఖ్య ఘటన విషయంలో, ఇతడిచ్చిన సలహా కాలాంతరంలో శ్రీసాయి ఆశీస్సులతో ఫలించింది. శ్రీ మాస్టర్ గారొకసారి ఈ యోగితో అతని గదిలోనే ముచ్చటించాక బయటకువచ్చి, కాఫీకై సమీపంలో వున్న హోటల్‌కు వచ్చారు. ఆశ్చర్యం అంతవరకు గదిలో తనతో మాట్లాడిన యోగి, ఆ హోటల్‌లో టిఫెన్ తిని కాఫీ త్రాగుతున్నాడు. ఒకేసారి రెండు దేహాలతో ప్రకటంకాగల యోగశక్తి ఉంటేగాని ఇది సాధ్యపడదు. అంటే ఆ యోగి శ్రీ నృసింహ సరస్వతి స్వామి, శ్రీ అక్కలకోటస్వామి శ్రీ మిలారేపా, శ్రీ రంగన్నబాబుగారు లాగా ఏకకాలంలో బహుదేహాలతో ప్రకటం కాగల యోగశక్తితో వుండేవారు. అంటే ఆ యోగి అటువంటి స్థితిలో వున్నారన్నమాట. ఆధ్యాత్మికంగా ఇంతటి వున్నత స్థితి అందుకున్న ఆ యోగి కాలాంతరంలో శక్తి ప్రదర్శనలతో జనాకర్షణకు పాల్పడి కీర్తిప్రతిష్ఠల వ్యామోహంలో చిక్కి దిగజారాడు. తన యోగసిద్ధులకు ఆకర్షితురాలైన కులస్త్రీచే క్రమేపి ఆకర్షింపబడి నైతికంగా పతనం అయ్యాడు. "గురువు, స్త్రీ, అగ్నిలకు సాధకుడు దూరంగా వుండాలని శాస్త్రంలో వుందని మాస్టర్‌గారు తరచు చెప్పేవారు. దేవీదాస్‌తో శ్రీసాయి, ఇండ్లకు వెళ్ళి స్త్రీలకు వైద్యం చెయ్యవద్దని

హెచ్చరించారు. ఈ సూచన పెడచెవిన పెట్టి, దేవీదాస్ వైద్యం మిషతో ఒక విధవరాలింటికి వెళ్ళారు. ఆమె ఆయనను భయపెట్టి లొంగదీసుకుంది. పశ్చాత్తాపాగ్నిలో కరిగిపోయిన దేవీదాసు, పవిత్ర షిరిడీని, కామధేనువును వంటి శ్రీసాయిని విడిచి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. ఎంతటి దురదృష్టం! ఇలాగే పై యోగి కీర్తి ప్రతిష్ఠలతో పాటు యోగశక్తులు కూడా మాయమయ్యాయి. వారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్యతోపాటు రాబడి కూడా క్షీణించింది. క్రమేపి భుక్తి గడవని స్థితి ఏర్పడింది. హస్తలాఘవంతో జనాకర్షణకు యత్నించి పట్టుబడి అవమానింప పడ్డాడు. వారిస్థితి పాతాళానికి కృంగిపోయింది. ఇంతటి నిస్సహాయస్థితిలో పూర్వ పరిచయం దృష్ట్యా, తనకు ఆశ్రయం ఇచ్చి ఆదుకొన వలసినదిగా ప్రార్థిస్తూ విద్యానగర్‌కు ఉత్తరం వ్రాశాడు. అతని పతనావస్థను ఎరిగివున్న శ్రీ మాస్టర్‌గారు అతని పూర్వస్థితికి చేరేందుకు సహకరించే ధర్మ సూత్రాలతో జాబు వ్రాశారు. దాని సారాంశం.

"పరమార్థ సాధనకు ధర్మాచరణ, ధర్మరక్షణ అత్యావశ్యకాలు. అందుకు బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమాలు రెండూ తగివున్నాయి. కోటలో వుండి యుద్ధం చేయడం, గృహస్థాశ్రమమైతే బహిరంగస్థలంలో వుండి యుద్ధం చేయడం లాంటిది సన్యాశాశ్రమము. కోటలో వున్న వాడికి ముందు నుండే ప్రమాదము. బహిరంగ స్థలంలో వుండేవారికి అన్ని దిక్కుల నుండి ప్రమాదం వుంటుంది. వివేక వైరాగ్యాలు, శరణాగతి, గురుకృపలు బలహీన పడితే, బ్రహ్మచర్య సన్యాస ఆశ్రమాలు పతనంకాక తప్పదు. మీరు అధర్మంగా చేరదీసిన స్త్రీని ధర్మబద్ధంగా వివాహమాడి దంపతులుగా విద్యానగర్ వస్తే సకల సదుపాయాలు సమకూర్చ బడతాయి. లేకుంటే ధర్మబద్ధులై సాధనా దీక్షలో వున్న అగ్నిశిఖల్లాంటి నా శిష్యులు మిమ్మల్ని ఏ మాత్రం కనికరించరు". కాని మాస్టర్‌గారి మాటలు ఆ యోగిపుంగవునికి ఏ మాత్రం రుచించలేదు. తాను ఎంచుకున్న జీవిత పంథాలోనే ముందుకుసాగి, కాలగర్భంలో కలిసిపోయాడు. ఆధ్యాత్మిక సాధనలో ఈ యోగసిద్ధులెంత ప్రమాదకరమో ఈ యోగి జీవితం స్పష్టం చేస్తుంది.

# మాస్టర్ దర్శనం - 7

## చివటం అమ్మ - మాస్టర్‌గారు

శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర పారాయణతో సిద్ధపురుషుల దర్శన ఆశీస్సులు లభిస్తాయన్నది నిత్యసత్యం. ఈనాడు ఈ అమూల్యమయిన ఈ సత్యాన్ని వెల్లడిస్తున్నది మన మాస్టర్‌గారే. తమ అన్వేషణలో తెలుసుకున్న ఈ సత్యాన్ని మహాత్ముల ఆచరణతో రంగరించి, తమ అనుభవంలో నిగ్గుతేల్చి అది సమాజానికి ఏలా మేలు చేస్తుందో తెలియచెప్పడములో ఎంత కష్టనష్టాలకైన ఆయన వెనుదీయరు. అందుకే వారిమాట చేత, మిడిమిడి జ్ఞానంతో మత మౌఢ్యానికి అంటిపెట్టుకున్న వారికి అంతబట్టవు. ముఖ్యంగా శుచి, అశుచి భేదాలను పాటించని అవధూతలను గుర్తించి, సేవించి, వారి దివ్యత్వాన్ని ప్రతిపాదించే చరితామృతాలను రచించి, లోకానికి అందించి వాటిని పారాయణ చేయించి, అట్టి మహాత్ములను సేవించగల సంస్కారాన్ని అందరిలోను మేల్కొల్పుతున్నారు. అట్టి మహాత్ములలో అవధూత, దిగంబరి అయిన శ్రీ చివటం అమ్మ ఒకరు. శ్రీ సాయిచరిత్ర పారాయణ ఫలితంగా అనేకసార్లు శ్రీ భరద్వాజ మాస్టర్‌గారి వెంట వెళ్ళి అమ్మను దర్శించే భాగ్యం నాకు కలిగింది.

మాస్టర్‌గారితో చివటం అమ్మ దర్శనానికి వెళుతున్న గురుబంధువులు తమతో నన్నూ గూడా రమ్మని ఆహ్వానించారు. ఆ రాత్రి 11 గంటల ప్రాంతంలో మేమంతా చివటం చేరుకున్నాము. సామాన్యంగా 10 గంటల లోపేబిక్ష ముగించుకొని అందరినీ ఇంటికి పంపేసే అమ్మ ఆరోజు ఎంత ప్రొద్దుపోయినా భిక్షకు లేవపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. మాలో మాస్టర్‌గారిని చూశాక అందుకు గల కారణం వారికి అర్థమయింది. భక్తులు నాటి రాత్రి అమ్మగది ముందర వరండాలో మమ్మల్ని పారాయణ, ధ్యానం చేసుకోనిచ్చారు. ప్రగాఢమయిన శాంతి ఆ గదిలో క్రమేపి చోటుచేసుకొని, మరుక్షణమే అమ్మ తమగది నుండి వెలుపలికి వచ్చి మాకు ఎదురుగా కూర్చున్నారు. కొద్దిక్షణాలు

ఈ ప్రపంచాన్ని మరచి మా దృష్టి ఆమెపై నిల్పాము. అమ్మకు పండ్లు ఇచ్చి పాదాభివందనం చేసుకోగానే ఆమె అరటిపళ్ళను తిని, కొంచెం మిగిల్చి ప్రసాదంగా మాకందరికి ఇచ్చారు. ఆమె సన్నిధిలో రాత్రి 2 గంటల దాకా గడిపి మేము తిరుగు ప్రయాణానికి సిద్ధమయినాము. కాని అమ్మ మమ్మల్ని ఆ రాత్రి రామాలయంలో పడుకొని, తెల్లవారాక బయల్దేరమని కబురు చేశారు. కానీ మేము ఉదయానికల్లా జీపును ఒంగోలు చేర్చవల్సి వుండటం వల్ల వెంటనే అక్కడినుండి బయలుచేరాము. దారిలో తాడేపల్లిగూడెంలో మాజీపు చెడిపోయింది. ఎలాగో కష్టపడి నిడదవోలు చేరి తెల్లవారేదాకా అక్కడ గడిపి వచ్చాము. ఒకప్పుడు 'బాబుగారు' అనే మహాత్ముని కారు గూడా దారిలో నిష్కారణంగా ఆగిపోయి ఎంతకూ కదల్లేదు. శ్రీ బాబుగారు కారుదిగి, ఆ ప్రక్కనే వున్న కరెంటు స్థంభాన్ని బెల్టుతో కొట్టారు. కారు కదిలింది. ఆయన తిరిగి చివటం చేరుకున్నారు. వారు స్థంభాన్ని కొట్టిన దెబ్బ, అమ్మ శరీరంపై కనిపించిందట. అప్పుడు బాబుగారు పశ్చాత్తాపంతో అమ్మకు చాలాసేపు సేవచేసి, తర్వాత ఆమె అనుమతితో తిరిగి వెళ్ళగలిగారు. సర్వశక్తి వంతురాలైన అమ్మ ప్రేమమయి కూడా. ఇటువంటి లీలలను సేకరించి, లోకానికి అందించి అమ్మ చరితామృతాన్ని, మనకందించిన ఆయనకు శాశ్వతంగా ఋణపడ్డాము. దాన్ని అమ్మ సమాధి వద్ద పారాయణ చేసి, అమ్మ కృపకు పాత్రులవుదాము.

నేనొకసారి అమ్మ సన్నిధిలో పారాయణ చేసుకుంటున్నాను. అమ్మ ప్రశాంతంగా కూర్చుని వున్నారు. మాస్టర్‌గారు తణుకులోని భక్తుని ఇంటికి వెళ్ళారు. కొంతసేపటికి అమ్మ అకస్మాత్తుగా లేచి ముందున్న రామాలయం వద్దకు నడచి వెళ్ళారు. నేను కూడా ఆమెను అనుసరించాను. ఇంతలోకి మాస్టర్‌గారు రోడ్డుదిగి మాకెదురుగా వచ్చారు. వారిని చూడగానే అమ్మ ముఖంలో అనిర్వచనీయమయిన తృప్తి, సంతోషం, ప్రేమ, స్పష్టంగా కన్పించాయి. సాదరంగా ఆమె మాస్టర్‌గారి చేయి పట్టుకొని, రామాలయంలోనికి తీసుకువచ్చారు. అప్పుడు అర్థమయింది అమ్మ ఆదుర్దాగా ఎందుకు బయటకు

వచ్చారో తణుకు నుండి మాస్టర్‌గారు వస్తున్న సంగతి తెలుసుకున్నారన్నమాట. సర్వవ్యాపకత్వ, సర్వజ్ఞాధిలక్షణ సమన్విత కదా అమ్మ!

ఒక మధ్యాహ్నం మాస్టర్‌గారు అమ్మకు పూజ చేసేందుకు పూలబుట్టలను సిద్ధం చేశారు. అమ్మ ఆయన వద్దనున్న పూలబుట్టను లాక్కొని ఆ పూజను ఆపివేయబోయారు కానీ, మాస్టర్‌గారు అది కుదరనీయ లేదు. ఆయన శ్రీసాయి అష్టోత్తర నామావళి చదువుతూ ఆమెపై వేస్తున్న పువ్వులను ఆమె తీసుకొని, తన ప్రక్కనగల సాయిపటంపై వేస్తున్నారు. అంటే మాస్టర్‌గారికి అమ్మ పూజ్యురాలైనట్లే సిద్ధురాలైన అమ్మకు గూడా శ్రీసాయి పూజ్యులన్నమాట.


భక్తుల ఇండ్ల నుండి మట్టిపాత్రలో తాను తెచ్చుకున్న భిక్షను అమ్మ తీసుకునేవారు. ఒకసారి అలాంటి సమయంలో ఆమె మాస్టర్‌గారిని ప్రక్కనే కూర్చోబెట్టుకున్నారు. మాస్టర్‌గారి ప్రక్కన విస్తరి ముందు కూర్చునే భాగ్యం నాకు కలిగింది. అమ్మ భిక్షాన్నం కొంచెం తిని, ఎంతో ఆప్యాయంగా తల్లి బిడ్డకు వేసినట్లు కొంత మాస్టర్‌గారి విస్తట్లో వేయసాగారు. మాస్టర్‌గారు ఆ ప్రసాదంలో కొంత నా విస్తట్లో వేయసాగారు. అలా నన్ను ధన్యుడ్ని చేశారు. ఆ ప్రసాదంతోనే మాస్టర్‌గారికి, నాకు కడుపు నిండటమే కాక, ఎనలేని తృప్తి, శాంతి, లభించాయి. ఈ విధంగా నాకు ఇద్దరు మహాత్ముల ప్రసాదం ఏక కాలంలో లభించాయి.

ఇలా అమ్మప్రసాదం నాకు, మాస్టర్‌గారి ద్వారా లభించడం కేవలం కాకతాళీయం కాదని, ఒక అనుభవం నిరూపించింది. నాకు ఒకరోజు అమ్మ, చీర, జాకెట్ ధరించి పెద్దముత్తైదువులా మంచంపై కూర్చుని, క్యూలో వస్తున్న భక్తులకు ప్రసాదం పంచుతున్నట్లు కల వచ్చింది. చివరికి నాకు ఏమి మిగలదన్న ఆలోచన రాగానే, ఎవరో మా యింటి గేటు తట్టిన శబ్దమై నాకు మెలుకువ వచ్చింది. లేచిచూస్తే గేటువద్ద నిల్చున్న సత్యంగారు "దీన్ని మాస్టర్‌గారు మీకిమన్నారు" అంటూ విద్యానగర్ నుండి తెచ్చిన ప్రసాదం నా చేతిలో పెట్టారు.

స్వప్నంలో అమ్మ నుండి నేను తీసుకోవాల్సిన ప్రసాదం మెలకువలో మాస్టర్గా నుండి నాకు అందింది. నాటినుండి నాకు మహాత్ములందరి ప్రసాదం, ఆశీస్సుల మాస్టర్గారి ద్వారానే లభిస్తున్నాయన్న విశ్వాసం నాలో బలపడింది. అపె దర్శనానికి వెళ్ళిన ప్రతిసారి మాస్టర్గారు చివటం లోనే వుండటం జరుగుతూ వచ్చింది.

అమ్మ సమాధి చెందిన క్రొత్తలో మాస్టర్గారు చివటం వచ్చి, అమ్మలేరన్న దుఃఖంలో విలవిల లాడుతున్న భక్తుల అనుభవాలు సేకరిస్తున్నారు. ఆరోజు మధ్యాహ్నం మేము తిరిగి ఒంగోలు బయల్దేరవల్సివున్నది. అందువలన నాకు మాస్టర్గారికి రైల్లోసీట్లు రిజర్వేషన్ చేయించడానికి ఒక భక్తుడ్ని తణుకుకు పంపాము. కాని మేము బయల్దేరే సమయానికి మాస్టర్గారు అమ్మ లీలలు సేకరించడము పూర్తికాలేదు. దానికి తోడు అమ్మతో మొదటి నుండి సన్నిహితంగా మెలిగి, అనేక అనుభవాలు పొందిన ఒక భక్తురాలు కూడా అప్పుడే చివటం వచ్చింది. కనుక మేము రైల్లో రిజర్వు చేసుకున్న సీట్లు రద్దు చేయించమని మరలా తణుకుకు మనిషిని పంపాము. సరిగా చివటంలో మాస్టర్గారు ఆ మాట ఆ మనిషితో చెబుతున్న సమయంలోనే ఒక అజ్ఞాత వ్యక్తి తణుకులో స్టేషన్ మాస్టర్ను కలసి "భరద్వాజగారు ఈ రైల్లో వెళ్ళడంలేదు. కనుక టిక్కెట్లు రిజర్వు చేయనక్కర లేదు" అని చెప్పి వెళ్ళారట. కొద్దిసేపట్లో మేము పంపిన వ్యక్తి తిరిగివచ్చి ఆశ్చర్యంతో మాకు చెప్పాడు. ఆ అజ్ఞాత వ్యక్తి ఎవరా అని ఎంత విచారించినా తెలియలేదు.

తడిసిన గుడ్డలో తడి ఎలా ఉంటుందో,
ఈ సృష్టి అంతటిలో భగవంతుని తత్వం అలా వుంటుంది.





# మాస్టర్ దర్శనం - 8

## సత్సంగ మహిమ

శ్రీ సాయి మొదట శిరిడీ గ్రామానికి వెలుపల వేపచెట్టు క్రింద కూర్చుని కనిపించారు. అదేవిధంగా ఒంగోలు పట్టణంలో కూడ వూరి వెలుపల వినాయకుని గుడి వెనుక వున్న వేపచెట్టు క్రింద శ్రీ సాయి విగ్రహ రూపంలో కనిపించారు. రమణ భక్తురాలు శ్రీమతి మరకతమ్మగారు 1922లో ఆ విగ్రహాన్ని చూచారట. అక్కడి వినాయకుని గుడిని వీరి పూర్వీకులే కట్టించారు. వారి భర్త, కొడుకులు, కోడలు ఈశ్వరమ్మగారు ఆ సాయి విగ్రహాన్ని పూజించేవారట. అయితే షుమారు 15 సం.ల క్రిందట ఆ విగ్రహం మాయ మయిందనీ, దాని స్థానంలో పుట్ట వెలసిందని చెప్పారు. ఆ విగ్రహం ఎక్కడి నుండి వచ్చినదీ, ఎలా మాయమైనదీ ఎవ్వరికీ తెలియదు. అక్కడ వెలసిన పుట్టకు వీరి కుటుంబ సభ్యులు చిన్న ప్రాకారాన్ని కట్టించారు. శ్రీమతి ఈశ్వరమ్మగారు గొప్ప సాయిభక్తురాలు. కొద్దిగా ద్రవాహారం మాత్రమే తీసుకుంటూ ఆ వినాయకుని గుడిలోని పుట్ట దగ్గర ధ్యానం చేసుకొంటారు.

శ్రీసాయి లీలామృత పారాయణా ఫలితంగా నేను మా కుటుంబ సభ్యులు 1978లో షిరిడీ దర్శించాము. శ్రీసాయి అరవై సంవత్సరాలు తమ అవతార కార్యక్రమాన్ని సాగించి సమాధి చెందిన అనంతరం 60 సం.లకు అంటే 1978 అక్టోబర్ 11వ తేది బుధవారం పవిత్ర విజయదశమినాడు నేను నా శ్రీమతితో అచార్య శ్రీ భరద్వాజ మాస్టర్‌గారిని మొదటిసారిగా శిరిడీలో కలిశాను. ఆ పరిచయం క్రమేపి వృద్ధిచెంది శ్రీ మాస్టర్‌గారు ఒంగోలుకు వచ్చి సత్సంగాల నేర్పరచడానికి దారితీసింది. శ్రీ భరద్వాజగారు తమ ఉపన్యాసాలతో ప్రజలనుత్తేజపరచి శ్రీసాయి సత్సంగ మహిమను వ్యాపింప జేస్తున్నారు. ఇప్పుడిక్కడ ఒక్కో భక్తుని యింట్లో ఒక్కో రోజు వారమంతా సత్సంగాలు జరుగుతున్నాయి. శ్రీ భరద్వాజగారి సారధ్యంలో ఒంగోలులో స్థాపించబడిన

షిరిడిసాయి కల్చరల్ మిషన్ అను సంస్థ ఇక్కడ శ్రీ సాయిబాబా మందిర నిర్మాణానికి కృషి చేస్తున్నది.

ఒకరోజున శ్రీమతి ఈశ్వరమ్మగార్కి దక్షిణం వైపునుండి ఉత్తరం వైపుకు వస్తున్న వెలుగు కనబడింది. అదే రోజున శ్రీ భరద్వాజగారు ఒంగోలుకు ఆ దిశ నుంచి రావడంతో వారిని ఈశ్వరమ్మగారు గొప్ప ఆధ్యాత్మిక పురుషునిగా గుర్తించారు. అందుచేత సత్సంగ సభ్యులను ఈ పుట్ట దగ్గర ధ్యానం చేసుకోనిస్తారు. ఒంగోలులో ప్రతి ఆదివారం జరిగే సామూహిక సత్సంగాన్ని ఒక ఆదివారం వినాయకుని గుడిలో జరిపాము. శ్రీమతి ఈశ్వరమ్మగారు దూరంగా వున్న పుట్ట దగ్గర కూర్చుని మా భజన వింటున్నారు. అప్పుడు గొప్ప వెలుగు పుట్ట దగ్గర నుండి బయలుదేరి మా సత్సంగ సభ్యుల శిరస్సులపై వలయాకారంగా నిలచి వుండడం ఆమె చూచారు. ఆ వెలుగులో ఆమెకు మా ముఖాలు స్పష్టంగా కనిపించాయి. గొప్ప ఆధ్యాత్మిక శక్తి అందనున్నదని ఆమె చెప్పారు. ఆ శక్తి శ్రీ సాయినాథుడే! స్థానిక సత్సంగ సభ్యుడైన శ్రీ వై. శ్రీనివాసరావుగారు హైద్రాబాద్‌లో శ్రీ సమర్థ నారాయణ మహరాజ్‌గార్ని దర్శించారు. ఆ సమయంలో స్వామి శ్రీనివాసరావుగారితో, "శ్రీ భరద్వాజ సంకల్పంతో ఒంగోలులో పెద్ద సాయిబాబా మందిరం రాబోతున్నది" అన్నారట. ఇది సాయి కృప, సత్సంగ మహిమ. ఇక్కడ జరుగుతున్న సత్సంగాల వలన ప్రకటమైన కొన్ని సాయి లీలలను ఇప్పుడు తెలియపరుస్తున్నాను.

శ్రీ సీతారామమూర్తి గారింట్లో డిసెంబర్ 13, 1980 తేదీన సత్సంగం జరిగింది. వారి శ్రీమతి, కృష్ణభక్తురాలు, శ్రీసాయి లీలామృతములోని 'సకల దేవతా స్వరూపుడు సాయి' అన్న అధ్యాయాన్ని పారాయణ చేస్తూ, బాబా శ్రీ కృష్ణునిగా దర్శనమిచ్చిన లీలలు లేవనుకొన్నారు. ఆనాటి సాయంకాలమే వారి పూజలోని బాబాపటం నీలంగా మారింది. "కొందరు మీరు చేసే పూజలో లోపం వల్ల అలా జరిగి వుంటుంద"ని అన్నారట. బాబా ముందు రెండుసార్లు చీట్లు వేసినా వారి పూజలకు శ్రీసాయి తృప్తి చెందినట్లు వచ్చింది. నాటి రాత్రి

స్వప్నంలో శ్రీసాయి దర్శనమిచ్చి తాను వారింటికి వస్తే అనవసరంగా ఆందోళన పడుతున్నారనీ, తన శిరస్సుపై మూడు పువ్వులుంచి పూజచేస్తే తాను మర్నాడు వెళ్తాననీ చెప్పారు. ఆమె మరునాటి ఉదయం అలాగే పూజ చేయగా సాయంత్రానికల్లా బాబా పటం మామూలు రంగులోకి వచ్చేసింది. ఈ విధంగా శ్రీసాయి తన పటానికీ, తనకూ, శ్రీకృష్ణునికీ తేడాలేదని నిదర్శన మిచ్చారు.

శ్రీ సీతారామమూర్తి బావగారైన శ్రీకృష్ణమూర్తిగారు ఒంగోలులో ఉద్యోగం చేస్తున్నారు. కానీ కుటుంబమంతా గుంటూరులో వుంటున్నందువల్ల తమకు కుటుంబంతో కలసి వుండే అవకాశాన్ని ప్రసాదించమని శ్రీసాయిని ప్రార్థించారు. శ్రీ సీతారామమూర్తి గారింట్లో భజన చేస్తున్న సమయంలో శ్రీకృష్ణమూర్తిగారికి బాబా పటంలో తేజోవంతమైన వెలుగు కనబడింది. ఆ ఆనందంలో వారు విద్యానగర్ సాయి మందిర నిర్మాణానికి రూ. 116/- యివ్వాలనుకున్నారు. దత్తజయంతికి ఒంగోలు వచ్చిన వారి కుటుంబ సభ్యులను గుంటూరులో వదిలి వచ్చేందుకు జీపులో ప్రయాణమయ్యారు. గుంటూరుకు 5, 6 మైళ్ళ దూరం వుందనగా రోడ్డుపై ముగ్గురు సాధువులు జీపుకు అడ్డంగా నిలుచున్నారు. ముగ్గురిలో మధ్యలో గల పొడవైన సాధువు 'సద్గురు సాయినాథ మహరాజ్ కీ జై' అంటూ కారును నిలిపి, "నా కిస్తానన్న రు. 116/-లు యివ్వు" అన్నారట. కృష్ణమూర్తిగారు తన వద్ద అంతపైకం లేదని, జీతాలు వచ్చాక యిస్తానంటూ, "అయినా నేనిస్తానన్నది విద్యానగర్ మందిరానికి కదా" అన్నారట. ఆ సాధువు "ఎవరికిచ్చినా నాకే చెందుతుంది కనుక విద్యానగర్‌కే పంపు! మేము పండరి నుండి నడచి వస్తున్నాము. ఏమైనా దక్షిణ యివ్వు అన్నారట. కృష్ణమూర్తిగారు యిరవై రూపాయలివ్వగా "నీ ప్యాంటు జేబులో వున్న మరో యిరవై రూపాయలు కూడా యివ్వు" అన్నారటా సాధువు. తన ఖర్చులకు కూడ లేకుండా తీసుకుంటున్నారే అనుకుంటూనే యిచ్చేశారట కృష్ణమూర్తిగారు. ఆ సాధువు రెండవ సారిచ్చిన యిరవై రూపాయలూ తిరిగిస్తూ, "ఖర్చులకు లేదని బాధపడతావెందుకు, నీకు మేలు జరుగుతుంది పో" అన్నారట. వీరు గుంటూరు

చేరగానే ఆఫీసువారు వీరి విధి నిర్వహణలో స్వల్పమైన మార్పులు చేసినట్లున్న కాగితాలను చేతికిచ్చారు.

సంతపేటలోని మాయింట్లో ప్రతి గురువారమూ సత్సంగం జరుగుతుంది. ఒక గురువారం సత్సంగంలో నేను కళ్ళు మూసుకుని బాబాను ధ్యానిస్తూ భజన చెపుతున్నాను. నాకు కుడివైపున గల సభ్యులందరికీ బజారులో గేటువద్ద శ్రీసాయి దర్శనమైంది. నా ప్రక్కనే వున్న నా శ్రీమతి నన్ను గేటువైపు చూడమని చెప్పింది. ఆమె తన అనుభవాన్నిలా చెప్పింది. "అంతా గాఢాంధకారంగా వుంది. గేటువద్ద దివ్యమైన వెలుగులో శ్రీసాయి నిలబడి వున్నారు. వారి రూపం లెండీకి పోతున్న ఫోటోలోవలె వున్నది. తర్వాత ఆయన తూర్పువైపుకు వెళ్ళారు. మేము తిరిగి భజనలో నిమగ్నమయ్యాము".

ఒంగోలు వాస్తవ్యులైన శ్రీ ఓ.ఎస్.ఆర్. ఆంజనేయులుగారి పాప గాయత్రి. వారెప్పుడు బాబాకు పూజ చేస్తున్నా ఆ పాపవారి ప్రక్కనే కూర్చునేది. ఒకరోజు రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో చి॥ గాయత్రి తన కెదురుగా ఉన్న టేబిల్‌పై కూర్చుని కనిపించింది. ముందుకు వంగి పాపను తాకబోయేసరికి ఆమె వద్ద జ్వరపు వాసన వచ్చింది. తరువాత పాప కనబడలేదు. సుమారు 20 రోజుల తర్వాత ఆ పాప రాత్రి పన్నెండు గం.ల ప్రాంతంలో తండ్రిని లేపి "బాబా వచ్చారు నాన్నా" అన్నదట. ఆ పాప మాటలకు ఆశ్చర్యపోయి బాబాపటం చూపగా, "వారే నాన్నా యిందాక వచ్చారు. దున్నపోతును మంత్రం పెట్టి తరిమేసి నన్ను రమ్మని పిలిచారు" అన్నదట. ఆ పాపకు అప్పటి వరకు 'దున్నపోతు' అన్న పదం పలుకడం చేతగాదు. పాప అన్ని జంతువులను 'బత్తె' అనేదట. ఈ విషయం వారిని బాగా ఆశ్చర్యపరిచింది. ఆ తరువాత గాయత్రికి జలుబు చేసి 2,3 రోజులు నలతగా వుండి, నాల్గవ రోజున తన కిష్టమైన తాత భుజంపై పడుకొని బాబాను చూస్తూ చేతిలోని బొమ్మను, శరీరాన్ని ఒకే సారి వీడింది. పాప దేహం వద్ద రెండు గం.లసేపు శ్రీ సాయిభజన చేసాము. సాయిబాబా భజన చేస్తూ, పాపా శరీరాన్ని రుద్రభూమికి తీసుకెళ్ళి

బాబా విభూతితో అభిషేకించి, ఉత్తర క్రియలు పూర్తిచేశాము. చి॥ గాయత్రి కూడా శ్రీసాయి మహా సమాధి చెందిన రోజైన మంగళవారంనాడే దేహత్యాగం చేసింది. శ్రీసాయి, ఆంజనేయులుగార్కి రానున్న విపత్తును ముందుగా సూచించి, దానిని భరించగల మనోధైర్యాన్ని ప్రసాదించారు. పాప చనిపోయిందన్న దిగులున్నా ఆమెకు శ్రీసాయి సద్గతి ప్రసాదించారంటారు శ్రీ ఆంజనేయులుగారు. సరిగ్గా పాపపోయిన 30వ రోజున అదే సమయానికి యింటినిండా సుగంధ పరిమళాలు వ్యాపించాయట. శ్రీసాయి భజనలు చేయమని గాయత్రి చెప్పినట్లు తల్లిదండ్రులకు అనిపించి ప్రతి గురువారమూ భజనలూ, సత్సంగము ప్రారంభించారు. శ్రీసాయికి ప్రతి రూపులైన శ్రీ భరద్వాజగారు వారింటికి వచ్చి, యింట్లోవారిని ఆశీర్వదించడం కేవలం శ్రీసాయి కృపగా వారు భావిస్తున్నారు.

అనన్యము, ఏకోన్ముఖమైన భక్తి మాత్రమే బ్రహ్మప్రాప్తికి యోగ్యులని చేస్తుంది.

భగవంతుడు తప్ప అన్నీ వున్నవారు, భగవంతుడు తప్ప ఏమీ లేనివారిని చూచి పిచ్చివాళ్ళు అంటారు.
నిజమైన పిచ్చివాళ్ళెవరు?

అహింసా ప్రథమం పుష్పం, పుష్పమం ఇంద్రియ నిగ్రహం సర్వభూత దయాపుష్పం, క్షమాపుష్పవిశేషతః శాంతిపుష్పం, తపః పుష్పం, ధ్యానపుష్పం తథైవచ సత్యమష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరంభవేత్

# మాస్టర్ దర్శనం - ౨

## షిర్డీసాయి చేసిన అద్భుత లీల

మానవులకు దైవానుగ్రహ హేతుకములైన ముముక్షుత్వము, మహాపురుష
సమాశ్రయము లభించడం దుర్లభమంటారు శ్రీ ఆదిశంకరాచార్యులు వివేక
చూడామణిలో. ఈ ప్రయోజనాలను తాను పుష్కలంగా సాధించుకోవడమేగాక
సాటిజీవులకు కూడా సమకూర్చిపెట్టిన మహనీయుడు ఆచార్య శ్రీ ఎక్కిరాల
భరద్వాజ మాస్టర్‌గారు. ప్రపంచంలోని సకల మత సాంప్రదాయాల
మూలగ్రంథాలను నిశితంగా పరిశీలన జేసి, తుదకు సనాతనము,
సమన్వయాత్మకము, నేటి సామాజిక రుగ్మతలకు మేటి ఔషధమువైన శ్రీ
సాయి సాంప్రదాయాన్ని వెలికితీసి, ప్రచారం జేసి, సర్వులకు మేలుచేసిన
మాస్టర్‌గారు చిరస్మరణీయులు. "ఇంతవరకు వివిధ మతాలు భగవంతుడు
తమ ఒక్కరి సొత్తయినట్లు, ఇతర మతాలు అసత్యాలైనట్లు వ్యవహరించాయి.
వారి సిద్ధాంతం ప్రకారం దైవం, ఆ మతస్థులకు మాత్రమే తండ్రి అవుతాడుకానీ,
జగత్పిత కాజాలడు. అందరికీ తండ్రియైన భగవంతుడు ఎవరినీ అశ్రద్ధ
చేయడన్న సులభమైన సత్యాన్ని మతాలు విస్మరించాయి. దత్తావతారులు మాత్రం
మతభేదాలకు అతీతంగా వుంటారు. వివిధ మతస్థులను వారివారి
సాంప్రదాయానుసారం నడిపించి తరింపజేసిన కీర్తి చరిత్రలో శ్రీసాయికి
దక్కుతుంది. అందుకే పూర్ణ దత్తావతారులైన సాయిలో సకల మత
సాంప్రదాయాల సమన్వయ రూపాన్ని దర్శించవచ్చు" అంటారు మాస్టర్‌గారు.

"అందరిలోనూ, అన్నింటిలోనూ ఒకే భగవంతుడున్నాడని గుర్తించలేనందు
వల్ల కొన్నింటిపై ద్వేషము, కొన్నింటిపై రాగము వహిస్తాము. ఈ అజ్ఞానం
వల్ల రాగద్వేషాలు, వాటివల్ల పుణ్యపాపాలు, వాటివల్ల జన్మ పరంపరలు,
ప్రతిజన్మలో, సుఖదుఃఖాలు కల్గుతాయి. అంతేగాక జీవులు కలి ప్రభావాన
పాపాలుచేసి కష్టాల ఊబిలో కూరుకుపోతూ, తద్విముక్తికై మాస్టర్‌గారి

నాశ్రయించినప్పుడు, వారిచేత శ్రీ సాయి చరిత్రను పారాయణ చేయించి, ఆ గురుచంద్రుని కృపకు పాత్రులను చేసేవారు. మహనీయులు మరణాతీతులు గనుక, వారి చరిత్ర భక్తితో పారాయణ చేసేవారికి, వారి అనుగ్రహం నేటికీ లభిస్తుంది. సాయి కూడా తన భక్తులు తనను భక్తి శ్రద్ధలతో స్మరించిన క్షణంలో, వారి చెంతనే వుంటానని వాగ్దానం చేశారు. అది నిజం. కారణం వారు సర్వవ్యాపియై, సర్వరూపాలలోనూ, సర్వదా ఉన్నారని వారి లీలలు నిరూపిస్తాయి. ఇది వారి సమాధి అనంతరం కూడా యదార్థమేనని అంటారు మాస్టర్‌గారు.

యదార్థమైనవని స్వానుభవ పూర్వకంగాను తెలుసుకున్న విషయాలతో నింపారు కాబట్టే, మాస్టర్‌గారి సాయి లీలామృత పారాయణతో శ్రీసాయి శీఘ్రంగా పలకుతారు. శ్రీసాయి చరిత్రలో పారాయణతో తొలగని కష్టమంటూ ఉండదు. కాకుంటే సత్త్వగుణ ప్రధానులమై పారాయణ చేస్తే ఫలితం శీఘ్రంగా కన్పడుతుంది. "అందరి ఎడల సమానమైన ప్రేమ, వేరు వేరు సాంప్రదాయాలపట్ల సమన్వయ దృష్టి, సాధు సత్పురుషులయందు పూజ్యభావము, సర్వజీవుల హితమును కోరి కృషి చేయుట, సత్త్వగుణ ప్రధానమైన దైవీసంపదలోని ముఖ్యాంశాలు. అట్టి దైవీసంపద లేకుంటే మనం చేసే యజ్ఞదాన తపఃకర్మలు, చరిత్ర పారాయణ సరియైన ఫలిత మివ్వవని" పూజనీయ మాస్టర్‌గారు అంటారు.

మాస్టర్‌గారు ఒకసారి షిరిడీలో వున్నారు. శ్రీసాయి లీలామృతంలో తాను వ్రాసిన సాయిసూక్తి "నా భక్తునింట అన్న వస్త్రాలకు లోటుండదు, నా బిడ్డలను పస్తుండనిస్తానా?" ఎంత సత్యమో స్వయంగా తెలుసుకోవాలనుకున్నారు. ఆ రోజుల్లో సమాధి మందిరం మధ్యాహ్న హారతి తర్వాత దాదాపు నిర్మానుష్యంగా వుండేది. ఈ సమయంలో భక్తులు భోజనాల కెళ్ళేవారు. కానీ మాస్టర్‌గారారోజు, శ్రీసాయికెదురుగా సమాధి మందిరంలో కూర్చొని, తననెలా పస్తుండనివ్వడో చూడాలనుకున్నారు. అంతకంతకూ ఆకలి తీవ్రమవుతున్నది. మధ్యాహ్నం ఒంటిగంట కావస్తున్నా శ్రీసాయి నుండి స్పందన లేదు, సరే ఒంటిగంటవరకు,

శ్రీసాయి సమాధానంకోసం వేచివుండి ప్రయోజనం కన్పించకపోతే శ్రీసాయి లీలామృతంనుండి పై సూక్తిని తొలగించాలని నిశ్చయించుకున్నారు.

ఇంతలో ఒక సాధువు సమాధి మందిరానికి వచ్చి, సాయికి నమస్కరించి, పలకరింపుగా మాస్టర్‌గారివైపు చూసి, చావిడిదగ్గరున్న హనుమదాలయానికి రమ్మని ఆహ్వానించాడు. సాధుసత్పురుషులను శ్రీసాయి స్వరూపాలుగా ప్రేమించే మాస్టర్‌గారు, ఆ సాధువువెంట చావిడికి బయలుదేరి వెళ్లారు. వీరిద్దరూ హనుమదాలయంలో కాలు పెట్టగనే, అంతకుముందేవున్న ఇద్దరు సాధువులు నేలపై గుడ్డపరచి, ఆకులువేసి, తమ వద్దనున్న మూడు జోలెలలోని వంటకాలను కుప్పపోశారు. తర్వాత ఆ భిక్షాన్నాన్ని నాలుగు భాగాలుచేసి, ఒకవైపు మాస్టర్‌గారిని కూర్చోమని ఆహ్వానిస్తూ, మిగిలిన మూడువైపులా తాము కూర్చొని, సంభ్రమాశ్చర్యాలతో తమవైపు ప్రశ్నార్థకంగా చూస్తున్న మాస్టర్‌గారితో ఇలా చెప్పారు.

కొంతకాలంగా తాము, షిరిడిలో భిక్షాన్నంతో జీవిస్తూ సాయి స్మరణలో గడుపుతున్నామని, ఆ నాడు సాయికి ప్రీతికరమైన గురువారం కాబట్టి, తమ భిక్షాన్నాన్ని సాయిబాబాతో పంచుకోదలచామని, అందుకుగాను సరిగ్గా నాటి మధ్యాహ్నం ఒంటిగంటకు సమాధి మందిరంలో సాయి సన్నిధిన యున్న భక్తుని శ్రీసాయి ప్రతినిధిగా గుర్తించాలను కున్నామని అలా ప్రాప్తించిన మాస్టర్‌గారు భుజిస్తే, తమకెంతో సంతోషమని చెప్తూ, నల్గురూ భోజనాల కుపక్రమించారు. జరుగుతున్నదంతా కలో, నిజమో తేల్చుకోలేనంత ఆశ్చర్యం కలిగింది. మాస్టర్‌గారికి అడిగినదే తడవుగా, ఇంత అద్భుతమైన అనుభవాన్ని ప్రసాదించిన నిత్యసత్యుడైన సాయికి మనసులోనే జోహారు లర్పించారు. ఇంట్లోనైనా, హోటల్లోనైనా భోజనంలోకిఒకటి రెండు అనుపాకాలు మాత్రమే వుంటాయి. అనాదలా కాదు. ఆ సాధువులు, పలు గృహాలనుండి తెచ్చిన భిక్షాన్నంలో అనేకరకాల వంటకాలు ఉన్నాయి. అంటే శ్రీసాయి, తన కారోజు, షడ్రసోపేతమైన భోజన మేర్పాటుచేసి, సజీవమైన లీలను ప్రదర్శించి, తన

మాట నిత్యసత్యమని నిరూపించుకున్నారు. శ్రీసాయి లీలామృతానికి ఆశీస్సు లందించారు.

అందుకే "చరిత్ర పారాయణతో సకల చరాచర వస్తు ప్రాణికోటి, ఆయన రూపాలేనని, సకల సంఘటనలు ఆయన ప్రసాదాలేనని తెలుస్తుంది. తుదకు ఈ జగత్తే సాయిరూపమై, మనలను నిరంతరం ధ్యాననిష్ఠలో నిల్పుతుంది. జీవితమంతా సాధనగా, తపస్సుగా మారుతుంది. ధ్యానం పరిపక్వావస్థ కొస్తే, తాను వేరుగా లేకుండాపోయి, ఆ గురుతత్త్వమే అంతటా అనుభవమవుతుంది. అదే ముక్తి" అంటారు మాస్టర్‌గారు. మహత్తరమైన ఈ చరిత్రను రచించి, మన జీవితాలను తృప్తి, శాంతి, ఆనందాలతో నింపిన, పూజ్యులు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్‌గారి ఋణాన్ని ఏనాటికీ తీర్చుకోలేము.

నీపాదకమల సేవయు, నీ పాదార్చకుల తోడినెయ్యము, నితాంత అపార భూతదయయు, తాపస మందార నాకు దయసేయగదే (భాగవతం)

నిద్రతాత్కాలిక మరణ మనుకుంటే, మరణం శాశ్వత నిద్ర అనుకోవచ్చు

మహాత్ములు సంకల్పించిన యజ్ఞార్థకర్మలను ఆచరించుటలో గల, మధురాను భూతిని మనము అనుభవింతుముగాక.

తనను తాను ఉద్ధరించుకొనువాడు తనకు బంధువు. తనను ఇంద్రియములలోనికి, ఇంద్రియార్థాలలోనికి నెట్టుకునేవాడు తనకు తనే శత్రువు.

# మాస్టర్ దర్శనం - 10

## గౌతమబుద్ధుని మార్గంలో మాస్టరుగారి మహా ప్రస్థానం

అవి మాస్టరుగారు తరచు ఒంగోలువచ్చి ఇక్కడి సత్సంగాలను తమ ప్రత్యక్ష సాన్నిధ్యంతో పటిష్టం పరుస్తున్న రోజులు. వారిక్కడ ఉన్నప్పుడు ఎక్కువ సమయం సంతపేటలోని మా యింట్లోనో, లాయరుపేటలోని సోదరి సుబ్బలక్ష్మి యింట్లోనో గడిపేవారు. హృద్యంగమంగా వారు వివరిస్తున్న శ్రీసాయి తత్త్వము, వారి సాన్నిధ్యంలోని ప్రశాంతత అందరిని ఆకర్షిస్తుండేవి. విశ్వమానవ కళ్యాణానికి, సర్వమానవ సౌభ్రాతృత్వానికి శ్రీసాయి సాంప్రదాయమెలా అనివార్యమో తన్మయత్వంతో వివరిస్తుండేవారు. నిశ్చల గురుభక్తి, సునిశితమైన యోచన, వివేక వైరాగ్యాలతో కూడిన సాధనలతో తాను అనుభవ పూర్వకంగా తెలుసుకున్న ఆధ్యాత్మిక సత్యాలను, ప్రసంగాలద్వారా, లోకంలో వెదజల్లడమే గాక, తమ రచనల్లోకూడా, నిక్షిప్తపరచారు. అయితే పతివ్రతయైన స్త్రీ తన సౌందర్యాన్నంతా భర్తకే ఎలా సమర్పించుకుంటుందో, అలాగే వారి గ్రంథాల్లో నిక్షిప్తమైయున్న యోగ రహస్యాలు, ఆధ్యాత్మిక సూక్ష్మాలు అర్హులైనవారికే స్వంత మవుతాయి. వారికి తెలియనిసాధనా మార్గాలు, ధర్మసూక్ష్మాలు లేవంటే అతిశయోక్తికాదేమో. తనకు పరిచయమైన ప్రతివారిలో నైతిక విలువలు మేల్కొల్పి, వారిని తగిన సాధనా మార్గంలోనిల్పి, వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సులకు దోహదపడ్డారు. ఒకతల్లి బిడ్డలలో, ప్రతివారు, ఆ తల్లిప్రేమ తమ ఒక్కరిదేయైనట్లు ఎలా భావిస్తారో, అలాగే మాస్టర్‌గారి పరిచయభాగ్యం కలిగిన ప్రతివారు ఆయన తమవాడని, ఆయన ప్రేమంతా తమదేనని భావిస్తూ మురిసిపోయేవారు. ఆ కారణంగా అందరూ, వారి ఎడబాటుకు దుఃఖిస్తూ, విద్యానగర్ నుండి వారి రాకకోసం నిరంతరం నిరీక్షిస్తూ వుండేవారు. ఆనాడు శ్రీ సాయినాథుని సాన్నిధ్యంతో ధన్యత చెందిన షిరిడీవాసులలాగే, ఈనాడు మాస్టర్‌గారి సాన్నిధ్యంలో ధన్యత చెందుతున్న విద్యానగర్‌వాసులు ఎంత అదృష్టవంతులో

అనుకుంటుండేవాండ్లము. ఇదే విషయాన్ని ఒకసారి మాస్టర్ గారితో అన్నాము. అందుకు వారు "అట్లా ఏంకాదు. మీకు నాపై ఇప్పుడున్న భావాన్ని పొడుగునా అదే స్థాయిలో నిలుపుకోవడం. నా ప్రత్యక్ష సాన్నిధ్యంలో వున్నప్పుడు సాధ్యం కాకపోవచ్చు లేకుంటే 60 సంవత్సరాలు శ్రీ సాయినాధుని సాన్నిధ్యంలో వున్నా అందరిలో శిష్యుడనదగిన వారొక్కరు కూడా కన్పించలేదని శ్రీసాయి ఎందుకంటారు. ఆ దేహామే వారన్న భ్రమపెరిగి, భక్తిశ్రద్ధలు అర్జునాదులకులాగే తగ్గే అవకాశముంది. అంతేకాదు ఏ ప్రయోజనాన్ని ఆశించి శ్రీ సాయి నన్ను విద్యానగర్‌లో నిలిపారో, అది నెరవేరాక ఆయనే నన్ను మరొకచోటికి పంపవచ్చు. సద్గురుడు ఎక్కడ ఎలా నిల్పితే అలా వుండగల్గడమే సచ్ఛిష్యుని జీవితానికి ధన్యత. శ్రీ సాయి పిటుపు అందిన తక్షణమే బయలుదేరవలసి వుంటుంది. అప్పుడు నాకెవ్వరూ గుర్తురారు. కనీసం వేదమ్మ, అమ్మగారికి చెప్పివెళ్ళే సావకాశముండదు" అన్నారు. ఆ వైరాగ్యమూర్తి వజ్ర సంకల్పానికి, అనన్య సామాన్యమైన గురుభక్తికి మేమంతా నిశ్చేష్టులయ్యాము. బాబాపిలుపు నందుకున్నాక మాస్టర్‌గారు ఎక్కడికి వెళతారో మాకు తోచలేదు. కాని ఆరోజుల్లో ఒకనాడు మాస్టర్‌గారు తనకు మొదటినుండి వివాహం చేసుకునే యోచన లేదని, కేవలం శ్రీసాయి ఆదేశానుసారం వివాహం చేసుకున్నానని, జీవితమంతా బ్రహ్మచర్యంలో గడిపి, శ్రీసాయి అనుమతి లభించాక హిమాలయంలోని "ఉత్తరకాశీ"లో స్థిరపడి ముక్తి చెందాలన్నదే ఆనాటి తన ధ్యేయమని ఆ కారణంగానే దేశంలోని పవిత్ర స్థలాలన్నింటిని దర్శించినా ఉత్తర కాశీకి వెళ్ళలేదని, అక్కడికి వెళ్తే తిరిగివచ్చే ప్రసక్తేలేదని అన్నారు. తన కోరికను శ్రీ సాయికి నివేదించి, వారి అజ్ఞకై మాస్టర్‌గారు నిరీక్షిస్తున్నారా? లేక బంధాలన్నీ తెంచుకొని, సన్యసించి, జీవిత లక్ష్యమైన ముక్తిని సాధించు కునేందుకు దేశంలో తిరుగుతారా? లేక తన నిర్యాణ ఘట్టాన్ని గూర్చి ముందుగా యిలా తెలియజేస్తున్నారా? మాస్టర్‌గారొక సాయి భక్తునితో తనకిక రెండు జన్మల అనుభవాలే మిగిలివున్నాయని, అందు మొదటిజన్మలో కన్యాకుమారి నుండి కాశ్మీరం వరకూ సాధువులా పర్యటిస్తానని, చివరి జన్మలో అవధూతగా

వుంటానని చెప్పారు. ఈ జన్మల అనుభవాలను గురించి మాస్టర్‌గారు ఏ విధంగా అన్నారా? ఏమో? తీవ్ర వైరాగ్యంతో అంతటి పరిపక్వ స్థితిలోనున్న ఆ దివ్యపురుషుని సంకల్పం, ఎవరికెరుక. మాస్టర్‌గారు స్ట్రాంగ్ కాఫీ ఇష్టపడతారని కుంటూ, బ్రూ కాఫీ ఫిల్టర్ కాఫీ వారికి యిస్తుండేవాండ్లము. అర్జంటుగా బ్రూ పొట్లం కావాలంటూ మాస్టర్‌గారి దగ్గరున్న నా దగ్గరకు నా శ్రీమతి వచ్చి మాస్టర్ గారి మాటలు విని, కలవరపడి "అమ్మగార్కి కూడా చెప్పకుండా, అందరిని దిక్కులేని వాళ్ళనుచేసి అలా వెళ్తే ఎట్లా మాస్టర్‌గారు. ఇది మాకెంత కష్టమో బాబాకు తెలీదూ" అంది. జవాబుగా మాస్టర్‌గారు "మనందరికి దిక్కు ఆ సాయినాధుడే కదమ్మా. ఒకసారి బాబా పాదాలవద్ద తలపెట్టి శరణాగతిచెందాక మన వ్యక్తిగత అభిప్రాయాలకు తావెక్కడుంటుంది. అలా తలవంచిన క్షణానే, వారి పరీక్షలన్నింటికి సిద్ధమన్నామన్నమాట. ఫీజుకట్టిన క్షణం నుండి పరీక్షరోజు దగ్గరపడ్తుందికదా. పరీక్షలకు భయపడేటట్లయితే ఫీజెందుకు కట్టాలి? ఆ సద్గురుడిచేత తాళి కట్టించుకొని, మనలను అర్పించుకున్నాక, సంచిలో గుడ్డలు పెట్టుకొని, వారి ఆజ్ఞకై నిరీక్షించడమే మన కర్తవ్యం. గౌతమబుద్ధుణ్ణి చూడండి ఆయన మరోలా ఆలోచించివుంటే, బౌద్ధమతం స్థాపించబడి, యిన్ని దేశాలకు వ్యాపించి, యింత మంది తలంపుకు అవకాశముండేదేనా? అయితే కొందరం టుంటారు. భార్యాబిడ్డల సంగతి పట్టించుకోకుండా వెళ్ళిపోవడం అధర్మం కాదా అని. కొద్దిగా యోచిస్తే కాదని తేలుతుంది. బుద్ధుడు మహారాజు కొడుకు. తాను వెళ్ళాక భార్యాబిడ్డల యోగక్షేమాలు చూచేందుకు తన తండ్రివున్నాడు. అలాగే మహారాజు తర్వాత ప్రజల యోగక్షేమాలు చూచేందుకు యువరాజుకా గల తన కుమారుడున్నాడు. ఆ కారణంగా ఇటు తనవారుగాని అటు ప్రజలుగాని తాను వెళ్ళాక నిరాధారులు అనాధలుకారు. మనస్సు తీవ్రవైరాగ్యానికి లోనైనప్పుడు ప్రవృత్తిమార్గాన్ని వదిలి, నివృత్తి మార్గానికి రావడం ప్రకృతి సహజమే కాకుండా శాస్త్రసమ్మతం కూడా. ఆ కారణంగా వారలా ఎవరికీ చెప్పకుండా వెళ్ళడం ధర్మవిరుద్ధంకాదు. కాని నాకు వేదమ్మ అమ్మగారు బాబా అప్పగించిన బాధ్యతలు, వారి జీవన వసతికి

ఏర్పాట్లు చేయవలసిన ఋణాను బంధాన్ని ఆయనే కల్పించారు. ఈ బాధ్యతను కూడా త్వరగా పూర్తిచేసి బాబా పిలుపుకై ఎదురు చూస్తుంటాను" అన్నారు. అవును మాస్టరుగారంత సమర్థులే! ఇంతసూక్ష్మంగా ధర్మాన్ని వివరించిన మాస్టర్‌గారి జ్ఞానసంపదకు గురుభక్తికి, వివేక వైరాగ్యాలకు ముగ్ధులమయ్యాము. కొద్దిక్షణాలు ఆ గౌతమబుద్ధుణ్నే మాస్టర్‌గారిలో దర్శించాము. క్రమేపీ హాలులో ప్రగాఢ ప్రశాంతత చోటు చేసుకుంది, మాస్టర్‌గారి సాన్నిధ్యప్రభావానికిలోనై, అందరూ అనిర్వచనీయమైన తృప్తి, శాంతి ఆనందాలనుభవిస్తూ, అంతర్ముఖులై మౌనంలోకి జారుకున్నారు.

బుద్ధం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి

తల్లిబిడ్డను ప్రేమించినట్లు సద్గురుడు భక్తుని ప్రేమిస్తుంటాడని గుర్తుంచుకోవాలి.

విచక్షణలేని విజ్ఞానం, ఇంపులేని సంగీతం వంటిది. విచక్షణా జ్ఞానం కొరవడిన వాడే గుడ్డివాడు.

నీవు పరబ్రహ్మానివు. ఇదే మహోన్నత సత్యం. దీన్ని ధ్యానించు ఈ సత్యమును దర్శించు

# మాస్టర్ దర్శనం - 11

## కుశలాన్న ప్రమది తవ్యం

"కుశలమును (క్షేమమును) కల్గించువానిపట్ల ప్రమాదమును (అజాగ్రత్తను) చెందకుము"

మాస్టరుగారు మహాసమాధి చెందిన తర్వాత శ్రీ సాయి భక్తుల మనస్సులు, ప్రాపంచిక భావాల ప్రభావానికి లోనై కంచెలేనిచేనుల్లా ప్రమాదాలకు గురి అవుతున్నాయి. శ్రీ సాయి మన కందించిన ధర్మసూక్ష్మాలను మననం చేసుకుంటూ, జీవితాన్ని సరిదిద్దుకోకపోతే అనేక ప్రమాదాలకు గురిఅవుతాము. "ప్రమదో మృత్యుః" అని కదా ఆర్షవాక్యము అందుకు పూజ్య గురుదేవులు భరద్వాజ మాస్టర్‌గారి "శ్రీసాయి లీలామృతము", "శ్రీసాయి ప్రబోధామృతము", "దత్తావధూతల చరిత్రలు" ఎంతో సహకరిస్తాయి. వెలుగుతున్న దీపానికి నూనె ఆధారమైనట్లు, నడుస్తున్న జీవితాలకు శ్రీ సాయిబోధే ఆధారం కావాలి.

ప్రతి సాయి భక్తుడు నిద్రలేవగనే "నేను సద్గురు శ్రీసాయినాథుని భక్తుడను. పూర్వజన్మ పుణ్యవిశేషాన నాకు వారి సేవా భాగ్యం లభించింది. వారి కృపకు పాత్రుడనయ్యే విధంగా నా జీవితాన్ని చక్కదిద్దుకొని ధన్యత చెందుతాను" అని కృత నిశ్చయులం కావాలి. శ్రీ గురుతత్త్వం, పాలలో వెన్నలా, ఈ సృష్టినంతా అంతర్లీనమైయుండి, మనకందిస్తున్న బోధను నిశితంగా గుర్తించకపోతే, నిరర్థకులమవుతాము. మరొక జన్మ వృథాగా గడిచిపోతుంది. మనకండ్ల ఎదుటే ఎందరో స్నేహితులు, సన్నిహితులు కనుమరుగైపోతున్నారు. వాకిట్లో నిలిచిన భిక్షగాడు, దారినపోతున్న శవం, నెరసిన జుట్టు, ఊడినపండ్లు మందగించిన చూపు, జీవితంలో ఎదురైన భయంకర కష్టాలు, ప్రమాదాలు ఇలా ప్రతిదీ సద్గురువై నిలిచి మన కండ్లు తెరిపించాలి. మన అహంకారపు అడ్డుగోడల్ని కూల్చివేయాలి. వివేక వైరాగ్యాలతోపాటు మానవత్వపు విలువలు కూడా మనలో మేల్కొనాలి.

మనం ఎటువంటి సంకల్పం చేస్తామో, అటువంటి ఫలితాన్ని పొందుతామని పూజనీయ మాస్టర్‌గారన్నది గుర్తుంచుకొని సాటి భక్తులను సోదర ప్రేమతో చూడాలి. ఎదుటివారిని కించపరచి సంతోషపడే స్వభావం అత్యంత ప్రమాద కరము. ఏ మేరకు ఎదుటివారి మనస్సు కష్టపడుతుందో, అంతకు సమానమైన వ్యధను కల్గించే దుస్థితిలో చిక్కుకొని యాతననుభవిస్తాము. అందుకు రూ. 2 లు దాచిన శ్యామా అనుభవమే సాక్షి. సాటివారిని దూషిస్తుంటే ఆలకించినా దోషమే. అందరిలో నేనున్నానని సాయి మనకిచ్చిన అనుభవం మనకేమి నేర్పినట్లు. ఇటువంటి వారి స్వభావాన్ని శ్రీ సాయి మలభక్షణ చేస్తున్న పందితో పోల్చారు. తాజుద్దీన్‌బాబా ఇలా అన్నారు. "సారాయి త్రాగు, ఖురాన్ కాగితాలను తగులబెట్టు. కావాలంటే దేవాలయంలో నివసించు, కాని ఏ జీవి మనస్సును అణుమాత్రం గాయపరచకు".


అయితే "నేను శ్రద్ధగా శ్రీ సాయిచరిత్ర పారాయణ చేస్తూ, శ్రీసాయి సేవలో ఉన్నానుగదా నాకేమి" అన్న ధీమాలో కొందరు సాయిభక్తులుండవచ్చు. కానీ శ్రీ సాయిచరిత్ర పారాయణాలతో సేవలతో మనకులభించే మనశ్శాంతి కేవలం తాత్కాలికమైనదే. ఇది శరీరాన్ని పీడిస్తున్న వ్యాధిని శక్తివంతమైన మందులతో నయం చేసుకోవటంలాంటిది. నిజమైన ఆరోగ్యం శరీరంలో వ్యాధినిరోధక శక్తి పెరిగినప్పుడే కదా! అది శ్రీ సాయి చెప్పిన అనేక సూక్ష్మాంశాలపట్ల అప్రమత్తులమైనప్పుడే సాధ్యమవుతుంది. ఉదాహరణకు అనేక రకాలైన అహంకారాలతో మనం అతిశయమైన సాయిభక్తులమన్న భావన కూడా సాత్త్వికమైన అహంకారమే. ఇది రక్తంలో కాన్సర్ వ్యాధి వంటిది. వ్యాధి లక్షణాలు ప్రమాదకరంగా మారినప్పుడే దీన్ని గుర్తించగలము. దీనివల్ల మనము ఇతరులను అంచనావేసి, వారికన్నా మనమధికులమన్న అపోహను మనకు తెలియకుండానే లోనికి ప్రవేశపెడ్తున్నాం. అంతటితో, సాధకులమనికూడా చెప్పుకోవటానికి అర్హత లేని మనం, ఎదుటివారి మనస్సు నొప్పించేందుకు ఏ మాత్రం జంకము. ఇది ఆధ్యాత్మిక పురోభివృద్ధికి మన కాళ్ళకు మనం వేసుకున్న బంగారు సంకెళ్ళు.

సగుణ బ్రహ్మమైన ఆ సద్గురుని శక్తిముందు తలవంచుకొని వినమ్రులమై గడ్డిపరకలవలె వుండవలసిన మనం, ఈ అంతఃశత్రువులకు లొంగి అందరిలో సాయిని స్మరించే సంస్కారాన్ని కోల్పోతాము. శ్రీ దాసుగణ్ అంతటి సాయి భక్తుడే ఆరతిలో "ఆపనే మసజీద్‌కా ఝాడూ గణూహై" అంటే "నీ మసీదును తుడిచే చీపురు వంటివాడు ఈ గణు" అటుంటే మనమెంత? ఆ కారణంగా పైన చెప్పిన వారి ప్రవర్తన "దేవతలు అడుగిడ జంకేచోట దయ్యాలు యధేచ్ఛగా తిరుగుతాయి" అన్నట్లు వుంటుంది. పూజ్యగురుదేవులు సత్సంగాల్లో, తరచు "లపోటా శంఖాన్ని" గూర్చి చెప్తుండేవారు. అది అడిగినవన్నీ ఇస్తానంటుందిట కానీ ఇవ్వదు. అట్లే మనం సాయిభక్తుల మంటుంటాం కాని సాయిబోధను ఆచరణలో పెట్టము. ఇటువంటి మాలిన్యంతో నలుగురిలో తిరగడం, "అంటువ్యాధి వున్నవాడు సమాజంలో తిరిగినంత ప్రమాదమని" మాస్టర్‌గారనే వారు. తెలియని అమాయక శిఖామణులు ఈ వ్యాధినంటించుకొని బలైపోతారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనమేముంటుంది. ఆ తర్వాత సాయి పలికే ప్రసక్తేలేదు. తన మాట పాటించని భక్తునితో శ్రీ సాయి "నిన్ను నీ ఖర్మకు వదిలేస్తానని" అన్నారు. ఇందుకు నానాసాహెబ్ చందోర్కర్ అనుభవమే సాక్షి. ఒకసారి 'కళ్యాణ్' లో పేదరాలైన వృద్ధ బ్రాహ్మణ స్త్రీ నానా ఇంటికి భిక్షకు వచ్చింది. నానా భార్య ఆమెకు రెండు శేర్ల ధాన్యమిచ్చినా తృప్తిచెందక, నాలుగు శేర్లు ఇస్తేగాని అక్కడ నుండి వెళ్ళనని వేధించసాగింది. ఇదంతా గమనిస్తున్న నానా విసుగుచెంది "ఇచ్చింది తీసుకుపోతావా, జవానుచేత గెంటించమంటావా" అన్నాడు. ఆమె వెళ్ళిపోయింది. ఆ తర్వాత అతడు షిరిడి వెళ్ళినప్పుడు సాయి బాబా ఎంతకూ అతనితో మాట్లాడలేదు. కారణమడిగితే "నీవు నేను చెప్పింది మరచిపోయావు ఆ పేదరాలు ఇంకా ఇవ్వమనికోరితే అంత కోపగించుకొని, నీ అధికారం చూపడమెందుకు? ఆ చెప్పేదేదో కొంచెం మర్యాదగా చెప్పవచ్చు గదా! "నేను చెప్పింది గుర్తుంచుకోని వారితో నేనెందుకు మాట్లాడాలి" అన్నారు.

అయితే అందరిలో ఈ సంస్కారం మేల్కొనేలోపల అజ్ఞానంతో మనలనెవరైనా నిందిస్తే మనం ఓర్పు వహించాలి. "ఎవరైనా మనపట్ల జంతువు వలె ప్రవర్తిస్తే మనం కూడా వారిపట్ల అలానే ప్రవర్తించాలా ఏమి? మన ప్రవర్తన ద్వారా మనం మానవులమని నిరూపించుకుందాం" అని పూజనీయ మాస్టర్‌గారు చెప్పింది గుర్తుండాలి. తనకు అత్యంత ప్రియులెవరో శ్రీసాయి ఈ మాటల్లో స్పష్టంచేశారు. "ఇతరులు చేసే పనులకు వారిమీదే ప్రభావం వుంటుంది. నువ్వు చేసే పనులకే నీపై ప్రభావముంటుంది. నీ గురించి చెడుగా మాట్లాడితే చలించకు. వారి మాటలు నీకేమీ గుచ్చుకోవు గదా. ఎవరు నిందను, దూషణను ఓర్పుతో సహిస్తారో వారే నాకు అత్యంత ప్రియులు". ఆ కారణంగా శాంతి, సామరస్యాలను విస్తరింప చేయడానికే మనమంకిత మవ్వాలి. అందుకే "శాంతిని స్థాపించువారు ధన్యులు. వారు భగవంతుని కృపా పాత్రులు" అన్నారు జీసస్.

ఆ కారణంగా మనంవేసే ప్రతి అడుగు, పలికే ప్రతిమాట, మనలను ఆ సద్గురు చంద్రుల కృపకు పాత్రులను చెయ్యాలి. అప్పుడే శ్రీసాయి భక్తుల మధ్య రాగద్వేషాలు, ఈర్ష్య అసూయలుగాక పవిత్ర ప్రేమ, సామరస్యాలు నెలకుంటాయి. శ్రీసాయి భక్తులది వసుధైక కుటుంబ మవుతుంది. పూజ్య గురుదేవులు శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారి జన్మదినోత్సవంనాడు, ఆయన బిడ్డలమైన మనమంతా ఈ ఆశయ సాధనకు పునరంకితమవుదాము. తైత్తరీయ ఉపనిషత్, శిక్షావల్లి "కుశలమును కల్గించువానిపట్ల ప్రమాదమును (అశ్రద్ధను) చెందకుము" అని హెచ్చరిస్తున్నది.

"మనమేం చేయాలి, మనం గూడ ఎలా తరించాలి. ఇతరులు తరించటానికి ఎట్లా సహకరించాలి" అని ఆలోచించు.





# మాస్టర్ దర్శనం - 12

1. మాస్టర్‌గారిలాంటి మహనీయుని సన్నిధిలో సాధన చేసుకునే సావకాశం, విద్యానగర్, ఒంగోలు వారికెక్కువగా లభించిందనడం అతిశయోక్తికాదు. అంతేకాదు మహాత్ముడైన మాస్టర్‌గారిని శాశ్వతంగా ఒంగోలులో నిల్పుకో గలగడం కూడా ఇక్కడి భక్తుల పుణ్యవిశేషమే. మాస్టర్‌గారు అంతటి మహనీయుడు కావడానికి వారి తండ్రి శ్రీ అనంతాచార్యులుగారే ప్రధమ కారణమైనా, వారిలో (మాస్టర్‌గారి) వివేక వైరాగ్యాలు, నిశ్చలగురుభక్తి, లక్ష్యము ధర్మనిష్ఠ, అన్నింటిని మించి మహాత్ములను సేవించి వారసత్వంగా పొందిన తపఃశక్తి కూడా కారణభూతాలే. నిర్గుణతత్త్వంగా నిలిచిన వారి స్మరణే తృప్తి శాంతి, ఆనందాలను ప్రసాదించి, ముక్తిదాయక మవుతున్నదని మురిసిపోతున్న వారున్నారు. ఈ జగత్ సత్యమని మనమెలా త్రికరణ శుద్ధిగా నమ్ముతామో, వారలాగే ఈ జగత్తుకు మూలకారణమైన బ్రహ్మమే సత్యమని స్వానుభవ పూర్వకంగా తెలుసుకున్నారు. అందుకే పావలా డబ్బులకమ్ముడుపోయే మధ్య తరగతి మేధస్సుకు వారి చర్యలు, మాటలు అర్ధంకావు.

2. మాస్టర్‌గారొకసారిలా అన్నారు. "నాకెవరిపట్ల దురభిప్రాయముండదు. నాకెవరిపైనా ద్వేషంగాని, ప్రీతిగాని యుండదు. నేనెవరిపట్లనైనా, ఎలా, ఎందుక ప్రవర్తిస్తానో ఆలోచించవద్దు. అలా చేస్తే మీ సాధన ఆగిపోతుంది" అయితే మాస్టర్‌గారి చర్యలను గూర్చి యోచిస్తే మన సాధనెందుకు ఆగిపోతుంది? స్వార్థమమకారాలతో కూడిన మన మనస్సు రాగద్వేషాల ఊబిలో దిగబడి, సాధనామార్గంలో ముందుకు సాగదని వారి భావం. అందుకే సాయిభక్తుల మధ్య నిర్మల ప్రేమ, సామరస్య, సహకారాలే తప్ప, స్వార్థమమకారాదులకు తావుండరాదనేవారు. "ఎవరినైనా పరోక్షంగా నిందించడం నేరం. భక్తుల మధ్య చెలరేగిన వైషమ్యాలను పరస్పర చర్యల ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప కక్ష్యలకు, కార్పణ్యాలకు దిగరాదు" అనేవారు. అందుకెవరైనా పాల్పడితే

విమర్శించేవాడు విమర్శింపబడేవాడు, కలిసి తన సన్నిధిలో వారి సమక్షంలోనే నిగ్గుతేల్చి, వారిమనసుల కంటిన మాలిన్యాన్ని పూర్తిగా తుడిచేసేవారు. అంతటితో వారిలోని ఈ దుష్ట సంస్కారం పూర్తిగా నశించిపోయేది.

3. మాస్టర్‌గారి మాటలు, చర్యలు కారణ జన్మలుగా నిరూపిస్తాయి. విద్యానగర్‌లో సాయి మందిర నిర్మాణం జరుగుతున్న రోజుల్లోనే, ఇక్కడ (ఒంగోలులో) కొన్ని లక్షల రూపాయల వ్యయంతో గొప్ప సాయి మందిరం నిర్మించబడి, రెండవ షిరిడీగా ప్రసిద్ధి చెందుతున్నారు. ఆనాటి అక్కడ మందిర నిర్మాణ తలంపేలేదు. ఈ ఒక్క సంఘటన చాలు వారి దివ్యత్వాన్నర్థం చేసుకోవ డానికి. ఎక్కువ గౌరవ ప్రతిష్ఠలను సంపాదించి పెట్టగల ఐ.ఏ.ఎస్. ఉద్యోగాన్ని కాదని, సాయితత్త్వ ప్రచారానికెక్కువ విరామాన్నందించగల లెక్చరర్‌పదవిని వరించారు. సున్నితమనస్కులైన విద్యార్థులను, ఆధ్యాత్మిక యువకిశోరాలుగా మలచి, సమాజానికందించే యత్నం చేశారు. ఉద్యోగం చెయ్యడం, మానడం వారికొక ఆట. తమ లక్ష్య సాధనకవకాశంలేని చోట, క్షణం నిలవక, రాజీనామా చేసిపోయేవారు. ఇలా ఒంగోలు కాలేజీ విడిచి వెళ్ళిపోయిన 3 నెలలకు, వారి తండ్రిగారిక్కడకు వచ్చి విషయం తెలుసుకొని, విస్మయం చెందారు. అందరిలాగా వేసవి శెలవుల్లో బంధువులిండ్లకు పోక, దివ్యపురుషుల దర్శన ఆశీస్సులపై దేశంలోని ఆశ్రమాలవెంట తిరుగుతుండేవారు. ఇలా తిరిగేందుకు పేద విద్యార్థులకు, కష్టాల్లోవున్న భక్తుల నాదుకునేందుకు, తన జీతాన్నంతా ఖర్చు చేసేవారు. తనపైకంతో ప్రయోజకులై, ఉన్నత పదవులందుకున్న వారు, తాను (మాస్టర్‌గారు) కష్టాల్లో వున్నప్పుడు ఆ పైకాన్ని తిరిగి ఇచ్చి ఆదుకోనందుకు బాధపడ్డారేకాని, వారిపై ఏ మాత్రము కినుక వహించని మహనీయుడాయన.

4. మాస్టర్‌గారికి పనులు చెయ్యడమేగాక, చేసీ చెయ్యనివాడుగా ఉండగల సామర్థ్యముండేది. అందుకే వారు చెప్పింది చెయ్యడమేగాని, చేసింది చెయ్యడ మెంతటి వారికైనా సాధ్యపడదు. "యతోధర్మస్తతోజయః" యని విశ్వసించే మాస్టర్‌గారి ధర్మదృష్టి, నిర్భయత్వము అనన్య సామాన్యమైనవి. వారు పరీక్ష

డ్యూటీ చేస్తున్న హాలులో, కాలేజీ పాలక వర్గ సభ్యుని కూతురుంది. ఆమెకు కాపీలందించి, ఆ సభ్యుని ప్రాపకం సంపాదించాలని కొందరు తలచారు. మాస్టర్‌గారు వారితో "కాపీతో సహా ఆ అమ్మాయిని పట్టివ్వడమేగాక, మీ ప్రవర్తన పై అధికారులకు తెలియజేస్తా" నన్నారు. ఇదెంత ప్రమాదకరమో గ్రహించిన లెక్చరర్లు తమ కుటిలయతలకు స్వస్తి చెప్పారు. వేరొక కాలేజీలో, కత్తిపెట్టి కాపీ కొడ్తున్న విద్యార్థి రూముకు, మాస్టర్‌గారికి డ్యూటీ పడేలా సర్దుబాట్లుచేసి మిగిలిన లెక్చరర్లు తప్పుకున్నారు. రూములో ప్రవేశించిన మాస్టర్‌గారు, ఆ విద్యార్థి క్రూర చూపులను లెక్కచేయక ఆ కత్తిని కాపీని విద్యార్థిని పట్టుకువచ్చి ప్రిన్సిపాల్‌కు అప్పగించారు. తర్వాత రోజుల్లో కాలేజీ పిల్లలు "భరద్వాజగారి మనస్తత్వం మనకు తెలిసిందేగదా. వారికి పరీక్షల డ్యూటీవేస్తే సహించబోమని" ప్రిన్సుపాల్‌గారిని బెదిరించారు. కాని మాస్టర్‌గారి జోలికి రాలేదు. ఈ విధంగా తనకు విరామ మిప్పించి, సాయి తత్త్వ ప్రచారానికి వెసలుబాటు కల్పించిన సాయికి మనసులోనే కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు మాస్టర్‌గారు.

5. ఆధ్యాత్మిక సాధన ముక్కాలిపీటవంటిదనేవారు మాస్టర్‌గారు. ఏకాలు విరిగినా అదెలా నిరుపయోగమో అలాగే త్రికరణ శుద్ధి లోపించిన ఆధ్యాత్మిక సాధన కూడా నిష్ప్రయోజనమన్నారు. కారులో వెళ్ళేందుకు కొన్ని అర్హతలుండాలి కాని సిటీబస్సులో వెళ్ళేందుకు అందరూ అర్హులే. సాయి సాంప్రదాయం సిటీ బస్సులాంటిదంటూ, అన్ని స్థాయిల సామర్థ్యాలు వారు అందులోకి అర్హులే. కాకుంటే లక్ష్యశుద్ధి, త్రికరణశుద్ధి లేనివారు మధ్యలో రాలిపోగా, అవి వున్నవారు నిశ్చయంగా గమ్యానికి చేర్చబడతారన్నారు.

6. పరమాత్మ ప్రతిరూపాలైన జీవుల తరింపుకు అంకితమైన మాస్టర్‌గారికి విసుగు, విశ్రాంతులు తెలియవు. మాస్టర్‌గారికి విశ్రాంతి లేకున్నదని, భక్తులు, వారి దర్శనానికి ప్రత్యేక వేళలను కేటాయించారు. అందుకు ప్రతిగా మాస్టర్ స్థానిక సాయిమందిరంలో సద్గోష్ఠులు నిర్వహించి, అమూల్యమైన తమబోధ,

సాన్నిధ్యాలను అందరికి కలగచేసి హితము చేయుటయే వ్రతంగా చేపట్టారు.

7. మాస్టర్‌గారిది మాతృహృదయం. మాతృస్వరూపులైన వారి ప్రేమామృతాన్ని చవిచూశాక, వారినొదిలి వుండడం మరణసదృశంగా వుండేది. అంతేకాదు బిడ్డ లెల్లప్పుడూ తనపై ఆధారపడే, అసమర్థులు కావడం ఏ తల్లి సహించదు. అలాగే భక్తులు ఎంతటి కష్టాన్నైనా ధైర్యంగా ఎదుర్కోగల ధీరులుగా, గురు భక్తులనుగా తీర్చి దిద్దేందుకు తపించేవారు. అందుకే తన సన్నిధిన బహుకాలం సాధన చేసిన వారిని, ఏదో మిషనుకల్పించి దూరంగా నెట్టేసేవారు. ఈ ఎడబాటును భరించలేక, యాతన పడ్తున్న భక్తులకు, తన చర్యలు నాటకీయమైన వన్న రహస్యం తెలియనీయకుండా జాగ్రత్త పడేవారు. వివిధ ప్రదేశాలలో ఇలా స్వతంత్రంగా సాధన చేస్తున్న భక్తులు, తగిన కాలానికి ప్రటకమై, తన ఆధ్యాత్మిక సాంప్రదాయానికి వారసులవుతారని మాస్టారుగారొక గురుబంధువుతో అన్నారు. శిరిడిలో నాకు మాస్టర్‌గారి పరిచయభాగ్యం కల్గిననాటి నుండి నేటి వరకు వారి ఆధ్యాత్మిక శిక్షణలో కలిగిన అనుభవంతో ఈ వాక్యాలు వ్రాస్తున్నాను.

1963 ఫిబ్రవరి 9నాడు షిరిడీలో సాయి సన్నిధిన సంప్రజ్ఞాత సమాధిలోకి వెళ్ళిన మాస్టర్‌గారికి మన బలహీనతలన్నీ సుస్పష్టమే. తన కబంధకౌగిలిలో బిగించి, కబళింపచూస్తున్న ప్రకృతి శక్తులనుండి రక్షించుకోవడం విశ్వామిత్రాది మహర్షులకే కష్టమైనప్పుడు, అల్పజ్ఞులమైన మనమెంత? అందుకే బలహీనత లన్నింటిని ఛేదించి, తరింపచేయగల వజ్రాయుధమైన సాయి లీలామృతాన్ని మన చేతనుంచారు. మనలను గురుకృపకు గురి చేయగల పారాయణ గ్రంథమైన గురుచరిత్రను మనకిందించారు. మరెన్నో మహాత్ముల చరిత్రలను వెలుగులోకి తెచ్చారు. ఈనాడు అక్షర రూపంగా నిలచిన ఆ పుణ్యపురుషుని రచనలను పారాయణ జేసి వారు చూపిన సాధనా మార్గంలో పయనించి, గమ్యం చేరుదాము.

# మాస్టర్ దర్శనం - 13

## శ్రీసాయి తత్త్వ ప్రచారంలో శ్రీసాయి మందిరాల సేవ

ఏదో తెలియని అదృశ్యశక్తి ఈ విశ్వాన్ని కొన్ని ధర్మాలననుసరించి నడిపిస్తున్నదని నాస్తికులు కూడా అంగీకరిస్తారు. ఆ శక్తికెంతో తెలివి, సామర్థ్యము లేకుంటే ఈ విశ్వాన్నింత క్రమబద్ధంగా నడిపించగలదా? ఈ శక్తికి చైతన్యమే మూలధర్మమని, ఈ సృష్టి మూలమంతా ఆ చైతన్యరూపమేనని మతాలన్నీ అంగీకరిస్తాయి. శ్రీసాయి కూడా "ఏకం సత్ విప్రా బహుధావదంతి" అన్న వేదవాక్యానికి ప్రతీకయై తమ సమకాలీన మహాత్ములేగాక, గతకాలపు మహాత్ములు ముక్కోటి దేవతలు, సకల జీవులు, తుదకు జడ పదార్థం కూడా తమ రూపమేనని, తమకు ఆ చైతన్య రూపానికి తేడా లేదని స్పష్టం చేశారు. "గురుర్విశ్వం నచాన్యోస్తి తస్మైశ్రీ గురవేనమః" అంటూ గురుగీత ఈ భావాన్నే మరింత ధృడపరచింది. శ్రీసాయి కూడా సృష్టిలోని ఏ జీవినాదరించినా, తన నాశ్రయించిన భక్తుల లౌకిక ఆధ్యాత్మిక శ్రేయస్సులకు తానే బాధ్యత వహిస్తానని వాగ్దానం చేశారు. ఆ కారణంగా సాటిజీవులకు తలపెట్టినకీడు, మన గురువుకు తగిలినట్లయి, అంతకు పదిరెట్ల దుఃఖాన్ని నెత్తిన వేసుకుంటారు. శ్రీసాయి లీలామృత పారాయణతో ఈ సత్యాలు హృదయగతమయ్యాక, మనమెలా దుఃఖాన్ని కోరుకోమో, ఆ దుఃఖానికి కారణమైన పాప కర్మాచరణకు కూడా పూనుకోము. కాలుతుందని తెలిసికూడా నిప్పులో చెయ్యిబెట్టే మూర్ఖుడుంటాడా? అకారణంగా ఈనాటి సుఖదుఃఖాలు, ఒకనాటి మన పుణ్యపాప కర్మల ఫలితాలేనని గుర్తించి, ప్రజలంతా సధర్మాచరణతో ప్రతిఒక్కరు పదిమందికోసం, పది మంది ప్రతి ఒక్కరికోసం శ్రమించాలి. ఆనాడన్ని మత సాంప్రదాయాలవారు, కలిసి మెలసి సోదరభావంతో మనగలుగుతారు. సమాజంలో సుఖశాంతులు వర్ధిల్లుతాయి. అప్పుడది వసుధైక కుటుంబమవుతుంది. ఈ లక్ష్యాన్ని శ్రీసాయి తత్త్వ ప్రచారంతో సాధించేందుకు పూజ్యగురుదేవులు, శ్రీసాయి బాబాకాబేటా, ఆచార్య శ్రీ ఎక్కిరాల

భరద్వాజ మాస్టర్‌గారు తన జీవితాన్నే త్యాగం చేశారు. అందుకే వారు ఏ ఒక్క మతానికి చెందరు, అన్ని మతాలకు చెందుతారు.

ఒకలక్ష్యము, గమ్యము లేక అలజడి, ఆందోళనలు, కులమత విద్వేషాల చీకటిలో కొట్టుమిట్టాడుతున్న నేటి సమాజానికి సాయి ధర్మమే శిరోధార్యము, సాయి మందిరాలే మణిదీపాలు. ఏ మతానికి చెందినవారిని, ఆ మత సాంప్రదాయానుసారం నడిపించిన ఘనత చరిత్రలో వారికొక్కరికే దక్కుతుంది. శ్రీసాయి లీలామృత పారాయణ, సత్సంగాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించబడే చోట, శ్రీసాయి కృపకు చిహ్నంగా మందిరాలు వెలుస్తున్నాయి. వాస్తవానికి బాహ్యంగా నిర్మించబడుతున్న మందిరం, శ్రీసాయి తత్త్వ ప్రచారంతో ఆసద్గురు మహిమకు గురియైన భక్తుల హృదయాల్లో రూపుదిద్దుకుంటున్న మందిరాలకు ప్రతీకయే. అందుకే తన లక్షరూపాయల విరాళంతో ఒక ధనవంతుడు నిర్మించిన మందిరంకన్నా, శ్రీసాయికి సమర్పిస్తున్నామన్న సంస్కారవంతులైన భక్తుల విరాళాలతో నిర్మించిన మందిరమెంతో శ్రేయస్కరం. శ్రీసాయి మహిమకు పరవశించే భక్తులతో ఇల్లు, మందిరాలు నిత్యకళ్యాణం, పచ్చతోరణంలా విలసిల్లు
తుంటాయి. మందిర నిర్మాణానికై, ఉరకలు వేస్తున్న వారితో, మాస్టర్‌గారిలా
అంటున్నారు. "నిజానికి మీరు నిర్మించే మందిరం, బాబాకు అక్కర్లేదు. లౌకికంగా
మనకూ అక్కర్లేదు. భావితరాల వారికెంతో ఉపకరించే ఈ సత్కార్యాన్ని నిష్కామ
కర్మగా తలచి, మనలోని చెడ్డ సంస్కారాలను తొలగించుకుని, మన
అంతరంగాన్ని శుద్ధం చేసుకోవాలి. అంతేగాక సామాజిక శ్రేయస్సుకోసం,
పనిచేసేటప్పుడు మనం నిందాస్తుతులకు గురియవుతాము. ఈ రెండింటివల్ల
నిర్లిప్తులమవడం, మనం సాధించదలచిన సంఘ శ్రేయస్సు, ఆత్మపారిశుద్ధ్యాలకు
మాత్రమే ప్రాముఖ్యత నివ్వడం నేర్చుకుంటాము. ఇట్టి పరివర్తన, మనలో
పూర్తి అయ్యేసరికి మన హృదయమే నిజమైన సాయిమందిర మవుతుంది.
అందులో బాబా తనను తానే ప్రతిష్ఠించుకుంటాడు. అయితే ఈ నిష్కామ
కర్మను, ఎలా నిర్వహించాలి. ఒకభక్తుడీ ప్రశ్నను శ్రీరమణులను అడిగాడు.

భగవాన్ సమాధానం చెప్పక, మౌనంగా వుండిపోయారు. తర్వాత కొన్నాళ్ళకు కొండపై నున్న అడవికి ఈ భక్తునితో వ్యాహ్యాళిర్థం వెళ్ళారు. భగవాన్ ఎండు చెట్టు కొమ్మను తెచ్చి, గంటకు పైగా శ్రమించి, చక్కటి చేతికఱ్ఱను తయారు చేసారు. ఇంతలో ఒక ముదుసలిగొల్లవాడు నడవలేక శ్రమపడుతూ అటునుండి వచ్చాడు. ఆ చేతికఱ్ఱను ముదుసలికిచ్చి వెంటనున్న భక్తునితో "కర్మ అయినది, నిష్కామకర్మ కూడా అయినది" అన్నారు. ఇట్టి నిష్కామ కర్మగా శ్రీసాయి మందిర నిర్మాణాన్ని చేపట్టినవారు, క్రమేపి ఈ జగత్తును శ్రీసాయి మయంగా దర్శిస్తారు. ఇది మనకు శ్రీసాయి ప్రసాదించతలచిన మహితవరం మందిర నిర్మాణాల వెనుక గల ఈ పారమార్థిక ప్రయోజనాన్ని గుర్తించలేకుంటే, ఈ పుణ్యకార్యం మనవల్లనే జరుగుతున్నదని అహంకారం తెలియకుండానే లోనికి జొరపడుతుంది. ఈ జాడ్యం బలపడితే శ్రీ సాయికి మనకు మధ్యఇనుప తెరలు పడ్డట్లే. ఇట్టి దుష్పరిణామాలను కొన్ని మందిరాల నిర్వాహకుల్లో చూస్తున్నాము. మందిరాలను, మనలను ఈ ప్రమాదం నుండి రక్షించుకోడానికి, సరియైన తత్త్వ ప్రచారమే శరణ్యం.

అందుకే మాస్టర్‌గారు శ్రీసాయి తత్త్వ ప్రచారానికిచ్చిన ప్రధాన్యత, మందిర నిర్మాణాలకివ్వలేదనిపిస్తుంది. లక్షలాది రూపాయలు వెచ్చించి, మన పూర్వీకులు నిర్మించిన, పెద్దపెద్ద దేవాలయాలు, ఈనాడు నిర్మానుష్యంగా నిరుపయోగంగా పడివున్నాయి. ఈ దేవాలయాలను, సమర్థవంతంగా, వినియోగించుకోగలవారి సంఖ్య క్రమేపి తగ్గిపోతున్నది. వేదాల్లో చెప్పబడ్డ అసలైన ఆధ్యాత్మికతను, విజ్ఞాన శాస్త్రాలతో సమన్వయపరచి, ప్రజల్లో మాస్టారిగారి వంటి సమర్థులైన ధర్మ ప్రచారకుల అవసరం ఎంతైనా వుంది. ముందు ఈ లోపాన్ని సరిదిద్దుకోవాలి. శ్రీసాయి మందిర నిర్మాణానికి ఇస్తున్న ప్రాధాన్యత, సాయితత్త్వ ప్రచారానికి ఇవ్వాలి. పరస్పరం పరిపూరకాలైన ఈ రెండు సత్కార్యాలు శ్రీసాయి ఉద్యమ రథానికి చక్రాల వంటివి. కార్యకర్తలందరు పూజ్య మాస్టర్‌గారి రచనలన్నింటిని శ్రద్ధగా పారాయణ చేసి, సాయి కృపకు పాత్రులై శ్రద్ధాభక్తులతో





శ్రీసాయి ప్రబోదామృతంతో మొదట తనను సంస్కరించుకునే సాధనలో వుంటూ విధిగా శ్రీసాయి తత్త్వప్రచారానికి పూనుకోవాలి. తమ సాయి లీలామృతంతో, మనపై సాయికృపను వర్షింపచేస్తున్న పూజ్యగురుదేవుల ఋణమేనాడు తీర్చుకోలేము. కాకుంటే వారి జీవిత లక్ష్యమైన శ్రీసాయి తత్త్వప్రచారానికి, మనమంతా అంకితమై కొంతవరకైనా ఋణం తీర్చుకొని, ఆ మహనీయుని కృపకు పాత్రుల మవుదాము.


శ్రీసాయి మందిర నిర్మాణాన్ని, కార్యకర్తలు ఒక 'యజ్ఞక్రియ'గా దర్శించాలి. పూజనీయ మాస్టర్‌గారింత వరకూ కొనసాగించిన సాయితత్త్వ ప్రచారంతో, ప్రభావితులై శ్రీసాయి కృపకు పాత్రులైనవారు మందిరాలను నిర్మించి సత్సంగాలను నిర్వహిస్తూ దక్షిణలు సమర్పిస్తున్నారు. ఈ దక్షిణలో సగభాగం మందిర నిర్మాణ నిర్వహణలకు, మిగిలిన సగం శ్రీసాయి తత్త్వ ప్రచారానికి వినియోగించాలి. ఈ ప్రచారంతో మరికొంత మంది శ్రీసాయి మహిమకు గురియై శ్రీసాయి భక్తులుగా మారుతారు. ఈ విధంగా శ్రీసాయి భక్తుల సంఖ్య క్రమేపీ పెరుగుతుంది. మందిర ఆదాయం పెరుగుతుంది. శ్రీసాయి తత్త్వ ప్రచారనిధి పెరుగుతుంది. పలుప్రాంతాలలో మందిరాలు నూతనంగా నిర్మించ బడతాయి. కొంత కాలానికీజగత్తు శ్రీసాయి భక్తులమయం అవుతుంది. దేవుని రాజ్యం, భూమిపై ప్రతిష్ఠించబడుతుంది. ఇదే పూజ్యగురుదేవుల ఆకాంక్ష. అందుకేవారు తమ ప్రవచనాలతో పాటు "శ్రీసాయి బాబా" పక్షపత్రికను స్థాపింప జేసి సాయి ధర్మప్రచార యజ్ఞాన్ని శక్తివంతం చేసారు. ఈ యజ్ఞకార్యాన్ని సమర్థవంతంగా కొనసాగించి ఆ మహనీయునికి తగ్గ వారసులమనిపించు కొందాము.

మందిరాలు శ్రీసాయి తత్త్వ ప్రచారనిధిని ఈ విధంగా వినియోగించాలి. పూజ్య మాస్టర్‌గారి రచనలన్నింటిని ముఖ్యంగా శ్రీసాయి లీలామృతము, శ్రీ గురుచరిత్ర, శ్రీసాయి ప్రభోదామృతము, సాయి సన్నిధి, తదితరుల దత్తావ తారాల చరిత్రలను, మందిరానికి వచ్చే పేద భక్తులకు, ఉచితంగా పంచడం,

మందిరాల ప్రథమ కర్తవ్యము. శ్రీసాయి లీలామృతాన్ని మరాఠి సచ్చరిత్ర స్థాయిలో పారాయణ గ్రంథంగా ముద్రించేందుకు సహాకరించడం రెండవ కర్తవ్యం. శ్రీ సాయిబాబా పటాలను, పూజా పుస్తకాలను, ఉచితంగా పంచడం మూడవ కర్తవ్యం. తమ జీవితాలను శ్రీసాయి సేవకు అంకితం చేసిన ధర్మ ప్రచారకుల ఒకరిద్దరిని పోషించడం నాల్గవ కర్తవ్యం. వీరి ద్వారా దేశంలోని సాయిమందిరాలలో శ్రీసాయి తత్త్వ ప్రచారము, నాల్గుహారతులు, సత్సంగాలు, శ్రద్ధాభక్తులతో నిర్వహించబడేలా చూడాలి. శ్రీసాయి స్వరూపులైన సాధు సత్పురుషులకు, సంతులకు, ఉచిత భోజన వసతిని ఏర్పాటు చేయడమొక కర్తవ్యం. మాస్టర్‌గారి ఉపన్యాసాల క్యాసెట్లను సాహిత్యాన్ని పల్లె ప్రాంతవాసుల చెంతకు చేర్చాలి. ప్రథమంలో వైద్యసేవను, నిధులు సమకూరాక యోగ విద్యాసేవను, చేపట్టాలి. ఏడాదికి ఒకసారి నిరుపేద సాయి భక్తులను సాయి ధర్మప్రచారకులను ఈ నిధితో షిరిడీ తీసుకువెళ్ళాలి. మందిరాల ఆర్థిక వసతి బట్టి ఇట్టివే మరికొన్ని కార్యక్రమాలు చేపట్టి, శ్రీసాయి జ్యోతితో లోకాన్ని వెల్గులతో నింపాలి. ఈ మార్గాలలోనే గాక, సోదర సాయి భక్తులు సూచించే మరికొన్ని మార్గాలలో కూడా శ్రీసాయి తత్త్వ ప్రచార ఉద్యమరథాన్ని ముందుకు నడిపించి, శ్రీసాయి మాస్టర్‌ల కృపకు, పాత్రులమవుదాము.

**దైవనిర్ణయమును త్రోసివేయుగల శక్తి భగవత్ ప్రార్థనకు తప్ప మరిదేనికి లేదు.**

**మానవుని పట్ల కృతజ్ఞతలేనివాడు, దేవుని పట్ల కృతజ్ఞత లేనివాడే.**






# మాస్టర్ దర్శనం - 14

ఒంగోలులో జరుగుతున్న సత్సంగాల ప్రభావంగా, మాస్టర్‌గారు మా ఆహ్వానాన్ని మన్నించి, విద్యానగర్ నుండి వచ్చి ఒంగోలులో స్థిరపడ్డారు. అక్కడ తలపెట్టిన శ్రీసాయి మందిర కుంబాభిషేకం పూర్తిగావడంతో, శ్రీసాయి అదృశ్య హస్తం మాస్టర్‌గారి నిక్కడకు చేర్చి ఒంగోలు వాసుల ఆధ్యాత్మిక పురోభివృద్ధికి తోడ్పడింది. ఇక్కడ శ్రీసాయి మందిర నిర్మాణానికి స్థలసేకరణ జరిగి, ద్వారకామాయి సత్సంగ మందిర నిర్మాణం శరవేగంతో పూర్తి అయింది. దీని కుంభాభిషేకానికి ప్రధాన మందిర శంఖుస్థాపనకు ముహూర్తం నిర్ణయమై దేశంలోని సాయి భక్తులందరికి ఆహ్వానాలు పంపబడ్డాయి. అందులో భాగంగా సాయి సాక్షాత్కారం పొందినట్లు ప్రచారంలో వున్న ఒక సాధువుకు కూడా ఆహ్వానం వెళ్ళింది. నాటి ఉదయం ధ్యానంలో వారికి శ్రీసాయి సాక్షాత్కరించి "అక్కడ ఒంగోలులో నా బిడ్డలు కుంభాభిషేకం, అన్నదానం చేసుకుంటుంటే కదలవేమి" అన్నారుట. చాలా దూరం ప్రయాణించి మధ్యాహ్నం అన్నదానం జరుగుతున్న సమయంలో ఆయన ఇక్కడకు చేరుకున్నారు. నాటి సాయంకాలం మాస్టర్‌గారి అధ్యక్షతన గొప్ప బహిరంగసభ జరిగింది. ప్రముఖ సాయిభక్తులంతా పాల్గొన్నారు. రాత్రి భోజనానంతరం సాధువుకు, మాస్టర్‌గారికి సాయి ధర్మ పరమైన సంభాషణ జరిగింది. ఆ సంభాషణా సారాంశాన్ని మీ ముందుచుతాను. విద్యానగర్ వదిలి ఒంగోలు రాకుండా వుండవలసినది, అంతేగాక శ్రీసాయి అనుగ్రహంతో ఎంతటి కష్టాన్ని అయినా అవలీలగా తొలగించుకోవచ్చుగదా, అంటూ అక్కడేవుండి సాయిభక్తుడిని ఎవ్వరూ ఏమి చేయలేరని లోకానికి నిరూపించి వుండవలసిందని కూడా అన్నాడు. ఆ సాధువు ధోరణి అక్కడ వున్న వారెవరికి నచ్చలేదు. దానికితోడు అతడు మాట్లాడినంతసేపు మాస్టర్‌గారు తిరిగి జవాబు చెప్పేందుకు యత్నించక మౌనంగా వుండిపోయారు. తన జీవితంలో ఇలాంటి వెలా సాయికృపతో పరిష్కరించుకున్నది గొప్పగా చెప్పసాగాడు. అందరిలో మాస్టర్‌గారికి అవమానం జరుగుతున్నదని బాధపడి

సమాధానం చెప్పడానికి మేము పూనుకోబోతే, మాస్టర్‌గారు వద్దని చేతి సంజ్ఞతో వారించారు. ఇలా కొంతసేపు జరిగాక ఆ సాధువు మాట్లాడడం ఆగిపోయింది. అప్పుడు మాస్టర్‌గారు సమాధానం చెప్పడం మొదలు పెట్టారు. "లౌకికమైన మన సమస్యలను లౌకికంగానే మనశక్తి యుక్తులతో పరిష్కరించుకోవాలని నా అభిప్రాయం. రాగ, ద్వేషాల వలన ఎన్నో జన్మల పాపాలు జేసి దుఃఖాన్ని పెంచుకొని బాధలు పడుతున్నాము. ఎన్నో తప్పులు చేసాక, భగవంతుడిని ప్రార్థించినంత మాత్రాన ఆ పాప ఫలితం నుండి రక్షిస్తే జీవులందరూ ఆశతో పాపాలు చేస్తూ శిక్ష అనుభవించవలసినపుడు మాత్రం దైవాన్ని ప్రార్థిస్తారా? ఇక ధర్మం ఆచరించి దైవాన్ని చేరుకుంటారా? కష్టపడి ధర్మం ఆచరించేవారికి, ఆచరించనివారికి ఒకే ఫలితం ఉండడం న్యాయమా? నా ఉద్దేశ్యంలో ఋణాను బంధ విశేషాన ప్రాప్తించిన ప్రారబ్ధాన్ని అనుభవించి రద్దుచేసుకోవాలేగాని, సాయికృపతో తప్పించుకునే యత్నం చేయకూడదు. ప్రస్తుత దుఃఖకరమైన ఫలితాన్నిచ్చే కర్మలు పూర్వంచేసి మనిషి ఆ ఫలితం రాగూడదనుకోవడం సమంజసమా? అదే సమంజసమైతే మనకన్యాయం జేసిన వ్యక్తి ఆ కర్మ ఫలితాన్ని ప్రార్థన వలన తప్పుకోగలిగితే మనం దైవాన్ని క్షమించగలమా? అతడు పక్షపాతి, అధార్మి అని తలచమా? ఇలా ప్రతివాడు తప్పుగా నడచి ప్రార్థన ద్వారా తత్ఫలితాన్ని తప్పుకోవడం సాధ్యమయితే ఇక ధార్మిక జీవితం ఎందుకు? జీవుల ధర్మాధర్మాలతో పనిలేక ప్రార్థించినంత మాత్రాన రక్షించేటట్లయితే ఆయన స్వార్థపరుడు, కీర్తికాముడు, అవినీతిపరుడూ కాక దైవమెలా అవుతాడు. వాస్తవానికి ఎన్ని కోరికలు తీరినా, కష్టాలు తొలగినా ఇంకా ఇంకా తలెత్తుతూనే వుంటాయి. ఎన్నింటికిని ఎంతని ప్రార్థిస్తాము. ఉదాహరణకు సంతానం కావాలని కోరామనుకోండి ఆ పుట్టబోయే వాడికి కండ్లు, కాళ్ళు సక్రమంగా ఉండాలని అడిగామా అలా అన్నా మాటలు రావాలని, చదవాలని, యోగ్యుడు కావాలని వగైరా వగైరా అడగాలి. అసలు సాయి ఆశించేది మనం సాధ్యమైనంత త్వరగా ఏమీ కోరనక్కర్లేని స్థితిని చేరాలని. అదే దుఃఖ నివృత్తి లేక ముక్తి. అయన్ని నేను అడగడమంటూ జరిగితే ఆ దుఃఖరహిత స్థితిని ప్రసాదించమని





అడుగుతాను. అంతేకాదు ఆయన సర్వజ్ఞుడు కనుక ఏదీ అడగవలసిన పనిలేదు. సర్వజ్ఞుడంటే అన్నీ తెలిసిన వాడనికదా. అయినప్పుడు తిరిగి మన కోర్కెలను తెలియచెప్పి నెరవేర్చుకోవలసిన అవసరముందనుకుంటే మన కష్టాలను, కోర్కెలను గ్రహించి తొలగించలేని అసమర్థుడవుతాడు. కాని ఆయన అష్టోత్తరంలో వున్నట్లు సర్వజ్ఞుడెట్లా అవుతాడు. అంతేకాదు కష్టాలకు జంకవలసిన పనిలేదు. శరీరానికి చమట పట్టడమెంత అవశ్యకమో, కష్టాలు కూడా అలాంటివే. అనుభవం ద్వారా ప్రారబ్ధాన్ని రద్దు చేసుకొని, జన్మపరంపరలన్ని తగ్గించుకొని, చివరకు జనరాహిత్య స్థితికి చేరుకునేందుకు దోహదపడతాయి. మీరు త్వరలో షిరిడి పోతామంటున్నారు గదా నాకు ముక్తిని ప్రసాదించమని సాయితో చెప్పండి. అంటూ ముగించారు. మా మనసులకు అమృతసేవనం చేసినట్లుంది. మాస్టర్‌గారి మహోన్నత వ్యక్తిత్వం ముందు ఆ సాధువు మరుగుజ్జులా కన్పించాడు. మాస్టర్‌గారిచ్చిన ధర్మబద్ధమైన వివరణలో ఆ సాధువు తలవంచు కున్నాడు. కాని రజోగుణంతో వుండడం వల్ల మాస్టర్‌గారి మాటల్లోని నిజాన్ని మెచ్చుకొని తన శిష్యుల మధ్య పరువు పోగొట్టు కోలేదు. ఆయన మా అతిథి కాబట్టి మాస్టర్‌గారి ఆజ్ఞానుసారం మేము కూడా వారికి సముచిత మర్యాదలు చేసి పంపించాము. కాని భగవంతుని అదృశ్యహస్తం అతనిని వెంటాడుతూనే వుంది. ఇక్కడి నుండి కోనసీమకు వెళ్ళి రాత్రిపూట పెట్రోలుబంకు దగ్గర పెట్రోలు కొట్టించుకుంటున్నాడు. ఆ ప్రాంతంలో విస్తృతంగా తిరుగుతున్న పిల్లల దొంగలుగా వారిని భ్రమించి దేహశుద్ధి చేశారు. ఆ తర్వాత కొద్దికాలానికి మతకలహాల చిక్కులలో తగుల్కొని దేహత్యాగం చేసినట్లు వార్తలొచ్చాయి. ఇంత జరిగినా మాస్టర్‌గారు ఆ సాధువును గురించి చెడుగా ఒక మాటననక పోవడం మమ్ము ఆశ్చర్య చకితుల్ని చేసింది.

దైవానుగ్రహ హేతుకములైన మముక్షత్త్వము, మహాపురుషుల సమాశ్రయము, లభించడమెంతో కష్టమంటారు ఆదిశంకరాచార్యులు వివేక చూడామణిలో. మాస్టర్‌గారీ ప్రయోజనాలెప్పుడో సాధించుకున్నారు. దేశంలోని వివిధ సాంప్రదాయాల మూల సిద్ధాంతాలను, సిద్ధపురుషులను నిశితంగా

పరిశీలించి, సమన్వయాత్మకమైన సాయి సాంప్రదాయాన్ని వెలికితీసి, ప్రచారం చేశారు. సకల రాజ్యభోగాలు తృణప్రాయంగా త్యజించిన బుద్ధుని వివేక వైరాగ్యాలు, విశ్వాన్ని తన రూపంగా దర్శించిన రమణుల జ్ఞానదృష్టి, నూర్గురు కొడుకులను చంపినా చలించని వశిష్ఠుని ఆత్మస్థైర్యము పరమార్థాన్ని పది మందికి పంచాలన్న వ్యాసుని తపన మాస్టర్‌గారిలో మూర్తీభవించాయి. కలి ప్రభావాన పాపాలుచేసి, కష్టాల ఊబిలో కూరుకుపోయి, తద్విముక్తికై మాస్టర్ నాశ్రయించిన ఆర్తులచేత ఆహార నియమంతో సాయి చరిత్ర పారాయణ చేయించి, ఆ గురుచంద్రుని కృపకు గురిచేసేవారు. అంతటితో కష్టాలు తొలగి, శాంతి లభించేది. అందుకు కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్న భక్తులతో ఆ అధికృతను తనకాపాదించుకోక అందరికీ అన్నింటిని ప్రసాదించేది తన గురువైన సాయినాథుడేనని తాను గురువునని తలచేవాడు అపదానికే తగడని స్పష్టం చేసేవారు. స్వానుభవపూర్వకంగా తెలుసుకున్న సత్యాలతో, సాయి లీలామృతాన్ని నింపారు కాబట్టే ఆ గ్రంథ పారాయణతో సత్యరూపుడైన శ్రీసాయి శీఘ్రంగా పల్కేవారు. మాస్టర్‌గారొకసారి షిరిడీలో వుండి "నా భక్తునింట అన్న వస్త్రాలకు లోటుండదు. నా బిడ్డలను పస్తుండనిస్తానా" యని సాయి చెప్పిందెంత సత్యమో పరిశీలించాలనుకున్నారు. ఆరోజుల్లో సమాధి మందిరం మధ్యాహ్న హారతి తర్వాత దాదాపు నిర్మానుష్యంగా వుండేది. భక్తులంతా భోజనాలకు వెళ్ళినా, తాను వెళ్ళక సమాధికెదురుగా కూర్చొని, ఆనాడు సాయి తననెలా పస్తుండనివ్వరో చూడాలని నిశ్చయించుకున్నారు. ఒంటిగంట కావస్తున్నా సాయి నుండి ప్రతి స్పందన రాలేదు. మరో రెండు మూడు నిముషాలు చూచాక సాయి లీలామృతం నుండి పై సూక్తిని తొలగించాలని నిశ్చయించుకున్నారు. ఇంతలో ఒక సాధువు అక్కడకు వచ్చి సాయికి నమస్కరించి మాస్టర్‌గారి వైపుతిరిగి చావడి ప్రక్కన వున్న హనుమదాలయానికి తనతో ఆహ్వానించాడు. సాధుసత్పురుషులపై అపారభక్తి గౌరవాలున్న మాస్టర్‌గారు, ఆ సాధువువెంట బయలుదేరి వెళ్లారు. వీరిద్దరూ హనుమదాలయంలో కాలు పెట్టగనే, అంతకుముందేవున్న ఇద్దరు సాధువులు నేలపై గుడ్డపరచి, ఆకులువేసి, తమ వద్దనున్న మూడు జోలెలలోని

వంటకాలను కుప్పపోశారు. తర్వాత ఆ భిక్షాన్నాన్ని నాలుగు భాగాలుచేసి, ఒకవైపు మాస్టర్‌గారిని కూర్చోమని ఆహ్వానిస్తూ, మిగిలిన మూడువైపులా తాము కూర్చొని, సంభ్రమాశ్చర్యాలతో తమవైపు ప్రశ్నార్థకంగా చూస్తున్న మాస్టర్‌గారితో ఇలా చెప్పారు.

కొంతకాలంగా తాము, షిరిడీలో భిక్షాన్నంతో జీవిస్తూ సాయి స్మరణలో గడుపుతున్నామని, ఆ నాడు సాయికి ప్రీతికరమైన గురువారం కాబట్టి, తమ భిక్షాన్నాన్ని సాయిబాబాతో పంచుకోదలచామని, అందుకుగాను సరిగ్గా నాటి మధ్యాహ్నం ఒంటిగంటకు సమాధి మందిరంలో సాయి సన్నిధిన యున్న భక్తుని శ్రీసాయి ప్రతినిధిగా గుర్తించాలను కున్నామని అలా ప్రాప్తించిన మాస్టర్‌గారు భుజిస్తే, తమకెంతో సంతోషమని చెప్తూ, నల్గురూ భోజనాల కుపక్రమించారు. జరుగుతున్నదంతా కలో, నిజమో తేల్చుకోలేనంత ఆశ్చర్యం కలిగింది. మాస్టర్‌గారికి అడిగినదే తడవుగా, ఇంత అద్భుతమైన అనుభవాన్ని ప్రసాదించిన నిత్యసత్యుడైన సాయికి మనసులోనే జోహారు లర్పించారు. ఇంట్లోనైనా, హోటల్లోనైనా భోజనంలోకిఒకటి రెండు అనుపాకాలు మాత్రమే వుంటాయి. ఆనాడల్లా కాదు. ఆ సాధువులు, పలు గృహాలనుండి తెచ్చిన భిక్షాన్నంలో అనేకరకాల వంటకాలు ఉన్నాయి. అంటే శ్రీసాయి, తన కారోజు, షడ్రసోపేతమైన భోజన మేర్పాటుచేసి, కోరిన విధముగా సజీవమైన అనుభవాన్ని ప్రసాదించిన నిత్యసత్యుడైన సాయికి మనసులోనే కృతజ్ఞతలు తెలియజేసు కున్నారు.

మాస్టర్‌గారు వయస్సును బట్టిగాక, వారి ధర్మప్రవృత్తి త్యాగనిరతి చిత్తశుద్ధి పరోపకారబుద్ధి, సాధనాసామర్థ్యము, సాధువర్తనములను బట్టి విలువ నిచ్చేవారు. కనుక వారికి సన్నిహితంగా మసిలేవారిపై ఎక్కువ ప్రేమ, దూరంగా వుండేవారిపై తక్కువ ప్రేమ వుంటుందనుకోవడం కేవలం భ్రమే. యదార్థానికి నిర్మల, నిశ్చల గురుభక్తి మనమెక్కడ వారిని స్మరించినా వారి సాన్నిహిత్య ప్రభావం మనకనుభవమవుతుంది. ఇది కాలపరిమితం కాని నగ్న సత్యం. అనుభవైక

వేద్యం. బాహ్య ఆచార, ఆడంబరాలకన్నా వారు అంతఃశౌచానికి [illegible] ప్రధాన్యమిచ్చేవారు. మా బజారులోనే వుంటూ, సనాతన సాంప్రదాయ బద్ధులై కన్పించే వృద్ధరామభక్తుడు మొదటి సారిగా మాస్టర్ దర్శనానికి వచ్చాడు. తనకన్నా వయస్సులో చిన్నవాడులా కన్పించడం వల్లనో, చేతిలో [illegible] ఉండడం వల్లనో ఆయనకు మాస్టర్‌గారిపై గురుభావం తొలగి వారికన్నా అతనే గొప్పఅన్న భావం చోటు చేసుకుంది. మాస్టర్ చెప్పినవి విని ఆచరించి తరించవలసినవాడు వారికే పాఠాలు నేర్పుతూ యక్ష ప్రశ్నలను వేసి విసిగించాడు. తుదకు "విష్ణు స్వరూపులైన రాముడు, కృష్ణుడు వంటి అవతార పురుషులుండగా తురకవాడైన సాయిబాబాను పూజించమంటున్నారేమి?" అన్నాడు. సభ్యత, సంస్కారాలు మరచి ప్రవర్తిస్తున్న అతనిలో పెద్దలను సేవించు లోపమేగాక, తానేదో తెలిసిన వాడినన్న స్వాతిశయం కూడా తొంగి చూస్తున్నది. కొందరికి వయస్సు పెరిగేకొద్దీ వృద్ధాప్యం వస్తుందికాని జ్ఞానంరాదు. శ్రీవిద్యోపాసకులు, దత్తాత్రేయ సాక్షాత్కారాన్ని పొందిన బ్రహ్మవేత్తలు శ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారు శ్రీ మాస్టర్‌నిచూచి "శ్రీగురుచరిత్ర వ్రాసి, పూర్ణదత్తాను గ్రహపాత్రులైన మిమ్ములను ఆశీర్వదించగలవారెవరు" అని అటుంటే, ఈయనింత జుగుప్సాకంగా మాట్లాడతాడేమా యనుకున్నాను. అంతేకాదు మహాత్ముల సన్నిధిన అహంకరించడమెంత ప్రమాదమో తెలిసినట్లు లేదు. అతని ధోరణి ఆగాక, మాస్టర్‌గారందుకొని, సద్గురుసాయి సంప్రదాయ మెంత వైదికమో, సనాతనమో, శాస్త్రప్రమాణాలతో సోదాహరణ పూర్వకంగా వివరించి, ఈ గురుశిష్య పరంపరే వేదాలను, రామాయణాది పవిత్ర గ్రంథాలను మనకీనాడు లభ్యం చేసిందన్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు తానీలోకంలో ఆచరించవలసిందీ, పొందవలసిందీ ఏదీలేదని, కాని శ్రేష్ఠులైన వారేది ఆచరిస్తే, ఇతర జనులు దానిననుకరిస్తారంటూ సాందీపుని గురువుగా సేవించారు. శ్రీరాముడు, విశ్వామిత్రాదులను సేవించి లోకానికి ఆదర్శం చూపారు. రామలక్ష్మణులు గురుప్రియులని వాల్మీకి రామాయణంలో వుంది. అటువంటి గురుసాంప్రదాయాన్ని మీరు కాదంటున్నారేమి? రాముడికి ప్రీతి పాత్రమైన

గురుసేవ, రామభక్తులైన మీకు నింద్యంగా తోచడమే విడ్డూరం. "తస్మాత్ శాస్త్రం ప్రమాణంతే, కార్యాకార్య వ్యవస్థితౌ" అంటూ ఒక పనిచేయ తగినది, మరొకటి చేయరానిది అను నిర్ధారణ యందు శాస్త్రమే ప్రమాణమని అర్జునుడికి కృష్ణుడు చెప్పారు. అంతేకాదు, రాముడు ధర్మస్వరూపుడు. త్రికరణ శుద్ధిగా ఏకపత్నీవ్రతాన్నవలంభించాడు. రాముడు చెప్పింది, చేసింది మెచ్చునివారు రామభక్తులెలా అవుతారు. రావణభక్తులవుతారు గాని అన్నారు. మాస్టర్‌గారి మాటలు ఆ భక్తుని గతజీవితానికి అద్దంపట్టాయి. ఉద్యోగంలో అతడందరినీ పీడించి, లంచాలు గుంజాడు. అయితే ఈ రహస్యాలన్నీ మాస్టర్‌గారికి తెలియడమే విచిత్రం. మాస్టర్‌గారి సర్వజ్ఞత్వాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్న ఆ వృద్ధునికి భయంతో చెమటలు పట్టాయి. మాస్టర్‌గారిలాంటి మహాత్ములతో అహంకరించి మాట్లాడితే ఎంతటి ప్రమాదకరమో తెలుసు కున్నాడు. మాస్టర్‌గారి సన్నిధిన మరికొంత సేపు మౌనంగా గడిపి లేచిపోతూ "తానింతకాలం రామసేవలో ఉన్నా ఎట్టి అనుభూతి లభించలేదని వాపోయాడు. అందరు మాస్టర్‌గారు", గురువును శ్రద్ధాభక్తులతో సేవించని లోపమే అందుకు కారణమంటూ సాయి లీలామృతాన్నిచ్చి పారాయణ చేయమన్నారు. గురుసేవలో సత్వగుణ ప్రధానుడు కాని వారి యజ్ఞదాన తపఃకర్మలు ఫలించవని సాయిచరిత్ర పారాయణ, రాముని ధర్మాచరణ భగవత్ ప్రాప్తికి సూటియైన మార్గమంటూ విభూతి నిచ్చి పంపివేశారు. మనం కూడా మాస్టర్ చూపిన మార్గంలో మహాత్ముల చరిత్ర పారాయణను చేపట్టి ఇహపర సుఖాలను సాధించుకుందాము.


> గర్వితులకు, కోపగ్రస్తులకు, పరుషముగా మాట్లాడువారికి దేవుని రాజ్యములోనికి ప్రవేశముండదు.

# మాస్టర్ దర్శనం - 15

"న కర్మణా న ప్రజాయా ధన్ న త్యాగేనైకే అమృతత్త్వ మానశుః" అం అగ్ని హోత్రాది యజ్ఞాది కర్మల వలన కానీ, పుత్రపౌత్రాది బంధువుల వలనగాని ధనం వల్లగాని అమృతత్వం సిద్ధించదు. కేవలం త్యాగంవల్ల మాత్రమే సిద్ధిస్తుంది ఇది వేదవాక్యం. వేదపురుషుడు శ్రీ అనంతాచార్యుని ముద్దుబిడ్డడైన మాస్టర్‌గారు ఇలా అన్నారు. నాకు ఎవరి నుండిగాని, దేనినుండిగాని కావల్సిందంటూ ఏమీ లేదు. మనస్సుతో ఏ మాత్రమయినా నాకది కావాలనిపిస్తే ఈ ప్రపంచం నన్ను బంధించి వేసినట్లే. గురువుకు పగ్గాలప్పగించాక నిశ్చింతగా కూర్చోవడమే కర్తవ్యం. అంతేకాదు వారి పిలుపందిన క్షణంలో సకలాన్ని త్యాగంచేసి వెళ్ళిపోవలసిందే. అలా వెళ్ళినప్పుడు వేదమ్మకు చెప్పే సావకాశం కూడా వుండదు. "ఈ మాటలు నిజం చేశారా అన్నట్లు వారొకసారి షిరిడికి వెళ్ళి చాలాకాలం తిరిగిరాలేదు. షిరిడి నుండి వచ్చిన భక్తులు కూడా మాస్టర్‌గారు అక్కడ కన్పించలేదని చెప్పారు. అమ్మగారితో సహా ఆందోళన చెందారు. షుమారు నెలరోజుల తర్వాత తిరిగివచ్చిన మాస్టర్‌గారు తాను అంతకాలం అజ్ఞాతంగా గడుపవలసివచ్చిందంటూ అందుకు కారణాలు ఇలా వివరించారు.

సుప్రసిద్ధ సాయిభక్తులు శ్రీ శివనేశన్ స్వామితో మాస్టర్‌గారికి 1963 నుండి పరిచయం వుంది. వీరి తోడ్పాటుతోనే శ్రీ మాస్టర్‌గారు హింది, మరాఠీ భాషలలోని పత్రికల నుండి శ్రీ సాయిలీలలను సేకరిస్తుండేవారు. వారు రాఖాడీబాబా శిష్యులైన నిత్యానంద స్వామిని బహుకాలం సేవించి, చివరకు షిరిడి వచ్చి స్థిరపడ్డారు. నడుము నుండి మోకాళ్ళ వరకు వేళ్ళాడుతుండే చిన్నగుడ్డ ధరించి అలాంటి మరొక గుడ్డను భుజంపైగాని తలగుడ్డగాని, ధరించి ప్రతిసాయంత్రం చావడిలో భజనలు చేస్తూ నిరాధారులై షిరిడీ చేరిన సాధకులను ఆదుకుంటూ షిరిడి ప్రజల హృదయాలను దోచుకున్న శ్రీ శివనేశన్ స్వామిని అందరూ శ్రీ సాయికి ప్రతిరూపంగా తలుస్తారు. అన్ని వాతావరణ పరిస్థితుల ధాటికి తట్టుకొని నిలబడిన వారి చామన ఛాయను, నెరసి నెరయని మీసాలు,

పొడవైన గడ్డం, తీక్షణమయిన చూపు, ప్రశాంతతో నిండిన ముఖవర్చస్సు, చూసినవారిని ఇట్టే పాదాక్రాంతులను చేసుకునేవి. మాతృప్రేమను తలపించే వారి సాన్నిధ్య ప్రభావానికి ఆకర్షితులు కానివారు వుండరు. వారికి హిందీ, గుజరాతి, మరాఠీ భాషలతో పాటు దక్షిణాది భాషలు అన్నీ వచ్చు. మొదటిసారిగా షిరిడి వచ్చి హిందీ, మరాఠీ రాని భక్తులకు శ్రీస్వామి ఆపద్బాంధవుడుగా తోచేవారు. మాస్టర్‌గారు కూడా షిరిడీలో వున్నప్పుడు మొదటిసారిగా షిరిడీ వచ్చి ఏమి తెలియక బాధపడ్తున్న వారికి షిరిడి గురించి వివరించి చెప్పే సేవలందించేందుకు తన సమయంలో కొంత భాగాన్ని కేటాయించేవారు. శ్రీ శివనేశన్ స్వామి పరిచయ భాగ్యం కలిగిన, వారిలో ఒక బొంబాయి భక్తుడుకూడా వున్నారు. ఇతడు కారు మెకానిక్ పాతకార్లు తక్కువకుకొని, స్వయంగా బాగుచేసి రంగువేసి, ఎక్కువకు అమ్మి వచ్చిన లాభంతో షిరిడీలో తన గురుసన్నిధిలో సాధుసంతర్పణలు చేస్తుండేవాడు. ఇతడు చేసే నిష్కామసేవకు శ్రీ శివనేశన్ స్వామి పులకరించి ఈ సాధుసంతర్పణలకు తనవంతు సహకారాన్ని అంద చేసేవారు. ఇంతటి భక్తుని ఒకసారి పరిష్కారం లేని భయంకర కష్టాలు చుట్టిముట్టి నిరాశలలో ముంచెత్తాయి. చివరకు ఆత్మహత్యే శరణ్యం అనిపించింది. అందుకు తలపడే ముందు కొద్ది రోజులు శివనేశన్ స్వామి దగ్గర ఉండాలనుకున్నారు. ఒకరోజు ఇతడు శివనేసన్ స్వామి సన్నిధిన చావడిలో కూర్చొన్నాడు. ఆ నాటికి షిరిడీలోవున్న మాస్టర్‌గారికి, శివనేసన్‌స్వామికి మధ్య ఆత్మహత్య ఎంతటి పాపకార్యమో అన్న అంశంపై చర్చ జరిగింది. ఆత్మహత్యపై వివరణ విన్న అతడికి, తాను తలపెట్టిన కార్యంపై విముఖతతో పాటు ధర్మాన్ని అంతచక్కగా వివరించిన జ్ఞానమూర్తి మాస్టర్‌గారిపై ఎనలేని భక్తి గౌరవాలు ఏర్పడ్డాయి. ఆత్మహత్యకు తలపడ్డ వ్యక్తిని పంచభూతాలు, రాబోయే అయిదు జన్మలలో ఒక్కొక్క జన్మలో ఒక్కొక్క పంచభూతము ఎలా హింసించి చంపి కసితీర్చుకుంటాయో వివరించిన మాస్టర్‌గారి మాటలు అతడిని భయకంపితులను చేశాయి. తన సమస్యలన్నింటికి మాస్టర్‌గారే పరిష్కార మార్గాలు సూచించగలరన్న విశ్వాసం వారిపై ధృఢపడింది. అతడు చెప్పినది అంతావిన్న





మాస్టర్‌గారు అతనిలో "నీవెటూ జీవితాన్ని అంతంచేసుకోవడానికి పూనుకున్నావ కాకపోతే చేసేపని లక్ష్య పూరితం చెయ్యి. ఎన్నో కష్టనష్టాలకు నిలయమైన నర్మద ప్రదక్షణాలకు సంకల్పం చేయి. శ్రీ సాయి దయవల్ల పూర్తి చేసావా మహాయోగిలా మారిపోతావు. ఆధ్యాత్మిక శిఖరాలను అందుకుంటావు. మధ్యలో రాలిపోతావా నీకు క్రొత్తగా వచ్చే నష్టంలేదు. అందుకు నీవు ఇప్పుడు సిద్ధపడేవున్నావు అన్నారు. తన జీవితానికి వెలుగు బాటచూపిన మాస్టర్‌గారికి కృతజ్ఞతలు తెలుపుకొని అతడు నర్మద ప్రదక్షణలకై ఓంకార క్షేత్రానికి వెళ్ళాడు. కాలాంతరంలో ఈ సన్నివేశం మాస్టర్‌గారి స్మృతిపదం నుండి తొలగిపోయింది. కొన్ని సంవత్సరాల తర్వాత ఒకసారి మాస్టర్‌గారు షిరిడి వచ్చి చావడిలో కూర్చుని వున్నారు. దండ కమండలాలలో గడ్డాలు, మీసాలు, జడలు కట్టిన పొడవైన జుట్టుతో విభూతి పట్టెలు రుద్రాక్షమాలలు ధరించి అగ్నిహోత్రంలా వెల్లిపోతున్న నూతన వ్యక్తి మాస్టర్‌గారివైపు పల్కరింపుగా చూచాడు. యోగిలా వున్న ఆ నూతన వ్యక్తి ఎవరో వారికి ఎంతవరకూ గుర్తురాలేదు. ఇది గ్రహించిన ఆయన నన్ను గుర్తించలేదా భరద్వాజా ఆనాడు ఆత్మహత్యకు సిద్ధపడి ఇక్కడే కూర్చుని వున్న నన్ను నీవేగా నర్మదప్రదిక్షణలకు ప్రోత్సహించావు. దిగ్విజయంగా ప్రదక్షిణలు చేసి, నర్మదాతల్లి అనుగ్రహానికి పాత్రుడనై హిమాలయాలకు వెళ్ళి యోగసాధన చేసి అనేక శక్తులు సంపాదించాను. ఈనాడు ఇంతటి వాడు కావడానికి ఆనాటి నీ ప్రోత్సాహమే కారణం నీమేలు నేను ఎన్నటికి మరువలేను. నా ఈ శక్తులు అన్నింటిని నీకు దత్తంచేసి, ఋణం తీర్చుకుంటాను. నేను హిమాలయాలకు వెళ్ళి వాటి అన్నింటిని తిరిగి సంపాదించుకోగలను అంటూ మాస్టర్‌గారి చేయిపట్టుకొని తన రహస్య స్థావరానికి తీసుకువెళ్ళారు. ఆనాటి నుండి మాస్టర్‌గారు ఆ యోగితో నెలరోజులు అజ్ఞాతవాసం చేశారు. వారిద్దరిమధ్య జరిగిన యోగప్రక్రియ వివరాలు, పూర్తిగా తెలియనప్పటికి కాలాంతరంలో మాస్టర్‌గారి ముఖత విన్న కొన్ని విషయాలు మీ ముందు వుంచుతాము. ప్రదక్షణ చేస్తున్న సమయంలో అతడికి అనేక దివ్య దర్శనాలు కల్గాయట. మార్గాయాసం తెలియకుండ ఇతనిని దారిప్రక్కన వున్న

ఆశ్రమాలవారు తిండి, నీడ, నీరు బట్టలను ఇచ్చి ఆదుకున్నారు. ఒకసారి అతనికి తట్టుకోలేని మంచు, చలి బాధించాయి. ఇంతలో ప్రక్కనే వున్న ఆశ్రమంవారు ఖరీదైన రగ్గులు పంచడం కన్పించింది. తనకు ఒక రగ్గు తెచ్చుకున్నాడు. అతని వెనకాల వస్తున్న సాధువులు ఈ రగ్గును చూచి ఎక్కడిదని ప్రశ్నించారు. తాను నడచి వచ్చిన మార్గమున ఆశ్రమంలోని వారు అతనికి ఇచ్చారని చెప్పగా వారెంతో ఆశ్చర్యపడ్డారు. కారణం తాము ఆ దారినే నడిచివచ్చినా ఒక్క ఆశ్రమం కూడా వారికి తగలలేదట. అప్పుడు అర్థమయింది అతనికి శ్రీ సాయికృపవల్ల స్థూలదృష్టికి కన్పించని సిద్ధపురుషులు ఆశ్రమాల వారిగా తనను ప్రత్యక్షముగా ఆదుకున్నారని అనుకున్నారు. నర్మద ప్రదక్షిణ చేసేసరికి అతనికి కొన్ని దివ్యశక్తులు మేల్కొన్నాయి. దారిలో కలిసిన ఒక మహాత్ముడు అతనిని హిమాలయాలకు తీసుకువెళ్ళి యోగ విద్యలు నేర్పి, అతడిని ఒక పూర్ణ యోగిగా మార్చాడు. ఆ యోగి మాస్టర్‌గారికి ఒక రక్షణ వలయాన్ని ఏర్పాటుచేశాడు. అందుకే షిరిడీలో అజ్ఞాతంగా గడిపి వచ్చిన మాస్టర్‌గారి చేతికి ఒక రాగికడియం వుంది. రెండు నెలల తర్వాత దానిని తీసిపారవేశారు. ఈ విధంగా శ్రీసాయి యోగులరూపంలో ఆధ్యాత్మిక శక్తులను ప్రసాదించారు.

# మాస్టర్ దర్శనం - 16

## నయమాత్మా బలహీనేన లభ్యః

"నేనివ్వదలచింది నాభక్తుడడిగే వరకు, నా భక్తుడడిగింది ఇస్తుంటానని" సాయి వాగ్దానం చేసారు. అయితే ఆయన మనకివ్వదలచింది ఏది? అది తప్పకుండ విశిష్ఠమైనదై యుండాలి. దాన్ని మనమెందుకాయనను అడుగలేక పోతున్నాము? కొంచెం పరిశీలిద్దాము.

ఆయన మనకు ప్రసాదించదలచింది ఆయన స్థితినే. పూర్ణ తృప్తి శాంతులతో నిండిన దుఃఖ స్పర్శయేలేని ఆనంద స్థితియే వారి నిజస్థితి. అయితే ఈ జగత్తు అందులోని జీవులే సత్యమని నమ్మేమనకు విషయ సుఖానుభవం ద్వారా తృప్తి, శాంతి లభిస్తాయన్న అపోహ బలంగా నాటుకొని ఉంటుంది. అదే నిజమైతే ధనము, కీర్తి, హోదాలు అపారంగా వున్నవారికి దుఃఖము, అశాంతి, అసంతృప్తి వుండకూడదు కదా! కాని వాస్తవమెందుకు విరుద్ధంగా వుంది. అందుకనే సుఖదుఃఖాల యదార్థ స్వరూపం తెలిస్తేనేగాని, ఈ చిక్కుముడి వీడదు. ఈ లోపల సాయి మనకోరికలెన్ని తీర్చినా, తీర్చవలసినవింకా వుండి, అవి తీరలేదరన్న దుఃఖం మిగిలే వుంటుంది.

ఈనాటి మన సుఖదుఃఖాలు ఒకనాటి మన పుణ్య పాపకర్మల ఫలాలేనని "చెన్నబసప్ప, వీరభద్రప్ప"ల లీల ద్వారా సాయి స్పష్టం చేసారు. అంతేకాదు ఋణము, శత్రుత్వము, హత్య వీటికి పరిహారం చెల్లించే తీరాలని చెప్పారు. త్రికరణాలతో మనం చేసే పుణ్య పాప కర్మల ఫలాలు, జీవితానుభవాల ద్వారా సుఖదుఃఖాల రూపంలో మనకనుభవమవుతాయి. జనన మరణాలలాగా, అనివార్యంగా ప్రాప్తించే వీటిని గురించి దుఃఖించడంగాని, సంతోషించడంగాని వ్యర్థమని యోచిస్తే తెలుస్తుంది. మనం చూస్తున్న సినిమా అంతా ముందుగా ఫిలిమ్‌లో నిక్షిప్తమై యున్నట్లుగానే, జీవితానుభవాలన్నీ విశ్వ చైతన్యంలో నిక్షిప్తమై యుండి, కాలగతిలో మనకెదురవు తుంటాయి. ఇవి


త్రికాలజ్ఞులైన సాయికి ముందుగానే తెలుస్తాయి. అజ్ఞులైన మనకు తెలియవు. ఈ విషయాన్నే ద్వారకామాయి గోడపై నున్న "బల్లికూసిన లీల" ద్వారా సాయి స్పష్టం చేసారు. ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు కూడా మన మొకప్పుడు బ్యాంకులో దాచుకున్న డబ్బు తిరిగి మనకు లభించినప్పుడు పొంగిపోవలసిన కారణమేమున్నది. మన మొకప్పుడు బ్యాంకులో అప్పుతీసుకొని, ఖర్చు పెట్టుకున్నాక అప్పు తీర్చవలసి వచ్చినప్పుడు కృంగవలసిన అగత్య మేమున్నది. జీవితంలో అనివార్యమైన కష్టసుఖాలు ఇట్టివేనని దృఢంగా గుర్తుంచుకొని, సమభావంతో సాధన కొనసాగించడమొక్కటే శాశ్వతమైన దుఃఖ నివృత్తికి మార్గమంటూ ఈ భావాన్నే దృఢపరచారు.

కోరికలే దుఃఖమని, వాటి నదుపుచేయడమే దుఃఖనివృత్తికి మార్గమని బుద్ధుడు చెప్పారు. జన్మాంతర సంస్కారాలే, మనసు ద్వారా కోరికల రూపంలో బహిర్గత మవుతాయి. కాబట్టి కోరికల నదుపుచేయటానికి మనస్సు నదుపు చేయడమే మార్గం. కాని మనస్సును నిగ్రహించటం, గాలిని నిగ్రహించటం కన్నా కష్టమని గీతలో కృష్ణుడు చెప్పాడు.

మనసును "కల్లు త్రాగి, నిప్పుతొక్కిన కోతితో" పోల్చారు. మనకే లొంగి యుండవలసిన మనస్సుకు మనం లొంగిపోయామా. ఆత్మవినాశనాన్ని కొనితెచ్చు కుంటాము. "ఒక బ్రాహ్మణుడు భుక్తాయాసంతో అడవి మార్గం గుండా పోతున్నాడు. కొంత సేపటికి అలిసి, ప్రక్కన వున్న చెట్టునీడన కూలబడ్డాడు. మంచముంటే కొంచెంసేపు విశ్రాంతి తీసుకోవచ్చు గదా అనుకోగానే ఎదురుగా మంచము, పరుపు ప్రత్యక్షమయ్యాయి. అతడాశ్చర్య పడ్డాడు. తానున్నది కల్పవృక్షం నీడనయని అతనికి తెలియదు కదా! హాయిగా మంచం మీద పడుకొని, నొప్పులు తగ్గేలాగా ఎవరైనా కాళ్ళు పడితే బాగుండునని తలచాడు. వెటనే అప్సరసల్లాంటి స్త్రీలు ప్రత్యక్షమై పాదసేవనం చేయసాగారు. అతడికెంతో ఆనందమయింది. నిద్రముంచుకు రాసాగింది. ఇంతలో తాను నిద్రలోకి జారుకోగానే ఏపులో వచ్చి మింగితేనో అన్నసందేహం మనసులో మెదిలింది.

వెంటనే పులి ప్రత్యక్షమై అతడిని మింగేసింది’ ఇదీ కథ. ఇలా వుంటాయి. మనసు చేసే తిక్క సంకల్పాలు. అందుకే మనసును నమ్ముకుంటే మనగతి అధోగతి. మరి మనసును నిగ్రహించే మార్గమే లేదా!

ఉంది. శ్రీసాయి లీలామృత పారాయణతో త్రికరణ శుద్ధిగా సాయిని సేవించటమొక్కటే అందుకు సూటియైన మార్గం. అప్పుడే జగత్తు సాక్షాత్తు సాయిరూపంగా దర్శనమిస్తుంది. మనసు ఏకాగ్రమై శక్తిని పొందుతుంది. సాయికి మన జన్మాంతర సంస్కారాలతో పాటు శక్తి సామర్థ్యాలు కూడా ఎరుకయే. అందుకే మనమున్న స్థాయినుండే సాధనా సోపానాలను నిర్మించి తరింపచేస్తారు. అయితే కొన్ని కష్టాలు అల్పజ్ఞులు, అల్పాయుష్కులమైన మనలను సాధనా మార్గంలో నిలువనియ్యవు. మన అర్హతతో నిమిత్తం లేకుండా, తన పుణ్యం అడ్డంవేసి, ఆ కష్టాలను సాయి తొలగిస్తారు. “ఒడిలో బిడ్డను పెట్టుకొని కొలిమివేస్తున్న కంసాలి వాని భార్య” లీల ఇందుకు సాక్ష్యం. బిడ్డ నిప్పుల్లో బడకుండా కాపాడేందుకు సాయి తన చేతినే నిప్పుల్లో పెట్టారు. ఇలా కష్టాలు తొలగడంతో మనకు వారిపై అనన్యమైన భక్తి, విశ్వాసాలు స్థిరపడతాయి. సర్వజ్ఞుడు సకల జీవ స్వరూపుడు, సర్వవ్యాపి. తల్లి, తండ్రి, గురువు, సర్వమూ సాయియే నంటూ సహస్రనామాలతో వారిని పూజిస్తాము. సర్వజ్ఞుడైన సాయి మనమడిగినవేగాక మనకు శ్రేయస్కరమైన వాటినే ప్రసాదిస్తారన్న వివేకం క్రమేపి మనలో మేల్కొంటుంది. జ్వరంతోనున్న బిడ్డ, అన్నమడిగినప్పుడు పెట్టని తల్లికి, ఆ బిడ్డపై ప్రేమ లేదనగలమా? అంతటితో జీవితానుభవాలన్నిటిని సాయి ప్రసాదాలుగా గుర్తించగలుగుతాము. ఇక దుఃఖ మెక్కడిది? ఇదే సాయి మనకు ప్రసాదించదలచిన యోగులు స్థితి. అయితే ఈ స్థితినందుకోవడం అంత సులభమా యని చదువరుల మనస్సు శంకించవచ్చు. శ్రద్ధ, పట్టుదల, గురుభక్తిగల సాత్త్వికులకిది ఎంత సులభమో, రజోగుణ తమోగుణ ప్రధానులైన అసురీసంపద కలవారికి అంత కష్టం. అందుకే శాస్త్రమంటుంది. “నయనాత్మా బలహీనేన లభ్యః” (బలహీనులకు ఆత్మజ్ఞానం లభ్యమవదు) యని.





# మాస్టర్ దర్శనం - 17

## "శ్రీమాస్టర్ సేవించిన మలిసమాధి" (దర్గా)

సృష్టిలోని జీవుల తరింపుకు, పరమాత్మ ప్రసాదించిన మహితవరం, ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారు. సమస్యల వలయంలో చిక్కుబడి తన నాశ్రయించిన భక్తులచే శ్రీసాయిచరిత్ర, గురుచరిత్రలు పారాయణచేయించి ఆ గురుచంద్రునికృపకు, గురిచేసేవారు, శ్రీసాయి 'అల్లామాలిక్', "అల్లా అచ్ఛాకరేగా" అన్నట్లు శ్రీ మాస్టర్ "సాయిమాలిక్" "సాయి అచ్ఛాకరేగా" అనే వారనిపిస్తుంది. సృష్టిలోని గురుతత్త్వమే దత్తాత్రేయ తత్త్వమని, ఆయనయే సద్గురువుల రూపంలో, భూమిపై సంచరిస్తూ ముముక్షువులకు మార్గం చూపుతుంటారని, శ్రీసాయి లీలామృతము, శ్రీగురుచరిత్రల పారాయణతో ప్రాప్తించిన సద్గురువులంతా, ఆ కోవకు చెందినవారేనని మాస్టరుగారు స్పష్టం చేశారు. అట్టి మహాత్ములెందరినో సేవించి, వారి కృపకు పాత్రులై, వారి ఆధ్యాత్మిక శక్తికి వారసులై, పూర్ణపురుషుడైన పుణ్యాత్ముడు శ్రీ మాస్టర్ కలి ప్రభావాన, కఠిన సాధనలు చేయలేని జీవుల తరింపుకు "శ్రీ హజరత్‌ఖాజా మొయినుద్దీన్ చిస్తీ" గారి సమాధిని సేవించమనేవారు. తిరిగి వచ్చాక సోదరి సుబ్బలక్ష్మితో "నా కీసంవత్సరం శుభప్రదంగా వుందమ్మా. జయపూర్ వెళ్ళి సాయి విగ్రహం ఖరారు చేశాను. అజ్మీర్ వెళ్ళి శ్రీ చిస్తిగారి సమాధి దర్శించాను". అని సంతోషంగా చెప్పారు. ప్రవక్త మహమ్మదుల ఆజ్ఞపై, అజ్మీర్‌వచ్చి, అక్కడే సమాధైన శ్రీ చిస్తిగారి జీవిత విశేషాలను, బోధను సంక్షిప్తంగా పరిశీలిద్దాము.

హిందువులకు కాశీ, బౌద్ధులకు గయ, క్రైస్తవులకు బెతల్‌హోమ్ ఎంతటి పవిత్రమైనవో, అంతటి పవిత్రమైనదే అజ్మీర్ ముస్లిమ్‌లకు. ప్రవక్త మహమ్మదుకు ప్రతిరూపమైన శ్రీ చిస్తీగారి సమాధి ఇక్కడవున్న కారణంగా, అజ్మీర్ అందరికి రెండవ మదీనా. భగవంతుని మహిమను పామరులు గుర్తించలేరు. అందుకే భగవంతుడు సద్గురువుల రూపంలో అవతరించి, పరమార్థాన్ని తెలియజెప్పి,

గమ్యానికి చేరుస్తాడని "గురుచరిత్ర" చెప్తుంది. ఇట్టి సద్గురుమూర్తే "శ్రీ ఖాజామెయినుద్దీన్ చిస్తే"గారు. తల్లిదండ్రులు వీరికిచ్చిన పేరు "హాసన్" ప్రవక్త మహమ్మదులవారివలనే, వీరిజీవితం గూడా అద్భుతావహమైన మహిమల మయమే. సత్యము, ధర్మము, శాంతి, కరుణ వంటి దైవీగుణాలు వీరి ఆభరణాలు. అక్బరు చక్రవర్తి, అజ్మీరుకెప్పుడు వచ్చినా, వస్తువాహనాదు లన్నింటిని మైలుదూరంలో వదలి, పాదచారియై వచ్చేవాడు. సనాతన సాంప్రదాయ బద్దులమయిన ముస్లిమ్‌వలెనే, ఔరంగజేబు కూడా, సమాధుల సేవను గర్హించేవాడు. కాని అజ్మీర్‌లోని శ్రీ చిస్తేగారి సమాధిని ఎందరో దర్శించి, రక్షణ పొందడం, వారినాలోచింపజేసింది. సహచరుల ప్రోద్భలంతో అజ్మీర్‌వచ్చి, శ్రీ చిస్తేగారి సమాధిని దర్శించి ముగ్ధుడై "ఇస్సలామ్ ఆ లేకుమ్" అంటూ అభివాదం చేశాడు. వెంటనే సమాధి నుండి "అస్సలామ్ ఆ లేకుమ్" అని ప్రత్యభివాదం విన్పించింది. అద్భుతావహమైన ఈ మహిమ, వారి కండ్లను తెరిపించింది. ఆనాటి నుండి జీవితాంతము శ్రీ చిస్తేగారి సేవకు అంకిత మయ్యాడు.

శ్రీ చిస్తేగారి తల్లిపేరు "బీబీ మహానూర్" తండ్రిపేరు "ఖాజాగయా సుద్దీన్ హాసన్" వీరు ఎక్కడ పుట్టింది, ఎప్పుడు పుట్టింది స్పష్టంగా తెలియనప్పటికి, సుమారు 1135 ఎ.డి. పుట్టివుండవచ్చని చరిత్రకారులు అంచాన. చిన్నతనం నుండి వీరు కుల, మత, జాతి, విచక్షణలు పాటించకుండా, జీవులందరి పట్ల దయతో ఉండేవారు. తల్లులతో వీరింటికివచ్చిన పిల్లలకు పాలిమ్మని తల్లిని మారాం చేసేవారు. వారు పాలుతాగుతుంటే చూచి ఆనందపడేవాడు. సాటి పిల్లలను ఇంటికిరమ్మని, సుష్టుగా తినబెట్టి సంతోషపడేవాడు. ఈద్ పండగనాడు, క్రొత్త గుడ్డలు ధరించి, తల్లదండ్రులతో మసీదుకు పోతున్నాడు. చినిగిన గుడ్డలతో, దీనావస్తలోనున్న అంధబాలుడు, దారిలో కనబడ్డాడు. తన గుడ్డలను అతనికివేసి, చేయిపట్టుకొని ప్రార్థనకు తీసుకపోయిన కరుణామయుడు. 9వ ఏడు వచ్చేసరికి "ఖురాన్" మొత్తం కంఠస్తం చేసాడు. ప్రవక్త మహమ్మదుల వారివలెనే, 15వ

ఏట తల్లిదండ్రులను కోల్పోయాడు. 1150 ఎ.డి.లో తండ్రి పోయేనాటికి, వారి భాగానికి వచ్చిన ద్రాక్షతోట జీవనాధారమైంది. ఒకనాడు తోటకు నీరు పెడుతున్నాడు. "హజరత్ ఇబ్రహీమ్ కందోజీ" అను ఔలియా, తోటకు వచ్చారు. పెద్దలను శ్రద్ధాభక్తులతో సేవించే సంస్కారమున్న శ్రీ చిస్తీగారు, వారికి మంచి ద్రాక్షపండ్లను సమర్పించారు. ఔలియా తృప్తిచెంది, సంచిలోని రొట్టెముక్కను చప్పరించి శ్రీచిస్తీగారి నోటిలో పెట్టాడు. తెలియని శక్తి, శరీరంలోనికి ప్రవేశించినట్లయి, తన్మయత్వం కలిగింది. ఆనాటి నుండి వారికి పరమాత్మపై అనురక్తి, ప్రాపంచిక విషయాలపై విరక్తి పెరగాయి. ద్రాక్షతోటను అమ్మి, వచ్చిన పైకాన్ని పేదలకు పంచి, దేశయాత్రకు బయలుదేరాడు. "సమర్‌ఖండ్" అను చోట స్థిరంగా వుండి, అక్కడి సిద్ధ పురుషులకు సేవచేసి, 20వ సంవత్సరం వచ్చేదాకా, అనేక విద్యలు నేర్చుకున్నారు. 1156 ఎ.డి.లో ఇరాక్‌చేరి "గౌస్-ఉల్-అజామ్" అను ఔలియాను సేవించారు. వారి నుండి ఈ క్రింది దీవెన అందుకున్నారు. "నీవు లక్షలాది మానవులను సన్మార్గంలోనడిపి, మహాత్ముడుగా ప్రసిద్ధికెక్కి అందరి ప్రేమను పొందుతావు". ఆ తర్వాత అరేబియాచేరి "హరూన్" అనుచోట తనగురువు "హజరత్ కాజా ఉస్మాన్ హరూనీ"ని కలిశారు. శ్రీ చిస్తీగారి ఔన్నత్యాన్ని గుర్తించి దీక్షనిచ్చి శిష్యునిగా చేసుకొని, రెండున్నర సంవత్సరాలు కఠిన సాధనలు చేయించారు. వీరెంత గురుకృపకు పాత్రులయ్యారంటే, వారికానాడే శిష్యసేకరణజేసి గురుసాంప్రదాయంలో స్థిరపడేందుకు, గురువాజ్ఞ లభించింది. ఆ తర్వాత 1160 ఎ.డి.లో సిరియాచేరి, మారుమూల గుహల్లో తపస్సు చేసుకుంటున్న "మహమ్మద్-అల్-వాహిషుజ్ను" అను మహనీయుని సేవించారు. అక్కడ నుండి పాదయాత్ర భారతదేశం వైపు మళ్ళింది. దారిలో "బాహూకర్" అనుచోట నొక అంధ "దర్వేష్"కు సేవ చేశారు. వారికా అంధత్వమెలా వచ్చిందని ప్రశ్నించారు. "భగవత్ దర్శనమయ్యాక, నాకు లోకమంతా భగవన్మయంగా గోచరించేది. కానీ ఒకనాడు ఈ చర్మచక్షువులతో దుఃఖభూయిష్టమైన లోకాన్ని చూస్తున్నాను. భగవంతుని చూచిన కండ్లతో, ఈ లోకాన్ని ఎలా చూడగలుగుతున్నావని, అశరీరవాణి

ప్రశ్నించింది. నా అజ్ఞానానికి సిగ్గుపడ్డాను. ఈ లౌకికదృష్టిని తీసివేయమని, భగవంతుడ్ని ప్రార్థించాను. వెంటనే ఈ అంధత్వం వచ్చింది. ఇప్పుడు నిరంతరం భగవంతుడ్నే చూస్తున్నాను" అని సమాధానమిచ్చారు. వారి త్యాగానికి ఆశ్చర్యపడ్డాను. అక్కడ నుండి "మెమ్నా" చేరి "హజరత్ ఖాజా అబ్దుల్ సయ్యద్" యను మహాత్ముని సమాధి దర్శించి దివ్యానుభూతిని పొంది రెండు సంవత్సరాలక్కడే వున్నారు. తర్వాత 11-11-1165న ఆనాటి భారతదేశంలోని "ముల్తాన్" కు వచ్చి, నొక దుర్వేష్‌ను కలువగా, భగవన్మార్గంలోనున్న వారికి యీ క్రింది మూడు పశ్చాత్తాపాలు ఉండాలని శ్రీ చిస్తేగారికి చెప్పారు. 1) పాపపు పనుల జోలికి వెళ్ళినపుడు 2) భగవంతుని శక్తిని మరచి, అహంకరించినప్పుడు. 3) అరిషడ్వర్గాలని గ్రహం కోల్పోయినప్పుడు. తర్వాత లాహోర్‌వచ్చి "షేక్ ఫిర్ అలీ హజవేరి" అను మహాత్ముని దర్గావద్ద రెండువారాలు ప్రార్థనలుచేసి బాగ్దాదుకు తిరిగివచ్చారు. బాగ్దాదులోని "ఖాజా జునియాద్" గారి దర్గావద్ద పరమ పూజ్యులైన తనగురువు "హజరత్ ఖాజా యుస్మాన్ హరూని" గారిని తిరిగి కలిశారు. వారానాడు వేలాది శిష్యుల మధ్య కూర్చొని యున్నారు. భక్తి ప్రపత్తులతో, శ్రీ చిస్తేగారు నమస్కరించగానే, "కాబావైపు తిరిగి 21సార్లు కురాన్ పఠించు" అని ఆజ్ఞాపించారు. శ్రీ చిస్తేగారి చేతులు పట్టుకొని "నీకు భగవంతుని దర్శనం ప్రసాదిస్తాను" అన్నారు. తన టోపీని కోటును వారిచేత ధరింపచేశారు శ్రీ చిస్తేగారు. ఆకాశంవైపు చూచినప్పుడు ప్రభుసింహాసనందాకా, భూమివైపు చూచినప్పుడు పాతాళపు అంచులదాకా కనిపించాయి. భగవత్ దర్శనం పొందినవారి పవిత్రతను తెలిపే కురాన్‌లోని సూరాలను 1000 సార్లు పఠించమన్నారు. ప్రక్కనేవున్న ఇటుకరాయిని తెమ్మన్నారు. దానిక్రింద బంగారు నాణాలు వున్నాయి, వాటిని పేదలకు పంచి రమ్మన్నారు. శ్రీ చిస్తేగారు గురువుగారి ఆజ్ఞలన్నీ శిరసావహించారు. గురువుకు సంపూర్ణ శరణాగతి చెందినవాడే నిజమైన శిష్యుడు. ఆ తర్వాత గురుశిష్యులిద్దరూ మక్కాకు బయలుదేరారు. అంతర్ముఖులై, ఏమాత్రం బాహ్య ప్రజ్ఞలేని, మహాత్ములెందరినో దారిలో దర్శించారు. కాబాలో శ్రీ చిస్తేగారి గురువుగారు శిష్యుని

ఆధ్యాత్మిక శ్రేయస్సుకై ప్రార్థనచేసి శిష్యుడ్ని భగవంతుని కప్పగించారు. "వారిని మేమంగీకరించామని" అశరీరవాణి పలికింది. తర్వాత ఇద్దరూ మదీనాకు వచ్చారు. ప్రవక్త మహమ్మదుల వారి సమాధివద్ద ప్రార్థనలు చేశారు. "మీకు శాంతి, శుభములు కలుగుగాక" అని అశరీరవాణి పలికింది. "నీవు పూర్ణుడయ్యావని" శ్రీ చిస్తేగారిని గురువు ఆశీర్వదించారు. తిరిగి అక్కడ నుండి బయలుదేరారు. గురువుగారిమూట నీళ్ళ కూజాలనుమోస్తూ పదిసంవత్సరాలు గురుసేవ చేసారు. ఈ కాలంలో శ్రీచిస్తేగారు ఎందరో మహాత్ముల సేవచేసి ఆశీస్సులందుకున్నారు. గురు శిష్యులిద్దరూ మొదట డెమాస్కస్ చేరారు. ఇక్కడ ఒక మసీదు ప్రక్కన, 12వేల ఔలియాల సమాధులున్నాయి. ఇక్కడ ప్రార్థనలు చేసినవారి కోర్కెలు ఫలిస్తాయంటారు. వారిద్దరూ ఈ మసీదులో, కొన్ని రోజులున్నారు. గురువాదేశంపై శ్రీచిస్తేగారు రొట్టెలను సృష్టించి, అక్కడున్న వారందరికి పంచారు. వారిలో ఒకడు "విచారణ జరిగేరోజున, ప్రభువు ప్రవక్తలపట్ల శాంతచిత్తులై ఉంటారు కాని స్వార్థపరులైన ధనికులను శిక్షిస్తారు" అన్నాడు. "మహమ్మద్ అరిఫ్" యను ఔలియా ప్రభువును ధ్యానించగానే ప్రమాణ వాక్యాలున్న గ్రంథాన్ని, దేవతలు వారిచేతిలో పెట్టారు. శ్రీచిస్తేగారిక్కడ ఇలాంటి సన్నివేశాలెన్నింటినో చూచారు. తరువాత వారిద్దరూ బాగ్దాదుకు వచ్చారు. గురువు తనశేష జీవితాన్ని ఏకాంతంగా గడపదలిచారు. చీకటిపడ్డాక శిష్యుడ్ని తనవద్దకు పిలిపించుకొని ఎన్నో యోగరహస్యాలను చెప్పారు. "నీకిచ్చిన ఆధ్యాత్మిక సంపదను జాగ్రత్తగా కాపాడుకో" అన్నారు. తనసటకాను, కోటును, ఆసనాన్ని గంధపుచెక్కలను వారికిస్తూ ఇవి పరమ పవిత్రులైన మహమ్మదుల వారి నుండి మనకు సంక్రమించాయి. అర్హుడైన శిష్యుడు లభించాక అప్పగించు. దేనినీ వుచితంగా తీసుకోవద్దు. శక్తిమేరకు జీవుల సేవచెయ్యి. సుఖదుఃఖాలను భగవత్ ప్రసాదాలుగా భావించు. వినమ్రుడవై గడ్డిపోచవలె జీవించు. గురు సాంప్రదాయాన్ని పవిత్రంగా కొనసాగించు" అని చెపుతూ, వారిని కౌగిలించుకొని నొసటిమీద ముద్దుపెట్టుకున్నారు. గురువును బాగ్దాదులో విడిచి వెళ్ళేనాటికి శ్రీచిస్తేగారి వయస్సు 52 సంవత్సరాలు. తర్వాత కాలంలో శ్రీచిస్తేగారు

గురువాక్యాలను గ్రంధస్తం చేస్తూ "గురువునుండి పొందిన జ్ఞానాన్ని గ్రంధస్తం చేసి లోకానికి అందించినవాడే నిజమైన శిష్యుడ"ని వ్రాశారు.

అక్కడ నుండి బయలుదేరి శ్రీచిస్తేగారు ఒకచోట స్థిరంగా వుండక, పాదచారియై తిరుగుతుండేవారు. సమాధుల మధ్య రహస్యంగా వుంటూ, తన ఉనికిని భక్తులు పసిగట్టగనే మెల్లగా జారుకునేవారు. 1187లో మదీనా వచ్చి ప్రవక్త మహమ్మదులవారి సమాధివద్ద ప్రార్థనలు చేసారు. "నీవల్ల మేము సంతృప్తి చెందాము. నీకు ముక్తిని ప్రసాదించాము. నీకిష్టమైన దానినికోరుకో అను గ్రహిస్తాము" అని ఆకాశవాడి పలికింది. అందుకు శ్రీచిస్తేగారు "మీ సేవలోనున్న నా అనుయాయులకు, శిష్యులకు కూడా ముక్తిని ప్రసాదించండి" అని ప్రార్థించారు. అందుకు మహమ్మదుల వారంగీకరిస్తూ, ఈహుకుం జారీచేసారు. "ఓ మిత్రమా! బాగ్దాదులోని కుతుబుద్దీన్ భగవంతునికి ఇష్టుడు. నీ శిష్యున్ని చేసుకొని అజ్మీర్ వెళ్ళి భగవంతుని మహిమను ప్రచారంచేసి ప్రజల జీవితాలను వెలుగుతో నింపు" ఆ అజ్మీర్ ఎక్కడవుందో వారికి తెలియలేదు. ఒకనాడు ధ్యానంలో భారతదేశంలోవున్న అజ్మీర్ స్పష్టంగా గోచరించింది. ఆరోజే అజ్మీర్‌కు బయలుదేరాడు. దారిలో బాగ్దాదులో "శ్రీకుతుబ్‌షా"ను పిలిపించి శిష్యునిగా స్వీకరించి, కోటునిచ్చి సత్కరించారు. "మితంగా భుజించు. మితంగా నిద్రించు. ఏకాంతంగా ధ్యానించు భగవత్ సాక్షాత్కారానికి ధ్యానమొక్కటే శరణ్యము. ప్రవక్తల గ్రంధాలను భక్తి పారవశ్యంతో చదువు, జీవులను భగవ న్మార్గానికి మళ్ళించు సమస్తాన్ని త్యాగంచేసి భగవంతునిపై విశ్వాసంతో జీవించు" అని వారికిచెప్పారు. బాగ్దాదునుండి శ్రీచిస్తేగారు ఆఫ్గనిస్తాన్ వచ్చి ఒకతోటలో విశ్రమించారు. ఆ తోట రాజుగారిది. తోటమాలి వచ్చి రాజు కొద్దిసేపట్లో తోటకు వస్తున్నాడని, వెంటనేవారు తోటవిడిచి వెళ్ళడం మంచిదని చెప్పాడు. శ్రీచిస్తేగారు "నీవు భయపడకు, ప్రశాంతంగా జరుగుతున్నదంతా చూడు. భగవంతుని శక్తి ఏమిటో నీకు తెలుస్తుంది" అన్నారు. ఇంతలో రాజువచ్చి తోటలో నూతన వ్యక్తిని చూచి ఉగ్రుడై తోటమాలిని తిట్టాడు. తలఎత్తి శ్రీచిస్తేగారు

రాజుకండ్లలోకి నిశితంగా చూచాడు. రాజు నిర్వీర్యుడై స్పృహతప్పి పడిపోయాడు. చిస్తీగారు ఖురాన్ చదువుతూ, అతని ముఖంపై నీళ్ళు చల్లగనే, తిరిగి స్పృహ వచ్చింది. శ్రీచిస్తీగారిని మహాత్మునిగా తెలుసుకున్న రాజు, అతడి సేవకుడు, వారి పాదాలపైబడి క్షమాభిక్ష నర్థించారు. ఆ రాజును క్షమించి తన శిష్యునిగా చేసుకున్నారు. తర్వాత 1911లో శ్రీచిస్తీగారు 40 మంది శిష్యులతో అజ్మీర్ చేరి, ప్రస్తుతం ఇందర్ కోటవున్న ప్రదేశంలో చెట్లక్రింద విశ్రమించారు. అదంతా ఆ ప్రాంతపు హిందూరాజుగారి ఒంటెలు విశ్రమించే స్థలమంటూ రాజభటులు శ్రీచిస్తీగారిని అక్కడ నుండి వెళ్ళగొట్టారు. రాజాజ్ఞను మన్నించమన్న శాస్త్రవాక్యాన్ని స్మరించి శ్రీచిస్తీగారు ఆ చోటు విడిచి వెళ్ళిపోయారు. ఆ రాత్రి అక్కడపడుకున్న ఒంటెలు ఎంత యత్నించినా లేవలేకపోయాయి. ఇది తాము వెళ్ళగొట్టిన ఔలియా మహిమ అని తలచి రాజభటులు వారి పాదములపైబడ్డారు. వెంటనే ఒంటెలు లేచి నిలబడ్డాయి. అక్కడ నుండి "ఫంజనాన్" చేరారు. శ్రీషహాయుద్దీన్ అనురాజు సైన్యంతో అక్కడకు చేరారు. వీరికి శ్రీచిస్తీగారు స్వప్నదర్శనమిచ్చి భారతదేశానికి రాజవుతావని చెప్పారు. ఈ సైన్యంతో శ్రీచిస్తీగారు 1192 ఎ.డి.లో ఢిల్లీకి, అక్కడనుండి అజ్మీర్‌కు చేరారు. అజ్మీర్ ప్రాంతాన్ని పాలిస్తున్న హిందూరాజు శ్రీచిస్తీగారి రాకను తెలుసుకొని, "తక్షణం తన రాజ్యంవిడిచి వెళ్ళమని" కఠినంగా శాసించాడు. శ్రీచిస్తీగారు "మూడు రోజుల్లో యెవరు వెళ్ళిపోవాలో తేలిపోతుంది" అన్నారు. అప్పటికే ఢిల్లీ నాక్రమించిన "మహాబుద్దీన్" మూడవరోజుకు అజ్మీర్ చేరాడు. ఆ రాజు రాజ్యాన్ని విడిచి వెళ్ళవలసి వచ్చింది. మహాత్ములను అవమానపరచిన ఫలితం, ఎంతటివారైనా అనుభవించక తప్పదు. మహాబుద్దీన్ శ్రీచిస్తీగారి శిష్యుడైనాడు. బీబీ అస్మతుల్లాను అజ్మీర్‌లో వివాహమాడారు. ఇటీవల ఉదయగిరిలో సమాధైన "శ్రీహజరత్‌మియా చిస్తీగారు ఈ సద్గురు వంశీయులే.

శ్రీచిస్తీగారి శిష్యుడు "శ్రీకుతుబుద్దీన్" బాగ్దాదు నుండి ఢిల్లీవచ్చి గురుదర్శనం కోసం అజ్మీర్‌కు కబురు పంపాడు. "మీకు ఢిల్లీపై ఆధ్యాత్మిక సార్వభౌమత్వాన్ని

ప్రసాదించాము. అక్కడికే వచ్చి దర్శనమిస్తామని" శ్రీచిస్తీగారు జవాబు పంపారు. వారు డిల్లీవచ్చి శిష్యునికి అనేక యోగ రహస్యాలను తెలియజేశారు. 2-4-1215 నాడు డిల్లి వచ్చిన, తనగురు సన్నిధిన, శ్రీచిస్తీగారు కొంతకాలం గడిపి దివ్యానుభూతిని పొందారు. గురువాజ్ఞపై డిల్లీలో స్థిరపడి శ్రీకుతుబుద్దీన్, గురుదర్శనానికై అజ్మీర్ వచ్చాడు. ఆనాటి నమాజు సమయంలో, శ్రీచిస్తీగారి నేత్రాలు అశ్రుపూరితాలయ్యాయి. "మేము తనువు చాలించపోతున్నాము. ఇదే మాకు విశ్రాంతి స్థలము" అన్నారు. గురుప్రసాదంగా తనకు లభించిన వస్తువులను శిష్యుని కందించారు. శిష్యుడు గురుపాదాల క్రింది మట్టిని తీసి, కండ్లకద్దుకొని, ముద్దుపెట్టుకున్నాడు.

ఆనాటి నుండి వారిలో వృద్ధాప్య చిహ్నాలు కనపడసాగాయి. చివరకు 21-5-1229 నాటి రాత్రి, నమాజుచేసి, కుటీరంలోకి వెళ్ళి తలుపువేసుకున్నారు. ఆరాత్రి వారిగదినుండి యోగనాదం రాత్రంతా వినిపిస్తూనే వుంది. ఉదయం నమాజు సమయానికి ఆ నాదమాగింది. గదితలుపులు తెరవగా వారుదేహత్యాగంచేసి వున్నారు. ఆనాటికి వారి వయస్సు 97 సంవత్సరాలు. శ్రీచిస్తీగారి శిష్యులకు ప్రవక్త మహమ్మదులవారు స్వప్నదర్శనమిచ్చి, "మాకెంతో ఆప్తుడైన శ్రీచిస్తీగారిని, మా సన్నిధికి రపించుకున్నామని ఓదార్చారు. శిష్యుడైన "కుతుబుద్దీన్" కు వారు స్వప్నదర్శనమిచ్చి "ఆ ప్రభువు దయవల్ల నాకు దేవతల సాన్నిధ్యం లభించింది" అన్నారు. ప్రవక్తలందరివలెనే శ్రీచిస్తీగార్ని అజ్మీర్‌లో వారు నివసించిన స్థలంలోనే సమాధి చేసారు. సమాధికి పూర్వము, తర్వాత వారి నుండి ప్రకటమైన మహిమలకు లెక్కలేదు. ఒక గొడ్డుబోతు ఆవు వారి ఆజ్ఞపై పాలు ఇచ్చింది. ప్రజలను హింసించిన నగర పాలకుడు గుర్రం క్రింద పడి మరణించాడు. అయితే శ్రీచిస్తీగారికి ఇంత సామర్థ్యమెలా వచ్చింది? శ్రీచిస్తీగారు ఒకనాడు శిష్యులకు, ఆత్మప్రబోధ చేస్తున్నాడు. వారిదృష్టి కుడివైపుకు మళ్ళినప్పుడల్లా వినయ విధేయతలతో లేచి నిలబడినమస్కరిస్తున్నాడు. అందుకు కారణం అడిగిన

శిష్యులతో "ఆ వైపు నాగురుదేవుని సమాధివుంది. అటు తిరిగినప్పుడల్లా నా గురువుకు భక్తి ప్రపత్తులు తెలియజేసుకుంటున్నాను" అన్నారు. అంతటి గురుభక్తే వారి దివ్యత్వానికి కారణమయింది. వారి సూక్తులలో కొన్ని "ఆకలిగొన్న వారికి అన్నంపెట్టు, మహాత్ముల సాన్నిధ్యానికి మించిన సాధనలేదు. తాను గొప్పవాడినని పవిత్రుడనని చెప్పుకునేవాడు జైలు జీవితాన్ని గడుపుతున్నట్లే, కుల మత జాతి వర్ణ వర్గ విచక్షణ పాటించకుండా అందరికీ సహాయం చెయ్యి" హిందువులు ముస్లిములు వేలాది సంఖ్యలో వారిదర్గాను దర్శిస్తుంటారు సర్వమత సామరస్యానికి సర్వమానవ సౌభ్రాతృత్వానికి శ్రీచిస్తీగారి శిష్యులే ఆదర్శప్రాయులు.

పగటివేళచుక్కలు కనపడనంత మాత్రాన అవి లేవనగలమా, అట్లే కనపడనంత మాత్రాన దేవుడు లేడనకూడదు.

కాలమే ఉత్తమ గురువు - ప్రపంచమే ఉత్తమ గ్రంథం.

ధర్మాచరణ, ధర్మరక్షణ, సాధకునికి ప్రధానం. ధర్మరక్షణలో అనంతమైన పుణ్యం వస్తుంది. జీవుల మధ్యనాటుకోవలసినది ధర్మం పట్ల ప్రీతి, గౌరవాలు.

# మాస్టర్ దర్శనం - 18

## మాస్టర్‌గారితో నా అమృత యాత్ర

1978 సంవత్సరం అక్టోబర్, 11వ తేది బుధవారం, పవిత్ర విజయదశమి రోజు మాస్టర్‌గారిని నేను మొదటిసారిగా షిరిడీలో గురుస్థానం వద్ద అనుకోకుండా కలసినా, దీని వెనుక శ్రీసాయి అదృశ్య హస్తముందని తర్వాత ఘటనలు నిరూపిస్తాయి. ఇద్దరు మహాత్ముల సన్నిధిలో (బాబా సన్నిధి, బాబాగారి గురుసన్నిధి అయిన గురుస్థాన్ వద్ద) పరస్పరం ఒకరినొకరు పరిచయం చేసుకున్న ఆరోజు మరువలేనిది. ఈ పరిచయం క్రమేపీ వృద్ధి చెంది, మాస్టర్‌గారు మా ఇంటికివచ్చి, సాయి సత్సంగాలతో, విద్యానగర్, ఒంగోలు సాయి మందిర నిర్మాణాలచే నిష్కామ సేవతో, చవిటి భూముల్లాంటి మా జీవితాలను సారవంతంచేసి, సాయిభక్తి బీజాలు నాటారు. మా జీవితాల్లో ఈనాడు తొణికిసలాడుతున్న తృప్తి, శాంతి, ఆనందాలు, వారుపెట్టిన భిక్ష. సాయి సద్గురు భక్తియనే, మహదైశ్వర్యాన్ని ప్రసాదించిన, ఆ మహనీయుని ఋణ మేనాటికి తీరదు.

మాస్టర్‌గారి వల్ల ప్రభావితులైన సాయి భక్తులంతా, 1979 డిశెంబరులో షిరిడీ యాత్రకు సిద్ధమయ్యారు. అందుకు మాస్టర్‌గారి ఆశీస్సులు తోడయినాయి. మాస్టర్‌గారి తపోక్షేత్రమైన విద్యానగర్, పుట్టపర్తి, మంత్రాలయం, గణ్గాపూర్, అక్కల్‌కోట, పండరిల మీదుగా షిరిడీ చేరాలని, తిరుగు ప్రయాణంలో మాణిక్యనగర్ దర్శించాలని సంకల్పించాము. ఈ యాత్రలో మాస్టర్‌గారితో అమ్మగారుకూడా పాల్గొనడమొక విశేషం. బహుశా మాస్టర్‌గారితో అమ్మగారు షిరిడీ దర్శించడమిదే చివరిసారి.

భక్తులు సాయికి జేజేలు పలుకుతుండగా, బయలుదేరిన బస్సు, నెల్లూరులో ప్రింట్ అయిన సాయి లీలామృతాలను బస్సులో వేసుకొని, విద్యానగర్ బయలు దేరింది.

ఈ యాత్రలో పాల్గొన్న భక్తులు, శ్రీ సాయి లీలామృతం, మాస్టర్‌గారి ప్రేమామృతం రుచి మరిగిన వారే! చిరునవ్వుతో కూడిన మాస్టర్‌గారి పలకరింపు నందుకొని, వారి పాదాలకు నమస్కరించుకోవాలని మా మనసులు, తహతహ లాడుతున్నాయి. విద్యానగర్ చేరుకున్న భక్తులు, షిరిడీ చేరినట్లు తృప్తి చెందారు. బస్ దిగిన వెంటనే తోసుకుంటూ, నెట్టుకుంటూ, మాస్టర్‌గారి దర్శనానికి వేగంగా పోతున్నారనడం కంటే, పరుగెడుతున్నారనడం సమంజసంగా వుంటుంది. వారి గదిలో మాస్టర్‌గారు, తూర్పు ముఖంగానో, ద్వారానికెదురుగా ఉత్తర ముఖంగానో, కూర్చుంటారు. ఆ గదిలో తూర్పున, మహాత్ముల కూటమిలోనున్న సాయినాథుడు, మాస్టర్‌గార్ని చూస్తుంటాడు. మాస్టర్‌గారితోపాటు, మహాత్ముల స్పర్శ తగిలిన పవిత్ర వస్తువులనేకమున్న మూలాన, గంభీరమైన ప్రశాంతత, యోగశక్తి ఆగదిలో ఆవరించి వుంటాయి. దత్త సాంప్రదాయాన్ని తలపింపజేస్తూ ఒకటి రెండు కుక్కలు ధ్యానముద్రలో, భక్తుల మధ్య వుంటాయి. చిత్రమేమంటే, ఇవి గురువారం రాత్రి, సాయి ప్రసాదంగా కొబ్బరిముక్కలు, అరటి ముక్కలు తిని, ఉపవాసముంటాయి. మాస్టర్‌గారి దర్శనానికి పరుగులు పెడ్తున్న భక్తుడు, క్రింద ఏముందో చూచుకోకుండా, గుమ్మం ముందున్న రోజులు నిండని కుక్కపిల్లను తొక్కాడు. విలవిలా తన్నుకొని, అది చనిపోయింది. తల వ్రేలాడేసి పడివున్నదాన్ని, అటుఇటు త్రిప్పి పరిశీలించి ఊపిరాడక చనిపోయిందని తేల్చారు. కుక్కను చంపిన పాపం దేవాలయం కట్టించినా పోదని అంటారు గదా పెద్దలు. దీనితో ఆ కుక్కను తొక్కిన భక్తుడు, పుణ్యానికి వచ్చి పాపాన్ని మూటకట్టుకున్నానేమిరా దేముడా అంటూ దుఃఖిస్తున్నాడు. పవిత్ర యాత్రలో ఈ అపశృతి దొర్లిందేమో అనుకున్నాను.

ఇంతలో, గుమ్మం దగ్గర కుక్కపిల్ల చనిపోయిన నిజము, ఈ పాపాన్ని నెత్తిన వేసుకున్న భక్తుని మనోవేదన, మాస్టర్‌గారిని చేరాయి. ఆ కుక్కపిల్లను తీసుకురమ్మన్నారు. దానిపై బాబా విభూది చల్లి, వళ్ళో వేసుకొని, మా ప్రయాణ

వివరాలడుగుతూ, నమస్కరిస్తున్న భక్తులకు విభూది పెడ్తూ బాబా ఆశీస్సులతో సంతకాలు చేసి పుస్తకాలను పంచుతూ, స్థానిక కార్యకర్తలకు ముఖ్య సూచనలిస్తూ దాదాపు అర్థగంట పైగా గడిపారు. మాస్టర్‌గారి పవిత్ర సన్నిధిలోని ప్రగాఢశాంతి, యోగశక్తి, భక్తులను తన్మయులను చేస్తున్నాయి.


ఇంతలో మాస్టర్‌గారి వళ్ళోని కుక్కపిల్ల, తడబడుతూ నడుచుకుంటూ, గుమ్మం దగ్గరి తల్లిని చేరింది. అక్కడున్న భక్తుల ఆనందాశ్చర్యాలకు అవధులు లేవు.

**ఆ మూగ జీవికి ప్రాణం పోసి, పాపం చేశానని తపిస్తున్న భక్తుని మనోవేదనవంతం చేసి, మా యాత్రలో దొర్లిందనుకున్న అపశృతిని సవరించారు.**

సజ్జనుల దర్శనం, పాప, తాప దైన్యాలను నశింపచేస్తుందంటే ఇదే కాబోలు. మా హృదయాలు ఆనంద నిలయాలయ్యాయి. జన్మ మృత్యుజరా వ్యాధుల నుండి రక్షించగలవాడే, సద్గురుడన్న సత్యాన్ని మాస్టర్‌గారు, ఋజువు చేశారు. కానీ వారు మాత్రం, ఈ సంఘటనకే మాత్రం ప్రాధాన్యత నివ్వలేదు. అప్పుడుగాని ఆ తరువాతగాని, ఈ విషయాన్ని గురించి మాట్లాడంగాని, మాట్లాడనివ్వడంగాని చెయ్యలేదు. శ్రీ తాజుద్దీన్‌బాబా, శ్రీ గజానన్ మహరాజ్, శ్రీ అక్కలకోట స్వామి చరిత్రలో ఇట్టి సంఘటనలు చూచినప్పుడు, ఆనాటి మాస్టర్‌గారి దివ్యత్వం పూర్తిగా మాకర్థమయింది.

శ్రీ మాస్టర్‌గారి విందు భోజనం తర్వాత, వారు, అమ్మగారు, మేము సద్గురు సాయినాథునికి జేజేలు పలుకుతూ, పుట్టపర్తికి బయలుదేరాము. ఆ రాత్రికే బద్వేల్‌చేరి, అక్కడి మాస్టర్‌గారి శిష్యుల గురుభక్తికి, సేవా నిరతికి, ప్రేమ అప్యాయతలతో నిండిన ఆతిథ్యానికి, ముఖ్యంగా వారి త్యాగభావానికి ఆశ్చర్యపడ్డాము. "త్యాగేనైన అమృతత్త్వసిద్ధ్యతి" అన్నారు కదా పెద్దలు.

పుట్టపర్తికి ఫోన్‌చేసి, అక్కడ స్వామి లేరని తెలపుసుకొని, కొంత నిరుత్సాహ పడ్డాము. మా అభ్యర్థనపై ఆర్.టి.ఓ. నిర్ధారించిన రూట్ మారిస్తే, చిక్కులొస్తాయని తెలియడంతో పుట్టపర్తికే ప్రయాణం సాగించాము. కానీ సకల





సాధు స్వరూపుడైన సద్గురు సాయినాథుని అనుంగు బిడ్డనైన మాస్టర్ గారికి దర్శనమివ్వ తపించని మహాత్ముడుండడని, నా మట్టి బుర్రకు తట్టలేదు.

మర్నాడుదయానికి పుట్టపర్తి చేరాము. అక్కడి వసతులు చూచేందుకు, ఎంక్వైరీ ఆఫీసుకు పోతున్న మాకు, ప్రక్కనే ప్రశాంతి నిలయం కన్పించింది. అద్భుతం, ఆశ్చర్యం. ప్రశాంతి నిలయం ముందున్న తోటలో నిలబడి, స్వామి భక్తుడు చెప్తున్నదేదో ఆలకిస్తున్నారు. "సాధూనాం దర్శనం పుణ్యం" అని కదా ఆర్యోక్తి. మహనీయులైన మాస్టర్‌గారితో ఉంటే మహాత్ముల దర్శనం కరతలామలకమన్నది నా స్వానుభవం.

శ్రీసాయి మాస్టర్‌లకు జేజేలు చెప్పుకుంటూ, అక్కడి నుండి మంత్రాలయం మీదుగా పవిత్ర దత్తక్షేత్రం గణ్గాపూర్ చేరాము. దారిలో మాస్టర్‌గారు ఆ క్షేత్ర మహిమను, శ్రీ గురుపాదుకల మహిమను, అక్కడ చేసుకోవలసిన శ్రీ గురుచరిత్ర పారాయణ, సంగమస్నానం, ఔదుంబర వృక్ష ప్రదక్షిణలను వివరించారు. సంగమ స్నానాదులను ముందు ముగించుకొని, మధ్యాహ్నానికి శ్రీ గురు పాదుకలుండే మఠానికి చేరుకున్నాము. చొక్కాలు విప్పి, విస్తరాకులు చేతబూని, మాస్టర్‌గారితో భిక్షాటన చేశాము. శ్రీ నృశింహ సరస్వతీ స్వామి మాతో ఉన్న అనుభూతి కల్గింది. అక్కడి నుండి అక్కల్‌కోట చేరి, వటవృక్ష మఠం, బాలప్ప మఠం, చోళప్ప మఠాలు దర్శించాము. బాలప్ప మఠాధిపతి శ్రీ గజానన్ మహరాజ్‌గారి, వటవృక్ష మఠంలో శ్రీ స్వామి సమర్థుల ప్రత్యక్ష శిష్యుడి, (శతాధిక వృద్ధుడు) దర్శన భాగ్యం కల్గింది. అక్కడి నుండి పండరి మీదుగా పవిత్ర షిరిడీ చేరాము.

దారిలో మాస్టర్‌గారు షిరిడీలో చేయకూడనివి, చేయవలసినవి వివరంగా చెప్పారు. చివరి రోజున తప్ప, అంగళ్ళలో కాలంవృధా చేసుకోకూడదన్నారు. శ్రీ సాయి పాద స్పర్శతో పవిత్రమైన షిరిడీ నేలను పాదరక్షలతో తొక్కరాదన్నారు. తను కూడా చెప్పులు బస్సులో వదిలి, క్రిందికి దిగేటప్పుడు చివరి మెట్టుపై నిలిచి, ముందుకు వంగి నేలపై మట్టి నందుకొని, కొంత శిరస్సుపై వేసుకొని,

మిగిలింది నొసట పెట్టుకున్నారు. శ్రీ సాయి పాదస్పర్శతో పునీతమైన ఆ పవిత్ర నేలపై కాళ్ళు మోపవలసినందుకు, క్షమాపణ చెప్పుకొని, ఆ నేలకు నమస్కరించుకున్నారు. అనన్య సామాన్యమైన వారి గురుభక్తి మమ్ములను మంత్రముగ్ధులను చేసింది. ఆసనం, అగ్గిపెట్టె, అగరుబత్తీలు, పారాయణ గ్రంధాలు సంచిలో వేసుకొని, సాయి తిరిగిన ప్రదేశాల్లో పూజ, పారాయణ, ధ్యానం చేసుకోవాలన్నారు. శ్రీ సాయి 60 సం॥ పాటు, భక్తులకు దివ్యలీలలు చూపిన ద్వారకామాయిలో ఎక్కువ సమయం గడపమన్నారు. మహాత్ములు మరణాతీతులు. కనుక దేహత్యాగంతో వారి అవతారకార్యం ఆగదు. అందుకని భక్తితో పారాయణ చేసేవారికి సాయి అనుగ్రహం నేటికీ లభిస్తున్నది. కనుక ద్వారకామాయిలో శ్రీ సాయి చరిత్ర పారాయణ పూర్తి చేసుకోమన్నారు. మాస్టర్ గారికి, అమ్మగారికి గురుస్థానం వెనుక సాయికాశ్రయమిచ్చిన వేపచెట్టు క్రింద సాతేవాడాలో మాకు గురుస్థాన్ ముందున్న వాడాలో, రూములు దొరికాయి. (ఈ నిర్మాణాలు ఇప్పుడు లేవు) షిరిడీలో సాయి తిరిగిన ప్రదేశాల్లో తిరుగుతూ, అప్పుడప్పుడూ భక్తులకు దర్శనమిస్తూ వారి యక్ష ప్రశ్నలకు జవాబిస్తూ మాస్టర్ గారెంతో తృప్తిగా, ఉల్లాసంగా కన్పించారు. అందుకు కారణమడిగిన నా శ్రీమతితో "పుట్టింట్లో ఉన్నప్పుడు మీకెలా వుంటుందో, షిరిడీలో వున్నప్పుడు నాకలా ఉంటుంది. క్రొత్త ప్రదేశంలో ఉన్నట్లు ఉండదు. మన స్వంత ఊళ్ళో తల్లిదండ్రుల దగ్గరున్నట్లుంటుంది. ఇదీ షిరిడీ ప్రత్యేకత" అన్నారు.

షిరిడీలో తనకెవ్వరు నమస్కరించరాదని సున్నితంగా ఆదేశించారు. చావడిలోని శ్రీ శివనేశన్ స్వామికి మాస్టర్‌గారన్నా, మాస్టర్ గారికి శివనేశన్ స్వామియన్నా ప్రేమ, భక్తి, గౌరవం, అప్యాయతలుండేవి. ఈ ప్రేమను శివనేశన్ స్వామిగారు మాస్టర్‌గారి శిష్యులపై కూడా చూపేవారు. మాస్టర్‌గారు భక్తులకు షిరిడీలోని దర్శనీయస్థలాలను చూపిస్తూ, అక్కడ నిర్వహించుకోవలసిన పూజాదికాలను వివరించారు. ఏ కారణంగానో, షిరిడీ చేరిన కొన్ని గంటలకు జ్వరము, తలనొప్పులతో తీవ్ర అస్వస్థతకు నేను గురి అయ్యాను. ప్రపంచంతో సంబంధం

లేకుండా, ఒకరోజంతా మంకుగా పడివున్నాను. నా తీర్థయాత్ర అంతటితో సరియని గురుబంధువులనుకున్నారు. మాస్టర్ గారొకసారి చూచి వెళ్ళారుట కానీ, నాకు స్పృహ లేదు. మాస్టర్‌గారు కూడా లేపవద్దన్నారుట. ఇలా రోజంతా గడిచింది. మరురోజు భోజన సమయానికి నా గదికివచ్చిన మాస్టర్‌గారు, నా చేయి పట్టుకొని చూచి, ఎలావుందన్నారు. "నీరసంగా వుందని చెప్పగా" భయంలేదు. జ్వరం తగ్గిపోతుంది. యాత్రా నిర్వహణతో లోపల పేరుకున్న వత్తిడి, ఇక్కడ విడుదల కావడమే జ్వరానికి కారణం. వేదమ్మకు కూడా ఇంతే ఎప్పుడు షిరిడీకి వచ్చినా ఏదో ఒక అస్వస్థతకు లోనవుతుంది. ఇందుకు సాయి షిరిడీలో మన ప్రారబ్ధాన్ని అనుభవింపచేసి, రద్దు చేయడం కూడా కారణం కావచ్చు. నాతో వచ్చి తేలికగా అరిగే ద్రవాహారం తీసుకోండి" అన్నారు.

ప్రేమస్వరూపులైన మాస్టర్‌గారి ఆజ్ఞను శిరసావహించి వారి వెంట నడిచాను. నీరసంతో కాళ్ళు తడబడుతున్నాయి. ఈ స్థితిలో అన్నం తింటే వికటించి జ్వరం తిరగబెడితే.... తల్లిబిడ్డను ప్రేమించినట్లు గురువు శిష్యుని ప్రేమిస్తాడు గదా. తల్లిలాంటి మాస్టర్‌గారుండగా నాకేమి భయము... ఇలా సాగుతున్నాయి ఆలోచనలు. మాస్టర్‌గారి ప్రక్కనే భోజనానికి కూర్చున్నాను. రెండు ముద్దలు నా చేతబెట్టి తినమన్నారు. అవిలోపలికి జారేసరికి చిరుచెమటలు పోయసాగాయి.

చారు, మజ్జిగలతో, భోజనం ముగించాను. ఆ సమయంలో నాకు జ్వరమని గుర్తు రాలేదు. అక్కడి నుండి నడుస్తూ రూముకు వచ్చేసరికి, జ్వర లక్షణాలు పూర్తిగా మాయమయ్యాయి. ఆశ్చర్యంగా మనసు తేలికబడింది. నా జ్వరానికి మాస్టర్ పెట్టిన రెండు ముద్దలే దివ్యౌషధము. నా జ్వరం తగ్గాలన్న వారి దివ్య సంకల్పమే వైద్యుడు. శ్రీ సాయి వలెనే నిషిద్ధ పదార్థాలతో నా రోగం తగ్గించారు. శ్రీ సాయివలెనే మాస్టర్‌గారు కూడా సంకల్ప సిద్ధులు వారి సంకల్పంతో, అసాధ్యాలు సాధ్యం కావడం నేనెన్నో సార్లు చూచాను. గురుకృప సర్వాన్ని సిద్ధింప చేస్తుందని గురుగీత చెప్పింది అక్షరసత్యం.

"గురురేవ పరంబ్రహ్మ । గురురేవ దయానిధి ॥


తత్కృపాలేశమాత్రేణ । సర్వంసిధ్యతి నాన్యధా ॥" అంటుంది గురుగీత.

శ్రీ సాయి మాస్టర్‌ల దయతో మిగిలిన పుణ్యక్షేత్రాలను దర్శించగలిగాను. తన గురు స్మరణలో నిలచిన శ్రీ మాస్టర్‌గారి సన్నిధి, అధిక పుణ్యఫలప్రదమని, భక్తులు నాల్గుమూలల నుండి షిరిడీ చేరుకున్నారు. ఆ రోజుల్లో శ్రీ సాయి సమాధి చుట్టూ వున్న అరుగనెక్కి మనం తెచ్చుకున్న మాలను సాయి మెళ్ళో వేయనిచ్చేవారు. పన్నీటితో సమాధికి, విగ్రహానికి స్నానం చేయనిచ్చేవారు. సమాధికి ఇరువైపులా ఉన్న ద్వారాల గుండా ప్రదక్షిణాలు చేయనిచ్చేవారు. విభూతి సమృద్ధిగా దొరికేది. ఎన్ని రోజులున్నా రూము ఖాళీ చేయమనేవారు కాదు. హారతి సమయాల్లో తప్ప, సమాధికెదురుగా కూర్చొని పారాయణ, ధ్యానం చేసుకోనిచ్చేవారు.

ఇన్ని లాభాలుండేవి. అన్ని మార్గాల్లో శ్రీ సాయినాధుని తృప్తిగా సేవించి, మాణిక్యనగర్, హైద్రాబాద్‌ల మీదుగా ఒంగోలు, విద్యానగర్ చేరుకున్నాము.

-- శుభం --

నారాయణ సమారంభాం శంకరాచార్య మధ్యమాం
అస్మదాచార్య పర్యంతం వందేగురు పరంపరాం





# మాస్టర్ దర్శనం - 12

## వేదవిజ్ఞాన సర్వస్వం ఆచార్య రూపేణావతిష్ఠతి

పరిపక్వధ్యానావస్థలో ఆత్మవేత్తలైన మహర్షుల నుండి బహిర్గతమైన శాశ్వత సత్యాలే వేదవిజ్ఞాన సర్వస్వమంతా. స్వయోచనతో అన్వేషణామార్గంలో స్వానుభవ పూర్వకంగా పూజనీయ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టర్‌గారు తెలుసుకున్న అనేక విషయాలకు వేదం ప్రమాణంగా నిలవడం వారి దివ్యత్వానికి సంకేతం. ఉదాహరణకు : విజ్ఞాన వీచికలు గ్రంథ ఉపోద్ఘాతంలో మాస్టర్‌గారిలా అన్నారు.

సమాజంలో నాలుగు రకాల వ్యక్తుల్ని చూస్తాం.

1. ఆస్తికతను గుడ్డిగానమ్మి ఎట్టి అన్వేషణ, యోచన చేయక మతాచారాలను పాటిస్తూ జీవించేవారు కొందరు (వీరే గుడ్డి ఆస్తికులు)
2. ఆస్తికతే సర్వ అనర్థాలకు మూలమని గుడ్డిగా నమ్మి దానిని అపురూపముగా యత్నించేవారు కొందరు (వీరే గుడ్డి నాస్తికులు)
3. జీవితానికి ఏ గమ్యమూ లేకుండా పాశవికంగా బావిలో కప్పలలాగా జీవించేవారు కొందరు. (పైరెండు తెగలకు చెందని జడమతులు)
4. అన్వేషకులు

వీరందరిలో **"అన్వేషకుడు మాత్రమే నిజమైన మనోవికాసాన్ని చెందుతున్న మానవుడు" అంటూ ఇటువంటి అన్వేషణ (లేక జిజ్ఞాస)కు దోహదం చేయడమే ఈ గ్రంథం యొక్క లక్ష్యమన్నారు.**

ఇట్టి అన్వేషణ, యోచన, జిజ్ఞాసలు, మాత్రమే ముముక్షువులకు జ్ఞానాన్నిస్తాయని, అట్టి జ్ఞానం వల్ల మాత్రమే నిరతిశయమైన తృప్తి, ఆనందాలు జీవులకు లభిస్తాయని తెల్పే ఋషి వాక్యాలను స్మరిద్దాం.

ప్రస్థానత్రయమైన ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు భగవద్గీతలను లోకానికందించిన శ్రీ వ్యాసమహర్షి బ్రహ్మసూత్ర గ్రంథారంభంలో "అథాతో బ్రహ్మజిజ్ఞాస" (ఆ తర్వాత అనగా సాధనా చతుష్టయ సంపత్తి కల్గిన తర్వాత బ్రహ్మమును గూర్చి విచారణ చేయవలయును) అంటూ ఈ జిజ్ఞాసనే జ్ఞానానుభూతికి ప్రధానాంగంగా పేర్కొన్నారు. శ్రుతులు "జ్ఞానాదేవతాకైవల్యం" (జ్ఞానముచేతనే ముక్తి ప్రాప్తిస్తుంది). "నాన్యః పంథా విద్యతే యనాయ" న+అన్య+పధాః+విద్యతే ఈ మార్గములలో ముక్తి తెలియదు అన్నాయి. మరొకచోట "శాంతో, దాంతో, ఉపరతస్తితీక్ష స్సమాహితో భూత్వా ఆత్మనేవ్వా ఆత్మానం పశ్యతి" (శమాదిషట్క సంపత్తి కలిగి బ్రహ్మవిచారము చేసినవాడే ఆత్మ సాక్షాత్కారము పొందగలడు) అని తెల్పాయి. "ఆత్మావా, అరే! ద్రష్టవ్య శ్రోతవ్యో, మంతవ్యో నిధి ధాయసితవ్య" (ఆత్మనుగూర్చి శ్రవణమనన, నిధి, ధ్యానలుజేసి ఆత్మజ్ఞానము ప్రాప్తింవ చేసుకొనవలయును) అని బృహదారణ్యకోపనిషత్తు తెల్పుతున్నది. – శ్రీ ఆదిశంకరాచార్యులవారు.

"కర్మణా చిత్తశుద్ధశ్చ

చిత్తైకాగ్ర్యం ఉపాసనా

వస్తుసిద్ధిర్ విచారణ" అంటూ

పరమాత్మ ప్రాప్తికి ఆత్మవిచారమే శరణ్యమన్నారు. ఈ విధంగా ఉదహరిస్తే వేదఋషులలో, శ్రీ ఆదిశంకరాచార్యులవంటి ఆత్మవేత్తలలో, పూజనీయ మన మాస్టారుగారిలో ప్రకటమవుతున్న "భావసారూప్యతలు" "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" అను శృతివాక్యాన్ని రుజువుచేస్తున్నాయని రూఢిగా చెప్పవచ్చు.

భార్య, భోజనము, ధనములందు తృప్తిపడుము లేనిచో అనర్థము సంభవిస్తుంది.

# మాస్టర్ దర్శనం - ౨౦

పూజ్య మాస్టారిగారితో షిరిడీ దర్శించే భాగ్యం నాకు అనేకసార్లు ప్రాప్తించింది. వారి ప్రథమ పరిచయ భాగ్యం షిరిడిలోని గురుస్థానం వద్ద అంటే శ్రీసాయి ఎక్కడ తన గురువును 12 సం॥లు అనన్యంగా సేవించారో అక్కడే నాకు, నా శ్రీమతికి సాక్షాత్తు సాయినాథుడే నా గురువుతో సమాగమ మేర్పరచినారు. ఇది శ్రీసాయి నాకు, నా శ్రీమతికి ప్రసాదించిన మహితవరం. షిరిడిలో బస్‌దిగేటప్పుడు మాస్టరుగారు పవిత్ర షిరిడీ మన్నును కండ్లకద్దుకుని నెత్తిపైచల్లుకునేవారు. శ్రీసాయినాథుని పవిత్ర స్పర్శసోకిన షిరిడి మన్ను కూడా వారికి పవిత్రమే. అంతేకాదు. అంతటి పుణ్యభూమిపై కాళ్ళు మోపుతున్నందుకు క్షమాపణ చెప్పుకుంటున్నట్లు హృదయంపై చేతినుంచి కొద్దిక్షణాలు సాయిస్మరణలో నిలిచేవారు. పాదరక్షలు లేకుండానే షిరిడి నేలపై కాళ్ళు మోపేవారు. అనన్యసామాన్యమైన వారి గురుభక్తికి శ్రీసాయినాథుడే సాటి. అక్కడ వున్న రోజుల్లో అనిర్వచనీయమైన తృప్తి, శాంతి, ఆనందాలతో పూజ్యగురుదేవులు పరవశించేవారు.

మాస్టర్‌గారి సంకల్పం దైవసంకల్పమే. ఇక్కడ మందిర నిర్మాణయోచనేలేని రోజుల్లో వారు ఒంగోలులో కొన్ని లక్షలవ్యయంతో సాయి మందిరం నిర్మించబడి, రెండో షిరిడిగా ప్రసిద్ధికెక్కుతుంది అన్నారు. కాలాంతరంలో ఇది సిద్ధించిన విషయం మనకందరికి తెలిసినదే. ద్వారకామాయి నిర్మాణంలో కొన్ని చిక్కులు తలెత్తాయి. చాలా తీవ్రమైన ఆ చిక్కులను ఎలా పరిష్కరించాలో, ఏమి చేయాలో పాలుపోక సమస్య పరిష్కారానికి మాస్టర్ నాశ్రయించాము. వారు సమస్య విని అదేముంది, మందిరాన్ని కొంచెం ముందుకు జరిపికడితే అందరి సమస్య పరిష్కారమవుతుంది. కాబట్టి మందిరాన్ని కొంచెం ముందుకు పెంచండి అన్నారు. కాని ఆనాటికి మందిర ఎకౌంట్‌లో పైసా కూడా లేదు. కొన్నివేలు ఖర్చుపెట్టి మందిరాన్ని ముందుకు జరుపడమెలా సాధ్యమో తోచలేదు. కాని

చిత్రంగా ఆ తర్వాత కొద్దికాలానికే పరిస్థితులన్నీ అనేక మలుపులు తిరిగి మందిరాన్ని ముందుకు జరపక తప్పని స్థితి ఏర్పడింది. ఆగ్నేయ దిశలో ధునిస్థాపన జరిగింది. ఇది సిద్ధించటానికి మాస్టారి సంకల్ప సిద్ధే కారణం. తరువాత కాలంలో షిరిడి నుంచి ధునిని తెచ్చి (మాస్టారి స్వహస్తాలతో) ఒంగోలు మందిర ధునిలో కలపటం తలచుకుంటే ఆశ్చర్యానందాలతో ఒళ్ళు పులకరిస్తుంది. ఒంగోలుకు ఇంతటి మహత్తర వరం ప్రసాదించటానికి నన్ను సాయి మొదటి భక్తునిగా ఎన్నుకోవటం చూస్తే నాకు సాయి కల్గించిన ఈ అవకాశానికి సాయినాధునికి ఎలా కృతజ్ఞతలు తెలపాలో అర్థంకాదు.

మాస్టర్‌గారు తనని కలిసిన వారందరిని సమానమైన ప్రేమతో ఆదరించి నప్పటికి భగవాద్వేషనలో నిమగ్నులై ముక్తికై తపిస్తున్న సాధకులపై ప్రత్యేక శ్రద్ధ, ప్రేమలుండేవి. నేనొకసారి మాస్టారితో షిరిడీలో వున్నాను. 'గురుచరిత్ర పారాయణ చేస్తున్నారా' అని మాస్టారు నన్ను అడిగారు. నేను పుస్తకం వెంట తెచ్చుకోలేదని సమాధానమిచ్చాను. సమీపంలో గురుచరిత్ర పారాయణ చేస్తున్న ఒక భక్తునితో 'గురుచరిత్ర గ్రంధాన్ని నాకు ఇవ్వమని, పారాయణ చేసుకుని ఇస్తారని మాస్టారు అన్నారు. కాని తన పారాయణ ఆగిపోతుందని ఏమో ఆయన ఇవ్వలేదు. మాస్టారు మౌనం వహించారు. కాని తన మాటను ఖాతరు చేయలేదన్న బాధ వ్యక్తం చేయలేదు. నిర్వికారంగా వుండిపోయారు. కాని నేను బాధపడ్డాను. ఈ సన్నివేశమంతటికి అంతర్లీనంగా ఏదో తెలియని ప్రాముఖ్యత వుంటుందని నా మనసుకు తోచింది. బహుశా నాకు గురుచరిత్ర పారాయణ యోగ్యత లేక వారికి బుద్ధిపుట్టలేదేమో. లేక నాకు పవిత్ర షిరిడీలో గురుచరిత్ర పారాయణకు సహకరించి పుణ్యం సంపాదించుకునే అవకాశాన్ని వారు జారవిడుచుకున్నారో తెలియదు. అదేరోజు సాయంత్రం సాయి భక్తుడు విద్యానగర్‌లో తన శిష్యుడు మాస్టర్ దర్శనానికి వచ్చాడు. అతడు తీవ్రసాధనలో ఉన్నాడనిపించింది. మాస్టర్‌గారతనిని పలకరించిన విధానం, అతడిపై చూపిన ప్రేమ, అభిమానం కూడా నా భావాన్ని బలపరచాయి. "నీవు పనిచేస్తున్న వూళ్ళో

సత్సంగాలు ప్రారంభించావాలేదా" అని అడిగారు. "నాకు ఆ సత్సంగాలపై నమ్మకం లేదు. కాబట్టి ప్రారంభించలేదు" అని ధైర్యంగా జవాబిచ్చాడు. త్వరలో సత్సంగాలను ప్రారంభిస్తానని మాట ఇచ్చావుకదా. సత్సంగాలెంత ముఖ్యమైనవో ఎన్నోసార్లు చెప్పాను. సరే నీవు వెళ్ళి హారతి ప్రారంభం కాబోయే ముందు సమాధి మందిరంలో సాయికెదురుగా వంద గుంజిళ్ళు తీసి, తర్వాత నాకు కన్పించు" అన్నారు. సరేనంటూ అతడు వెళ్ళిపోయాడు. శిష్యుడిపై మాస్టారు కురిపించిన ప్రేమ, ఆప్యాయతలు, గురువుపై శిష్యునికిగల అచంచల భక్తి, విశ్వాసాలు నన్నాశ్చర్యపరచాయి. నేనెప్పుడు షిరిడి వెళ్ళినా మాస్టారుగారితో అక్కడ గడపగల అదృష్టం లభించింది. నేను మాస్టారితో షిరిడీకి బయలుదేరుతున్నానని తెలిసి, అమ్మగారు నా శ్రీమతిని పిలిచి ఇలా అనేవారు "మాస్టారితో సుబ్బయ్యగారు షిరిడి వెళ్తున్నారటకదా నాకు ధైర్యంగా వుంటుంది. వారికి కావలసిన అవసరాలు, వసతులు సుబ్బయ్యగారు చూసుకుంటారు. సుబ్బయ్యగారి బ్యాగ్‌లో మాస్టారికి కావలసినవన్ని వుంచిన ఈ బ్యాగ్ కూడా పెట్టండి" వారి దంపతుల ఆప్యాయత, సాయికృప, నా గురుదేవులకు సేవచేసే అవకాశం పవిత్ర షిరిడీలో నాకు లభ్యమయ్యేలా చేసేవి.

శ్రీసాయి బిడ్డడైన మాస్టర్‌గారు తన జీవితానుభవాలన్ని సాయి ప్రసాదాలుగా గుర్తించేవారు. మాస్టర్‌గారొకసారి ఉపన్యసించాలని స్థానిక సాయి మందిరానికి వచ్చినప్పుడు వారి చెప్పులు ఎవరో స్వంత చేసుకున్నారు. మాస్టారు దీన్ని గురించి పట్టించుకోలేదు. ఒకసారి మా అబ్బాయి, నా సైకిలు వేసుకుని షాపు దగ్గర మరచిపోయి ఇంటికి నడిచి వచ్చాడు. రాత్రి 10 గం॥లకు సైకిలు కోసం వెతికిన నా శ్రీమతి సైకిలు కనపడకపోయేసరికి, మాస్టారి ఇంట్లో వున్న నా దగ్గరకు వచ్చి చెప్పింది. నేను లేవబోతే మీ సైకిలు ఎక్కడికి పోదు కూర్చోండి అని మాస్టర్ అన్నారు. నేను వెళ్ళి వెతకకపోతే సైకిలు ఎలా దొరుకుతుంది అనుకున్నాను. రెండుసార్లు లేవబోతే మరలా మాస్టారు అదేమాట అన్నారు. ఇక చేసేది లేక నా శ్రీమతి ఇంటికి వెళ్ళి నిద్రపోతున్న మా అబ్బాయిని లేపి

సైకిలు సంగతి అడిగింది. షాపు దగ్గర మరచిపోయానని, జేబులో తాళం ఇచ్చాడు. వరండాలో వున్న ఇద్దరు సత్సంగ సభ్యులకు తాళం ఇచ్చి సైకిలు తెమ్మని పంపింది. వాళ్ళు పదినిమిషాలలో సైకిలు తెచ్చారు. వీళ్ళు సైకిలు దగ్గరకు వెళ్ళేసరికి ఒక ముసలాయన వీళ్ళతో 'ఈ సైకిలు మీదా నాయనా ఎవరైనా ఎత్తుకెళతారని ఇక్కడనే కూర్చున్నానని వెళ్ళిపోయాడుట. వాళ్ళు సైకిలు మాస్టారి ఇంటికి తెచ్చి నాకు సైకిలు దొరికిందని చెప్పారు. నేను మాస్టారివంక ఆశ్చర్యానందాలతో చూసి వారికి పాదాభివందనం చేశాను.

మాస్టారితో నేను మా అమ్మగారితో కలిసి మొదటి దత్తావతారులైన శ్రీపాద శ్రీ వల్లభులు అంతర్ధాన క్షేత్రము "కురుగడ్డ" వెళ్ళాము. దాదాపు నడుంలోతు నీళ్ళలో మూడు ఫర్లాంగులు నడిచి, కృష్ణనుదాటి, కురుగడ్డ చేరాలి. నీళ్ళ అడుగున రాళ్ళు ముళ్ళు ఉన్నాయి. మేమంతా చెప్పులతోనే నది దాటుతున్నాము. కాని యోగ సిద్ధులైన పూజ్యగురుదేవులు కాళ్ళకు చెప్పులు లేకుండానే శరవేగంతో దూసుకుపోతూ అందరికన్నా ముందుగా నది దాటారు. వారి పాదాల్లో ముళ్ళు గుచ్చుకొనివుంటాయని నా అనుమానం. క్షేత్ర పూజారుల నుండి వివరాలు సేకరించే హడావుడిలో వారున్నందువల్ల ఈ విషయాన్ని ప్రస్తావించలేక పోయాను ముఖ్యమైన ప్రదేశాలను దగ్గరుండి చూపించారు. చివరగా శ్రీ వాసుదేవానంద సరస్వతిస్వామి, చాతుర్మాస్య దీక్ష చేసిన గుహను చూపి స్వామివారిక్కడ వున్నప్పుడు గణగాపూర్‌లోని శ్రీ నృశింహసరస్వతి స్వామి వారి నిర్గుణ పాదకుల నుండి అక్కడి సేవకుల నిర్లక్ష కారణంగా రక్తం స్రవించిందని, ఏమి చేసినా రక్తం ఆగనప్పుడు ఇక్కడవున్న శ్రీస్వామివారికి కబురుచేస్తే వారు చాతుర్మాస దీక్ష విరమించి గణగాపూర్‌వెళ్ళి నిరాహారులై దత్తస్మరణలో నిలిచి దత్తానుగ్రహంతో ఆ రక్తస్రావాన్ని ఆపి, తిరిగి కురుగడ్డ వచ్చి చాతుర్మాస దీక్ష కొనసాగించారనిచెప్పారు. ఆ తర్వాత తపోక్షేత్రమైన కురుగడ్డ ప్రాశస్త్యాన్ని దత్త సాంప్రదాయాన్ని వివరిస్తున్న వారితో పడవకోసం నిరీక్షిస్తూ నదిఒడ్డున కూర్చున్నాము. మాస్టారి పాదాల్లో చాలాముళ్ళు విరిగివున్నాయి. అన్ని ముళ్ళలో

మానవమాత్రులు ఒక్క అడుగైనా వేయలేరు. శ్రీ రమణుల వలనే శారీరక సుఖాలపట్లనేకాక, కష్టాల పట్లకూడా అనాసక్తులైన వారి యోగ నిష్ఠకు మేము ఆశ్చర్యపోయాము. ముళ్ళను తీస్తున్నప్పుడు మాస్టర్‌గారు "పాతముల్లునా, కొత్త ముల్లునా తీస్తారు" అంటూ శ్రీ రమణ లీలోకదానిని చెప్పారు. శ్రీ రమణులు, ఒక భక్తునితో అరుణగిరి పాదాల దగ్గర కాలిబాటన నడుస్తున్నారు. భక్తుని కాలిలో ముల్లు గుచ్చుకుంది. భగవాన్ వచ్చి ముల్లు తీశారు. కొంచెం దూరం నడిచాక రమణుల కాలులో పెద్దముల్లు విరిగింది. భక్తుడు వెళ్ళి భగవాన్ పాదంలో చూస్తే ఎన్నో ముళ్ళున్నాయి. ఇంతలో భగవాన్ ఏ ముల్లుని తీస్తావు "పాతదా, కొత్తదా" అంటూ ముల్లుతోనే పాదం నేలపై రాశారు. ముల్లు పాదంలోనే విరిగిపోయింది. హాయిగా నడుచుకుంటూవెళ్ళిపోయారు. మాస్టారికి నెప్పి పుట్టిందోలేదోగాని, ముళ్ళను చాలా శ్రమపడి తీశాను. ఇంతలో పడవ వస్తే కృష్ణను దాటి అవతల ఒడ్డుకు చేరుకున్నాము.

ఐ.ఏ.ఎస్. పాసై కలెక్టర్ హోదాలో నుండవలసిన మాస్టారిలో అణుమాత్రమైనా అహం కన్పించదు. వారు శని, ఆదివారాల్లో విద్యానగర్ నుండి ఒంగోలు వచ్చి సత్సంగాల్లో సాయి తత్వాన్ని వివరించేవారు. సోమవారం ఉదయమే కాలేజీకి వెళ్ళాలంటూ ఆదివారం రాత్రికే తిరుగు ప్రయాణం అయ్యేవారు. కాని అంత అర్ధరాత్రివేళ స్టేషన్‌కు ఒక్కొక్కసారి రిక్షా దొరికేదికాదు. మాకానాటికి స్కూటర్లు లేవు. మా కంగారు గమనించిన వారు పక్కన సైకిల్ చూపుతూ ఇది వుందిగా పదండి పోదాం అనేవారు. దానిపై వారిని స్టేషన్‌కి చేర్చేవారం. అంతటి మహనీయుని అప్పుడప్పుడు ఇలా స్టేషన్‌కు చేర్చినందుకు నేనీనాడు సిగ్గుతో తల వంచుకుంటున్నాను. ఇది పూజ్యగురుదేవుల నిరహంకారతకు, మా అసమర్థతకు అద్దం పడుతుంది. మాస్టారు ఒక సత్సంగంలో ఇలా చెప్పారు. "సాధారణ గురువులు ప్రహరీగోడకన్నా చాలా పొట్టివారు. గోడకు అవతల ఏముందో వారు చూడలేరు. మనకు చూపించలేరు. శ్రీసాయినాథుడు ఆకాశమంత ఎత్తైనవారు. వారు సర్వాన్ని చూడగలరు. వారి

కృపకు అర్హులమైతే మనకు చూపించగలరు. అందుకే మాస్టారు షిరిడీలో వున్న సమయాన్నంతా సాయి ధ్యానంలో గడపమనేవారు. సాటిజీవుల ఆధ్యాత్మిక శ్రేయస్సుకేకదా మాస్టారి జీవితం అంకితం. అందుకే భక్తులీనాడు వారిని సాయి ప్రతిరూపంగా దర్శిస్తూ నీరాజనాలు అర్పిస్తున్నారు. వారి దివ్యపాదాలు నాకూ, నా శ్రీమతికి శిరోధార్యాలు. వారి ఆశీస్సులు మా దంపతుల మీద కురిపించాలని కోరుకుంటున్నాను.

మాస్టరుగారితో నేను గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ శంఖుస్థాపనా మహోత్సవానికి వెళ్ళాను. కొందరు ఆశ్రమ కార్యకర్తలు "మీరనేక ఆశ్రమాలను దర్శించారు. సిద్ధపురుషులనే సేవించారు. ఈ ఆశ్రమానికి కూడా మీరే ప్లాన్ వేస్తే శుభప్రదంగా వుంటుంది" అంటూ మాస్టర్‌గారిని ప్రార్థించారు. అప్పటికే మాస్టర్‌గారు విద్యానగర్‌లో పెద్ద సాయిబాబా మందిర నిర్మాణం చేయటం జరుగుతుండటంతో బహుశావారు మాస్టారిని అలా కోరివుండవచ్చు. మాస్టర్‌గారు కొంతసేపు అంతర్ముఖులైనారు. స్కేలు, కాగితం తెప్పించి, స్వామి భక్తులతో చర్చించి విషయ నిర్ధారణ చేసి చివరకు ప్లాను తయారుచేసి వారి ముందుంచారు. కానీ ఏ కారణంగానో ఆ ఆశ్రమ నిర్మాణ దాతలకు, ముఖ్యులకు ఆ ప్లాను తృప్తిగా లేదు. తిరిగి స్వామి భక్తులంతా కూర్చుని తర్జన భర్జనలు పడి నాలుగైదు ప్లానులు తయారు చేశారు. శంఖుస్థాపన ముహూర్తం దగ్గర పడుతోంది కాని, ఆశ్రమ ప్లాన్ నిర్ధారణ కాలేదు.

ఇంతలో మాస్టర్‌గారి దర్శనానికి ఢిల్లీ ప్రాంతం నుండి భక్తులు వచ్చారు. వారు విద్యానగర్‌వెళ్ళి మాస్టర్‌గారు గొలగమూడిలో ఉన్నారని తెలుసుకుని ఇద్దరు సిద్ధపురుషులను ఒకేసారి దర్శించుకోవచ్చునన్న కోరికతో గొలగమూడి చేరుకున్నారు. మాస్టర్‌గారు వారి శిష్యబృందమంతా కలిసి, ఈ తర్జన, భర్జలు జరుగుతున్న స్థలానికి దూరంగా వున్న కాల్వగట్టు దగ్గరకు వెళ్ళి సాయి సత్సంగంలో నిమగ్నులయ్యారు. మాస్టారి సాన్నిధ్యంలోని ప్రశాంతతలో మునకలు వేస్తున్నాము. ఇంతలో ఆశ్రమకార్యకర్తలు పరుగుపరుగున మాస్టారి దగ్గరకు

వచ్చి "మేము విషయ నిర్ధారణ చేయలేక భక్తులు వేసిన ప్లానులన్నీ వెంకయ్య స్వామి ముందు వుంచాము. ఆయన మీరు నిర్ధారించిన ప్లానుతీసి మా చేతికిచ్చారు. ముహూర్తం దగ్గరపడుతున్నది. మీరు వచ్చి గీతలు గీయించి, ఈశాన్య భాగంలో గుంటతీయటానికి ప్రారంభం చేయండి" అంటూ ప్రార్థించారు. "శుభం" అంటూ మాస్టారు లేచి ఆ కార్యక్రమాన్నంతా సంతోషంగా పూర్తి చేశారు. తను సూచించిన ప్లానును కాదని, ఇంత తర్జన, భర్జనలు జరిపి నందుకు మాస్టరుగారేమాత్రం మనసులో పెట్టుకోలేని నిగర్వి. అంతర్యంలో శ్రీమాస్టర్, స్వామి వేరైతేగదా. మాస్టరుగారి సంకల్పం యదార్థం కావటం మరోసారి మా కండ్లముందు కన్పించింది. ఆ శంఖుస్థాపన సమయంలో శ్రీ వెంకయ్యస్వామి చేత వెల్గించిన ప్రమిదను గుంటలో వేయించారు. స్వామి దూరం నుండి ఆ దీపారాధనను గుంటలోకి విసిరివేశారు. కాని అది శంఖుస్థాపన జరుగవలసిన స్థానంలోపడి, మనుషులు గుంటలోకి దిగి జాగ్రత్తగా చూచి పెట్టిన దానివలె వెల్గుతున్నది. ఎక్కడెక్కడి వాండ్లో మాస్టారిగారి దివ్యత్వాన్ని గుర్తించి, సేవించుకుని తరించి పోతుంటే, నిత్యం వారి సాన్నిధ్యంలో గడిపే మేము వారిమాట, చేతలపై విశ్వాసముంచుకోలేక పోవటం మా దౌర్భాగ్యం. ఎక్కడినుండో వచ్చిన తుమ్మెద పద్మంలోని మకరందాన్ని ఆస్వాదించిపోతుంటే క్రింద బురదలోనే వున్న కప్ప బెక, బెకలాడటంతోనే సరిపోతుందన్న సామెత మనసులో మెదిలింది. పూజనీయ మాస్టారు ఒంగోలులో సత్సంగాన్ని 1979లో స్థాపించారు. మా నివాసంలో ప్రారంభించిన సత్సంగాలు క్రమేపి ప్రసిద్ధిచెంది, వేలాది మందిని ఆకర్షించాయి. సాయి భక్తుల సంఖ్య పెరగడంతో సత్సంగాలు నిర్వహించే వారి సంఖ్య పెరిగి సాయి మందిర నిర్మాణానికి దారి తీసింది. ప్రస్తుత స్థలసేకరణ జరిగి ద్వారకామాయి సత్సంగహాలు నిర్మాణ తలంపు ఫలించింది. ఇంక కుంభాభిషేకం మిగిలివుంది. ద్వారకామాయిలో ప్రతిష్ఠించేందుకు కావలసిన సాయి పటాన్ని గీయించే పని ఒక భక్తునికి అప్పగించారు. చీరాల్లో నివసిస్తున్న ఒక చిత్రకారుని బాబా చిత్రం వేయమని కోరి తరచు మేము మాస్టారు ఆ పటాన్ని చూసివస్తూ అవసరమైన సూచనలను

చేస్తూ వుండేవాళ్ళం. సాయి పటాన్ని వేస్తున్నప్పుడు తనకు కలిగిన అనుభవాలను ఆ చిత్రకారుడు చెపుతూవుండేవాడు. ఒకసారి ఆయన తనకు 400 రూ॥ ఇస్తే మద్రాసువెళ్ళి రంగులు కొనుక్కుని వస్తానని నాతో అన్నాడు. అతను వస్తానన్న రోజుకు పైకం అందలేదు. ఎలాగా అనుకుంటున్నంతలో ఒక భక్తుడు వచ్చి మందిర నిర్మాణానికి తనవంతు విరాళంగా 400 రూ. ఇచ్చాడు. అక్కడువున్న ఆ చిత్రకారుడికి ఆ పైకం ఇచ్చాను. ఈ విధంగా క్లిష్టసమయంలో బాబా ఆదుకోవడం ఎన్నోసార్లు జరిగింది. ఒకసారి నేను, మాస్టర్‌గారు, రాధాకృష్ణ చీరాల నుండి బాబా చిత్రపటం చూసి, ఒంగోలుకు వస్తున్నాము. రైలులో కంపార్టుమెంట్ కిక్కిరిసి వుంది. ఎలాగో శ్రమపడి మాస్టరుగారికి మాత్రం సీటు చూసి వారిని కూర్చోమని ప్రార్థించాం. వారునన్ను కూర్చోమన్నారు. మీరు కూర్చుంటేనే మాకు తృప్తియని అన్న మీదట వారు కూర్చున్నారు. మేమిద్దరం నిలబడే వున్నాము. రైలు ఒంగోలు చేరే వరకు మాస్టర్‌గారెన్నో హాస్యపూరిత కథలను చెప్పి నిలబడివున్న మాకు శ్రమ తెలియకుండా చేశారు. గురుశిష్యులిద్దరు స్టేషన్‌లో రైలుకోసం ఎదురుచూస్తువున్నారు. ఇంతలో రైలు వచ్చింది. శిష్యుడు మర్యాద పూర్వకంగా గురువుగారిని ముందు రైలు ఎక్కమన్నాడు. అందుకు గురువుగారు ఒప్పుకోక తన కన్నాచిన్నవాడు, తనే సర్వస్వమని నమ్ముకున్నవాడైన శిష్యుని యోగక్షేమాలను పొడవునా కనిపెట్టి వుండవలసిన బాధ్యత తనపై వుంది కాబట్టి ముందు శిష్యుడ్ని ఎక్కమన్నాడు. ఇలా గురువు శిష్యుడ్ని, శిష్యుడు గురువును ఎక్కమని వాదించుకుంటుండగా రైలు కదిలిపోయింది. ఇప్పుడు ఈ సీట్లో కూర్చోమని మనిద్దరం వాదించుకుంటుంటే ఇంకెవరయినా వచ్చి కూర్చోవచ్చు కనుక నేనే కూర్చున్నానని మాస్టారు చెప్పారు.

ఒకసారి మాస్టారితో కలిసి 40 మంది సత్సంగ సభ్యులంనంద్యాలకు ఒంగోలు నుండి బయలు దేరాము. శ్యామాచరణ్‌గారి పుట్టినరోజు సందర్భంగా మాస్టారిని ఆయన నంద్యాలకు వచ్చి, సాయి సత్సంగం నిర్వహించవలసినదిగా

ఆహ్వానించారు. మాస్టారితో పాటు ఒక బస్సులో నంద్యాలకు బయలుదేరాం. నేను వెళ్ళే ప్రతిచోటుకి నా శ్రీమతి కూడా వచ్చేది. సాయిని నేను దర్శించే ప్రదేశాలన్నీ నాతోనే తను దర్శించాలని ఎలా ప్రార్థించేదో నాకు ఆశ్చర్యం వేసేది. అందరం 5,6 గంటలు ప్రయాణం చేసిన తరువాత దారిలో బస్సు కాఫీ, టిఫెన్లకోసం ఆపాడు. నేను, నా శ్రీమతి బస్సుదిగి ఎదురుగా వున్న హోటల్‌కి వెళ్ళాము. మిగిలిన వాళ్ళు కొంచెం దూరాన వున్న ఇంకో హోటల్‌కు వెళ్ళారు. మేమిద్దరం కాఫీ తీసుకుని తాగబోతుండగా నాకు బస్సులో వున్న మాస్టారు గుర్తుకు వచ్చి పరిగెత్తుకుని వారి దగ్గరకు వెళ్తున్నాను. మాస్టారు మా మధ్యకు వచ్చి 'నాకేది కాఫీ' అన్నారు. వెంటనే వారి పాదాలకు నమస్కరించి క్షమాపణ కోరాము. మిమ్మల్ని మరచి మేం కాఫీ తాగుదామనిపించిన మా అజ్ఞానానికి మీరే శిక్ష విధించినా మేం సిద్ధమే నన్న నా శ్రీమతి మాటలకు మాస్టారు నవ్వుతూ "నేను మీ ఇద్దరికి పెద్ద శిక్ష వేయబోతున్నాను. సిద్ధంగా వుండండి అంటూ బెంచి మీద కూర్చున్నారు. మమ్మల్ని వారికి ఇరువైపులా కూర్చోబెట్టుకుని "రాఖాడి బాబాగారి చరిత్ర" చెప్పారు. వారు చెప్పే ఆ మహాత్ముని చరిత్రవిని చాలా ఆనందించాము. అంతా బస్సు ఎక్కబోతూ మమ్మల్నిచూసి మాస్టారు మీకేమి చెప్పారని అడిగారు. మేం చెప్పింది విని మాకా అదృష్టం లేదని బాధపడ్డారు. ఆ తరువాత ముందుగా మాస్టారికి కాఫీ ఇచ్చి ఆ తరువాత మేం తాగుదామని నిర్ణయం చేసుకున్నాం. వారు బ్రూ కాఫీ ఎక్కువగా ఇష్టపడతారని, నేను వెంట బ్రూపొడి ప్యాకెట్ తీసుకుని వెళ్ళేవాణ్ణి. నేనే స్వయంగా వారికి కాఫీ కలిపి ఇచ్చేవాణ్ణి. వారు సత్సంగం మధ్యలో కాఫీ కావలసి వస్తే నా శ్రీమతికి కాఫీ కావాలని సైగ చేసేవారు. మాస్టారు చూపిన ప్రేమతో తరించిన పుణ్యజీవులం.

ఒకసారి మాస్టారు ఒంగోలు వచ్చినప్పుడు మా హాలంతా భక్తులతో నిండిపోయింది. పడుకోవటానికి ఎక్కడాచోటు కనపడలేదు. పిల్లలను వాళ్ళ మధ్యే సర్దిపడుకోబెట్టాము కాని మా ఇద్దరికి చోటులేదు. అలా కూర్చుని

నిద్రపోయాము. మాస్టారు పడుకున్న మంచం కోడుకు తల ఆనించి ముడుచుకుని కూర్చుని నిద్రపోయాను. వేకువన నిద్రలేచిన నేను మాస్టారికి కాఫీ అవసరం అవుతుందని నా శ్రీమతిని నిద్రలేపాను. మాస్టారులేచి వంట ఇంట్లోకి వచ్చారు. నాతో "ఇలా పిల్లలను పంపటం ఇదే ఆఖరిసారి" అన్నారు. మేం ఆశ్చర్యపోయాం. నేను మాట్లాడే అంతలో మాస్టారు "మీకు మీ భార్యపట్ల, మీ పిల్లల పట్ల వుండవలసిన బాధ్యతలు మీకు వున్నాయి. మీతోపాటు బాధ్యతలు అమ్మాయి (నాభార్య) సంతోషంగా పంచుకున్నా, ఆమెపట్ల భర్తగా మీరు చేయవలసిన కొన్ని బాధ్యతలు వున్నాయి. గృహస్థ ధర్మంగా మీరు నెరవేర్చవలసిన బాధ్యతలు నెరవేర్చకపోతే నా మాటపై విశ్వాసముంచి నేను మీ మీద వేసే అదనపు బాధ్యతలను మోయమని చెప్పటం నాకూ ధర్మంకాదు. మీరిద్దరూ రాత్రి కూర్చుని నిద్రపోతూ వుంటే నాకు చాలా బాధ వేసింది" అన్నారు. అదేమీ లేదు అని నేనంటే, ఏమిటో నాకు తెలుసు అంటూ కాఫీ కప్పునందుకున్నారు.